www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 20-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 51

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి ఉ.5.52 తదుపరి అష్టమి తె.4.55 వరకు; నక్షత్రం: ధనిష్ఠ రా.7.32 తదుపరి శతభిషం, వర్జ్యం: రా.2.33-4.07; దుర్ముహూర్తం: ఉ.8.20-9.11, రా.10.16-10.59; అమృతఘడియలు: ఉ.9.07-10.43; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.38

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సెల్ఫీ తీసుకున్నంత ఈజీగా వైద్యపరీక్షలు!

నిలోఫర్ ఆస్పత్రిలో దేశంలోనే తొలి 'నాన్ ఇన్వేజివ్ బ్లడ్ టెస్టింగ్' టూల్

నిమిషంలోపే రక్తపోటు, ఆక్సిజన్, హృదయ స్పందన, హెచ్‌బీఏ1సీ

'అమృత్ స్వస్థ్ భారత్' పేరిట అందుబాటులోకి

13



ఏఐ-ఆధారిత 'నాన్ ఇన్వేసివ్ బ్లడ్ టెస్టింగ్' ప్రక్రియను పరిశీలిస్తున్న వైద్యులు

సస్యశ్యామల భారతం

బియ్యం ఉత్పత్తిలో చైనాను దాటి భారత్ రికార్డు

14.9 కోట్ల టన్నులతో ముందంజ

2వ స్థానంలో చైనా.. 14.46 కోట్ల టన్నులు

తెలంగాణ తదితర రాష్ట్రాల్లో అధికదిగుబడి!

గోధుమ ఉత్పత్తిలో భారత్‌కు రెండో స్థానం

పడిపోతున్న నూనె గింజల ఉత్పత్తి



న్యూఢిల్లీ, మే 19: సుజలాం.. సుఫలాం.. మలయజ శీతలాం.. సస్యశ్యామలాం మాతరం.. అంటూ ప్రపంచంలోనే ఆహార ధాన్యాల ఉత్పత్తిలో భారత్ దూసుకుపోతోంది..! గత ఏడాది(2024-25) మూడు సీజన్లలో-- రబీ, ఖరీఫ్, జైద్‌లో వరి దిగుబడిలో.. బియ్యం ఉత్పత్తిలో ముందంజలో నిలిచింది. ఇప్పటి దాకా బియ్యం ఉత్పత్తిలో అగ్రస్థానాన్ని కొనసాగించిన చైనాను వెనక్కి తోసిన భారత్.. గత ఏడాది 14.9 కోట్ల టన్నుల మేర బియ్యాన్ని ఉత్పత్తి చేసింది. చైనా 14.46 కోట్ల టన్నులకు పరిమితమైందని

మిగతా 10వ పేజీలో...

ఫిలిప్పీన్స్‌కు ఏటా 8 లక్షల టన్నుల బియ్యం!

13

తెలంగాణ-ఫిలిప్పీన్స్ ప్రభుత్వాల ఎంవోయూ



నాగర్‌కర్నూల్ జిల్లా మాచారంలో 'ఇందిర సౌర గిరి జల వికాసం' ప్రారంభోత్సవంలో.. చెంచులు బహుకరించిన నెమలి పింఛంతో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, సీతక్క, దామోదర, ఉత్తమ్

నాడు బేడీలు.. నేడు వెలుగులు

బీఆర్ఎస్ హయాంలో పోడు భూములివ్వమంటే దాడులు

మేం భూములు పంచడమే కాక ఉచిత సోలార్ పంపుసెట్లు ఇస్తున్నాం

కడుపు నిండా విషం ఉన్న వారికి సర్కారు చేసే మంచి కనిపించదు

లబ్ధిదారులకు గుర్తుంటే చాలు.. సోషల్ మీడియా సన్నాసులు లెక్కేకాదు

రూ. 12,600 కోట్లతో 2.70 లక్షల మంది రైతులకు ఇందిర సౌర గిరి జలవికాసం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ జిల్లా మాచారంలో జలవికాసం పథకం ప్రారంభం

మంత్రులతో కలిసి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి సీఎం

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు.. పట్టువస్త్రాల సమర్పణ

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్, మే 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు బేడీలు వేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నేడు అదే పోడు రైతులకు తాము భూములు పంచడమే కాకుండా.. ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఇచ్చి పండ్లతోటలు పెంచే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం రూ.12,600 కోట్లతో ఇందిర సౌర గిరి జలవికాసం పథకాన్ని చేపట్టామని పేర్కొన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలంలోని మాచారంలో ఈ పథకానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. 27 మంది రైతుల పండ్ల తోటలకు

మిగతా 13వ పేజీలో...

గిరిజన విందు

మాసాబ్‌ట్యాంక్ తెలుగు సంక్షేమ భవన్‌లో ట్రైబల్ కెఫెటేరియా

ఇప్ప లడ్లు, గారెలు, చపాతీలు సహా చిరుతిళ్లు

తృణ, చిరుధాన్యాల ఉత్పత్తులతో వంటకాలు

అక్కడే కొలువుదీరిన 11 జాతుల గిరిజన ఆలయాలు

త్వరలో ప్రారంభం

13

విదేశీ పర్యటనలు.. విలాస జీవితం!

ఎక్కడికి వెళ్లినా ఖరీదైన హోటళ్లలోనే బస

ఇదీ యూట్యూబర్ జ్యోతీమల్హోత్రా జీవన శైలి

ఈ ఏడాది జనవరిలో పహల్గాంలో పర్యటన

వీడియోలు తీసి పాక్ ఏజెంట్లకు చేరవేత?

ఉగ్రదాడి తర్వాత ఢిల్లీలో పాక్ ఎంబసీకి కేక్ తీసుకెళ్లిన వ్యక్తితో జ్యోతి ఫొటో



పాక్ ఎంబసీకి కేక్ తీసుకెళ్లిన వ్యక్తితో జ్యోతి

చండీగఢ్, మే 19: గూఢచర్యం ఆరోపణలపై అరెస్టయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు సంబంధించి మరిన్ని సంచలన వివరాలు వెల్లడయ్యాయి. మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఆమె ఖరీదైన జీవన శైలి సాగిస్తోంది. ఆమె ఆదాయానికి, విలాస జీవితానికి ఎక్కడా పొంతన లేదు. విమానాల్లో ఎప్పుడూ మొదటి తరగతిలోనే ప్రయాణించినట్లు పోలీసులు గుర్తించారు. ఖరీదైన హోటళ్లలో బస చేస్తూ ఖరీదైన రెస్టారెంట్లలోనే భోజనం చేసేది. ఆమె పాక్ పర్యటన ఖర్చంతా స్పాన్సర్లదే అని భావిస్తున్నారు. అంతేగాక పాక్ పర్యటన నుంచి వచ్చిన వెంటనే ఆమె చైనా

మిగతా 2వ పేజీలో...

హైదరాబాద్, విజయనగరంలో వరుస పేలుళ్లకు కుట్ర!

12

రంపచోడవరంలో రిహార్సల్స్ జరిపిన సిరాజ్, సమీర్

2 సార్లు సౌదీకి సిరాజ్.. రిమాండ్ రిపోర్టులో వెల్లడి

రంగంలోకి ఎన్ఐఏ.. నిందితుల కస్టడీకి పిటిషన్



కొత్త హంగులతో బేగంపేట రైల్వే స్టేషన్

ఎయిర్‌పోర్టుల్లా రైల్వే స్టేషన్లు

అమృత్ పథకంలో భాగంగా వరంగల్, కరీంనగర్, బేగంపేట స్టేషన్ల అభివృద్ధి

అత్యంత అధునాతన వసతుల కల్పన.. ఒక్కో స్టేషన్‌కు రూ.25 కోట్ల వ్యయం

ఎల్లుండి వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ

వరంగల్ రైల్వేస్టేషన్ ఫొటోలను ఎక్స్‌లో షేర్ చేసిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

గిర్మాజీపేట/కరీంనగర్ రూరల్/బేగంపేట/న్యూఢిల్లీ, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విమానాశ్రయాలను తలపించేలా ఆధునిక హంగులతో తీర్చిదిద్దిన మూడు ప్రధాన రైల్వే స్టేషన్లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. అధునాతన సౌకర్యాలు, కళ్లు చెదిరే ఎలివేషన్లతో చేపట్టిన నిర్మాణాలు ఆవిష్కరణకు అడుగు దూరంలో ఉన్నాయి. అమృత్ భారత్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్లను ఆధునీకరించింది. ఆయా స్టేషన్లలో అత్యాధునిక వసతులను కల్పించింది. 12 మీటర్ల విశాలమైన ఫుట్ ఓవర్

మిగతా 14వ పేజీలో...

హైడ్రాలో డ్రైవర్ ఉద్యోగాలకు పోటెత్తిన నిరుద్యోగులు



హైదరాబాద్‌లోని బుద్ధభవన్‌లో హైడ్రా కార్యాలయం వద్ద బారులు తీరిన నిరుద్యోగులు

రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి రాక.. 200 పోస్టులకు 850 దరఖాస్తులు

హైదర్‌నగర్, పుప్పాలగూడలోని పలు ఆక్రమణలను కూల్చివేసిన హైడ్రా

12

బెంగళూరులో వర్ష బీభత్సం

14

ఎడతెరిపి లేకుండా వాన

పలు కాలనీల్లో ఇళ్లలోకి నీరు

చెరువులను తలపించిన రోడ్లు

రబ్బరు బోట్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు

మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు

రాష్ట్రంలో రేపు భారీ వర్షాలు!

11 జిల్లాలకు ఎల్లో అలర్ట్



బెంగళూరు కోరమంగళలో నీట మునిగిన రోడ్డు



భారత్.. ధర్మసత్రం కాదు!

ఇప్పటికే 140 కోట్ల మంది జనాభాతో ఇబ్బందులు

10

శరణార్థుల అంశంపై సుప్రీం వ్యాఖ్యలు

ఆశ్రయం కోరిన శ్రీలంక జాతీయుడి పిటిషన్ తిరస్కరణ

మధ్యప్రదేశ్ మంత్రిపై 'సిట్'

కల్నల్ సోఫియాపై అనుచిత వ్యాఖ్యల కేసులో సుప్రీంకోర్టు ఆదేశం

విజయ్‌షా క్షమాపణలో నిజాయితీ లేదు

ఆయన వ్యాఖ్యల పట్ల దేశం సిగ్గుపడుతోందన్న ధర్మాసనం

2

జూన్ 2న సుదీర్ఘ వాదనలు వింటాం

తెలంగాణ మెడికల్ సీట్లలో స్థానికత అంశంపై సుప్రీంకోర్టు

14

ఇక.. మహిళా ఫైర్‌ఫైటర్లు!

3

ప్రభుత్వానికి అగ్నిమాపక శాఖ ప్రతిపాదన

ఆమోదిస్తే తదుపరి నియామకాల నుంచే భర్తీ

మహారాష్ట్ర, తమిళనాడులో ఇప్పటికే సేవలు

కేసీఆర్‌ను విచారించాకే కాళేశ్వరం నివేదిక!

విచారణలో కీలక మలుపు

త్వరలో కేసీఆర్‌కు సమన్లు పంపే చాన్స్!

కమిషన్ గడువును మరో రెండు నెలలు పొడిగించిన ప్రభుత్వం

12



పాకిస్థాన్ గుడిలో ఘంటసాల పాట!

హైదరాబాద్, మే 19: వేరే రాష్ట్రాలకు వెళ్లినప్పుడు అక్కడ మనకు తెలుగు మాట వింటేనే ప్రాణం లేచి వచ్చినట్టు అనిపిస్తుంది! అలాంటిది.. వేరే దేశంలో.. అందునా పాకిస్థాన్‌లో తెలుగు మాట కాదు.. గాన గంధర్వుడు మన ఘంటసాల పాడిన సూపర్‌హిట్ పాట ఒకరి నోట వినిపిస్తే? గూఢచర్యం ఆరోపణలపై ఇటీవల అరెస్టయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా వీడియోలో అలాంటి అద్భుతమే కనిపించింది. రెండు నెలల క్రితం ఆమె పాకిస్థాన్‌లోని 'కటాస్‌రాజ్' ఆలయానికి వెళ్లి.. ఆ గుడి ప్రాశస్త్యాన్ని వివరించే వీడియోను తన యూట్యూబ్ చానల్‌లో పోస్ట్ చేసింది. ఆ వీడియోలో 6.50 నిమిషాల వద్ద.. ఆమె ఆ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుంటుండగా 'భూకైలాస్'లోని 'రాముని అవతారం రవికుల సోముని అవతారం' అనే పాట వినిపిస్తుంది. లోపల ఒక పెద్దాయన కూర్చుని భక్తిగా ఆ పాట పాడుతున్న దృశ్యం కనిపిస్తుంది. ఈ వీడియో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో వైరల్ అవుతోంది.

మధ్యప్రదేశ్ మంత్రిపై 'సిట్'

» విజయ్‌షా క్షమాపణలో నిజాయితీ లేదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 19: మహిళా సైనికాధికారి కల్నల్ సోఫియా ఖురేషీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్‌షాపై సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన క్షమాపణలను అంగీకరించేది లేదని స్పష్టం చేసింది. మంత్రి వ్యాఖ్యలపై విచారణ కోసం మంగళవారం ఉదయం 10 గంటల లోపు ముగ్గురు ఐజీ ర్యాంకు ఐపీఎస్ అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేయాలని మధ్యప్రదేశ్ డీజీపీని ఆదేశించింది. ముగ్గురిలో ఒకరు మహిళా అధికారి ఉండాలని, తొలి దశ నివేదికను 'సిట్' ఈ నెల 28వ తేదీ లోగా సమర్పించాలని నిర్దేశించింది. అరెస్టు నుంచి మంత్రికి ఉపశమనం కలిగించింది. అదే సమయంలో, 'పరిణామాలు తప్పవు' అని హెచ్చరించింది. ఈ కేసును తామే పర్యవేక్షించాలనుకుంటున్నామని, 'ఇది మీకు లిట్మస్ టెస్ట్' అని మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసింది. ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన అనంతరం, ఈ నెల 12వ తేదీన మంత్రి విజయ్‌షా ఓ సభలో మాట్లాడుతూ.. పాకిస్థాన్ పని పట్టేందుకు ప్రధాని మోదీ 'అక్కడున్న వారి మతానికి' చెందిన మహిళనే పంపించారంటూ.. కల్నల్ సోఫియా ఖురేషీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అంతటితో ఆగకుండా.. "మీరు (ఉగ్రవాదులు) మా సోదరీమణులను వితంతువులను చేశారు. కాబట్టి మీ మతానికి చెందిన సోదరితోనే మీ సంగతి తేల్చేస్తామని, ప్రతీకారం సాధించగలమని ప్రధాని మోదీ నిరూపించారు" అని వ్యాఖ్యానించారు. మంత్రి వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయన్న సుప్రీం కోర్టు.. కల్నల్ సోఫియా ఖురేషీకి క్షమాపణలు చెప్పాలని గత గురువారం ఆదేశించింది. సోమవారం విచారణ సందర్భంగా మంత్రి క్షమాపణలు కోరిన తీరుపై కోర్టు ఆగ్రహించింది. "ఏమిటీ ఆ క్షమాపణ? కోర్టు కోరింది కాబట్టి క్షమాపణ చెబుదామన్నట్టు మీ వైఖరి ఉంది. చేసిన పిచ్చి వ్యాఖ్యలకు నిజాయితీగా క్షమాపణ అడగడానికి మీకు ఏం అడ్డుపడుతోంది?" అని జస్టిస్ సూర్యకాంత్ నిలదీశారు. మంత్రి వ్యాఖ్యలతో దేశం సిగ్గుతో తల దించుకుందని మండిపడ్డారు. మరోవైపు, ఆపరేషన్ సిందూర్‌పై వివాదాస్పద పోస్టు పెట్టారంటూ అశోకా యూనివర్సిటీ రాజనీతి శాస్త్రం విభాగం అధిపతి ప్రొఫెసర్ అలీ ఖాన్ మహముదాబాద్‌ను అరెస్టు చేయడంపై విచారణ జరుపుతామని సోమవారం సుప్రీంకోర్టు తెలిపింది.

రైల్వే టికెట్లపై 'సిందూర్' ప్రకటన.. కాంగ్రెస్ ఫైర్

న్యూఢిల్లీ, మే 19: రైల్వే టికెట్లపై ప్రధాని మోదీ ఫొటోతో కూడిన ఆపరేషన్ సిందూర్ ప్రకటన రాజకీయ దుమారం రేపింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు సైనిక ఆపరేషన్‌ను బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని కాంగ్రెస్ ఆరోపించింది. కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్ నాథ్ మీడియా సలహాదారు పియూష్ బబెలే ఐఆర్‌సీటీసీ ఈ- టికెట్ ఫొటోను 'ఎక్స్'లో పోస్టు చేశారు. "మోదీ సర్కారుకు ప్రకటనలపై ఎంత మక్కువ ఉందో చెప్పడానికి ఇదో ఉదాహరణ. ఆపరేషన్ సిందూర్‌ను రైల్వే టికెట్లపై ఒక ప్రకటనగా వాడుకుంటున్నారు. మన సైనికుల పరాక్రమాన్ని కూడా ఒక వస్తువులా అమ్ముకుంటున్నారు. ఇది దేశ భక్తి కాదు.. బేరసారమే" అని బబెలే ఎక్స్‌లో రాశారు.

హైకోర్టు జడ్జిలకు సమాన పింఛన్!

» నియామక సమయం, హోదాతో సంబంధం లేకుండా చెల్లించాల్సిందే.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ, మే 19: దేశవ్యాప్తంగా అన్ని హైకోర్టుల న్యాయమూర్తులకు ఒకే తరహా పింఛను విధానం అమలు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు న్యాయమూర్తులందరూ 'పూర్తిస్థాయి' పింఛన్‌కు అర్హులేనని పేర్కొంది. న్యాయమూర్తుల నియామక సమయం, హోదాల ఆధారంగా పింఛను విషయంలో వివక్షకు వీల్లేదని, వివక్ష చూపిస్తే సమానత్వ హక్కు ఉల్లంఘించడమేనని తెలిపింది. శాశ్వత/అదనపు న్యాయమూర్తులుగా పనిచేసి రిటైరైనా పూర్తిస్థాయి పింఛనుకు, పదవీ విరమణ ప్రయోజనాలకు అర్హులేనని తేల్చి చెబుతూ సుప్రీంకోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. రిటైర్డ్ శాశ్వత న్యాయమూర్తులు మృతి చెందితే వారి కుటుంబాలకు అందిస్తున్న ప్రయోజనాలే అదనపు న్యాయమూర్తుల కుటుంబాలకూ అందించాలని ఆదేశించింది. కాగా, జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నగదు లభించిన వ్యవహారంపై అత్యవసర విచారణకు సోమవారం సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ వ్యవహారంపై బుధవారం విచారణ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

అమెరికా మాజీ అధ్యక్షుడు బైడెన్‌కు క్యాన్సర్

వాషింగ్టన్, మే 19: అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ (82) ప్రోస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఇటీవల నిర్వహించిన వైద్య పరీక్షల్లో బైడెన్‌కు క్యాన్సర్ నిర్ధారణ అయ్యిందని.. ఆందోళనకర స్థాయిలో వ్యాధి తీవ్రత ఉందని, ఎముకలకూ వ్యాపిస్తోందని ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. బైడెన్‌కు క్యానర్ నిర్ధారణ అయిన నేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. 'విషయం తెలిసి నేను, మెలానియా చాలా బాధపడ్డాం. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం' అని పేర్కొన్నారు. బైడెన్ ఆరోగ్య పరిస్థితిపై ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన త్వరగా కోలుకోవాలని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకుంటాం

జెరూసలేం, మే 19: గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకుంటామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ సోమవారం స్పష్టం చేశారు. 'గాజా ప్రాదేశిక ప్రాంతంపై పూర్తి పట్టు సాధిస్తాం. వెనక్కు తగ్గే ప్రసక్తే లేదు' అని సోషల్ మీడియా వేదిక టెలిగ్రామ్‌లో నెతన్యాహూ వీడియో పోస్ట్ చేశారు. అదే సమయంలో ఆచరణాత్మక, దౌత్య పరమైన కారణాల రీత్యా పాలస్తీనియన్లు కరువు బారిన పడకుండా నిలువరించాల్సి ఉందన్న నెతన్యాహూ.. అందుకు గాజాకు ఆహార పదార్థాలు పంపుతామని చెప్పారు. తమ మిత్ర దేశాలు కూడా సామూహిక ఆకలి చావుల చిత్రాలను సహించబోవన్నారు.

ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణకు రెడీ: పుతిన్

» ట్రంప్‌తో 2 గంటల ఫోన్ చర్చల తర్వాత వెల్లడి

» తక్షణం పుతిన్, జెలెన్‌స్కీ మధ్య ప్రారంభం కానున్న చర్చలు

మాస్కో/ వాషింగ్టన్ డీసీ, మే 19: ఉక్రెయిన్‌తో రెండేళ్లకు పైగా సాగుతున్న యుద్ధానికి ఎట్టకేలకు చరమ గీతం పాడేందుకు సిద్ధమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అంగీకరించారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. కాల్పుల విరమణకు తక్షణం రష్యా, ఉక్రెయిన్ చర్చలు ప్రారంభిస్తాయని, ఆ రెండు దేశాల అధినేతల మధ్య జరిగే సంప్రదింపుల్లో షరతులు ఖరారవుతాయని పేర్కొన్నారు. ఈ విషయమై పుతిన్‌తో ట్రంప్ సోమవారం రెండు గంటలకు పైగా ఫోన్‌లో చర్చించారు. యుద్ధం అనంతర పరిణామాలపై అగ్రదేశాల నేతలిరువురు చర్చించుకున్నారు.

విలాసవంతమైన జీవితం!

(మొదటి పేజీ తరువాయి)

పర్యటనకు వెళ్లింది. అక్కడ కూడా లగ్జరీ కార్లలో ప్రయాణించింది. అత్యంత ఖరీదైన నగల షాపులకు వెళ్లింది. ఈమె ఈ ఏడాది జనవరిలో కశ్మీర్‌లోని పహల్గాం వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం మూడు నెలలకే అక్కడ ఉగ్రదాడి జరిగింది. ఐదు రోజుల కశ్మీర్ పర్యటనలో భాగంగా ఆమె పహల్గాం వెళ్లింది. అక్కడ వీడియోలు తీసింది. వీటిని పాక్ ఏజెంట్లకు చేరవేసిందా? ఉగ్రదాడికి, ఈమె పర్యటనకు సంబంధం ఉందా..? అనే విషయాన్ని పోలీసులు విచారిస్తున్నారు. కాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను నిలిపివేశారు. తాము స్వాధీనం చేసుకున్నాక ఆమె సెల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్‌లకు అనుమానాస్పద అంశాలు వచ్చాయని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ ఆమె ఢిల్లీలోని పాక్ ఎంబసీ అధికారి డానిష్‌తో టచ్‌లోనే ఉందని గుర్తించారు. అతడితో ఆమె చాలా సన్నిహితమైనట్లు భావిస్తున్నారు. కాగా పహల్గాం ఉగ్రదాడి తర్వాత రెండు రోజులకు అంటే ఏప్రిల్ 24న ఢిల్లీలోని పాక్ ఎంబసీకి గడ్డంతో ఉన్న ఒక వ్యక్తి కేక్ తీసుకువచ్చిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో పలువురు విలేకరులు అతడిని ఎందుకు వచ్చావు..? ఏం వేడుకకు కేక్ తెస్తున్నావని ప్రశ్నించారు..? అయితే అతడు వారికి సమాధానం చెప్పకుండా త్వర త్వరగా లోపలికి వెళ్లిపోయాడు. ఈ గడ్డపు వ్యక్తితో జ్యోతి మల్హోత్రా దిగిన ఫొటో కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పాక్ పర్యటనలో జ్యోతి హాజరైన ఒక పార్టీ(వేడుక) వీడియో



లోనూ ఈ గడ్డపు వ్యక్తి కనిపించాడు. అతడిని ఆమె కలుసుకొన్నట్లు వీడియోలో కనిపిస్తుంది. కాగా పలువురు ఇతర సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో జ్యోతికి సంబంధాలు ఉన్నాయని, వారికీ పాకిస్థాన్ ఏజెంట్లతో సంబంధాలు ఉన్నాయని హిస్సార్ ఎస్పీ శశాంక్ కుమార్ సావన్ తెలిపారు. పాక్ ఏజెంట్లు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను నియమించుకుని తమ వాదనను ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు.

3 రోజుల్లో 11 మంది 'పాక్ గూఢచారుల' అరెస్ట్!

పంజాబ్, హరియాణా, యూపీలో అదుపులోకి

న్యూఢిల్లీ, మే 19: పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన తర్వాత పాక్ గూఢచర్య కార్యక్రమాల్లో పాల్గొన్న వారిపై పోలీసులు దృష్టి సారించారు. దేశవ్యాప్తంగా అలాంటి వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. గడిచిన మూడు రోజుల్లోనే 11 మంది 'పాక్ గూఢచారుల'ను అరెస్ట్ చేశారు. భారతదేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్నారన్న ఆరోపణలపై పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లో పోలీసులు 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో హరియాణాకు చెందిన ట్రావెల్ వ్లాగర్ జ్యోతి మల్హోత్రాతోపాటు ఓ సెక్యూరిటీ గార్డు, యాప్ డెవలపర్, విద్యార్థులు, సామాన్యులు ఉన్నారు.

జ్యోతి మల్హోత్రా

యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను పాక్ ఏజెంట్లు తమకు కీలకమైన వ్యక్తిగా మార్చుకున్నారని పోలీసులు తెలిపారు. 'ట్రావెల్ విత్ జో' పేరిట ఆమె యూట్యూబ్ చానెల్ నడుపుతోందని, 3.85 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారని చెప్పారు. ఆమె 2023, 2024, 2025 మార్చిలో పాకిస్థాన్ వెళ్లి వచ్చిందని.. పహల్గాం ఉగ్రదాడికి ముందు కూడా పాక్‌కు వెళ్లిందని వివరించారు. భారత్‌లోని పాక్ హైకమిషన్ ఉద్యోగి డానిష్‌తో సంప్రదింపులు జరిపిందన్నారు.



గజాలా, యమీన్: జ్యోతితో పాటు పంజాబ్‌లోని మలేర్‌కోట్లకు చెందిన 32 ఏళ్ల వితంతువు గజాలా, యమీన్ మహమ్మద్‌లను కూడా పోలీసులు అరెస్టు చేశారు. యమీన్ ఆర్థిక కార్యకలాపాలు, వీసా సంబంధిత అంశాల్లో పాక్ హైకమిషన్ మాజీ ఉద్యోగి డానిష్‌తో కలిసి పనిచేసినట్లు పోలీసులు తెలిపారు.

తారిఫ్: నుహ్‌కే చెందిన తారిఫ్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. పాకిస్థాన్ రాయబార కార్యాలయానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తనకు సిమ్ కార్డులు అందించినట్లు విచారణలో చెప్పాడన్నారు. అతను తరచుగా పాకిస్థాన్ వెళ్లేవాడు.

నౌమాన్ ఇలాహీ: ఐఎస్ఐ ఏజెంట్లతో సంప్రదింపులు జరుపుతున్న నౌమాన్ ఇలాహీ(24)ని పానిపట్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతను యూపీకి చెందినవాడు. ఓ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడని, పాక్‌కు సున్నిత సమాచారాన్ని చేరవేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఇలాహీ చాలాసార్లు పాక్ పర్యటనకు వెళ్లాడన్నారు.

మహ్మద్ ముర్తజా అలీ: పంజాబ్‌లోని జలంధర్‌లో యాప్ డెవలపర్ మహ్మద్ ముర్తజా అలీని పోలీసులు అరెస్టు చేశారు. అతను స్వయంగా అభివృద్ధి చేసిన మొబైల్ యాప్ ద్వారా గూఢచర్య కార్యకలాపాలను నిర్వహించాడని చెప్పారు.



దేవేందర్ సింగ్: పంజాబ్ పటియాలాలోని ఖల్సా కళాశాలకు చెందిన 25 ఏళ్ల పొలిటికల్ సైన్స్ విద్యార్థి. పటియాలా సైనిక కంటోన్మెంట్ చిత్రాలతో పాటు ఇతర కీలక సమాచారాన్ని ఐఎస్ఐ ఏజెంట్లకు అందించినట్లు పోలీసులు తెలిపారు. నవంబర్‌లో పాకిస్థాన్ వెళ్లి వచ్చాడని చెప్పారు.

షెహజాద్: ఉత్తరప్రదేశ్ యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ పోలీసులు షెహజాద్‌ను అరెస్టు చేశారు. ఇతను పాకిస్థాన్‌కు అనేకసార్లు వెళ్లాడని, సౌందర్య సాధనాల స్మగ్లింగ్ రాకెట్‌ను గూఢచర్య కార్యకలాపాల కోసం వినియోగించుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఐఎస్ఐ ఏజెంట్లతో ఇతనికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని వివరించారు.

సుఖ్‌ప్రీత్ సింగ్: ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు సున్నితమైన సమాచారాన్ని అందజేశారనే ఆరోపణలతో పంజాబ్ పోలీసులు గురుదాస్‌పూర్‌లో సుఖ్‌ప్రీత్ సింగ్‌ను అరెస్టు చేశారు. పంజాబ్, హిమాచల్, కశ్మీర్‌లో భారత దళాల కదలికలతోపాటు వ్యూహాత్మక ప్రదేశాల వివరాలను నిందితుడు ఐఎస్ఐకి చేరవేసినట్లు పంజాబ్ డీజీపీ తెలిపారు.

కరణ్‌బీర్ సింగ్: గురుదాస్‌పూర్‌లోనే మరో నిందితుడు కరణ్‌బీర్ సింగ్‌ను అరెస్టు చేశారు. ఇతనికి ఐఎస్ఐ ఏజెంట్లతో సంబంధాలు ఉన్నాయని.. మన సైనిక బలగాలకు చెందిన సున్నిత సమాచారాన్ని వారికి చేరవేశాడని పోలీసులు తెలిపారు.



అర్మాన్: మరో గూఢచారి, నుహ్‌కు చెందిన అర్మాన్(26)ను అదుపులోకి తీసుకున్నారు. ఇతని ఫోన్ నుంచి పాక్ నంబర్లతో జరిపిన సంభాషణలు, పంపిన ఫొటోలు, వీడియోలను స్వాధీనం చేసుకున్నారు. భారత సైనిక కార్యకలాపాల వివరాలను వాట్సాప్ ద్వారా పంపాడన్నారు.

లోకం తీరు

కల్నల్ సోఫియాపై మధ్యప్రదేశ్ మంత్రి వ్యాఖ్యలు సిగ్గుచేటు: సుప్రీ



ఈసీఐఎల్‌కు 'మినీరత్న' హోదా

కుషాయిగూడ, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్స్ రంగంలో అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన ప్రభుత్వ రంగ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) కిరీటంలో మరో కలికితురాయి చేరింది. ఈసీఐఎల్‌కు ప్రతిష్ఠాత్మక మినీరత్న (కేటగిరీ-1) హోదా లభించింది. ఈమేరకు సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ నిర్దేశించిన అర్హత ప్రమాణాలను అనుగుణంగా సంస్థ పనితీరు ఉండటంతో ఈ హోదా దక్కింది. ఈ హోదా సంస్థ ఖ్యాతిని, మార్కెట్ విలువను పెంచడమేకాకుండా వ్యూహాత్మక ఎలక్ట్రానిక్స్ డొమైన్‌లో ఈసీఐఎల్ స్థాయిని బలోపేతం చేస్తుంది. కొన్నేళ్లుగా సంస్థ ఉద్యోగుల కృషి ఫలితంగానే ఈ హోదా దక్కినట్టు అనురాగ్ కుమార్ తెలిపారు.

రూ.100 రాఖీ డెలివరీ చేయని అమెజాన్‌కు రూ.40వేల జరిమానా

ముంబై, మే 19: సకాలంలో రాఖీ డెలివరీ చేయని అమెజాన్ సంస్థకు రూ.40వేల జరిమానా విధిస్తూ ముంబయి జిల్లా వినియోగదారుల ఫోరం తీర్పు చెప్పింది. రూ.100 రాఖీకి ఆర్డర్ తీసుకున్న అమెజాన్ దాన్ని సకాలంలో అందజేయకపోగా, మరుసటి రోజున దాన్ని క్యాన్సిల్ చేసింది. సొమ్మును తిరిగి బ్యాంకు ఖాతాలో జమ చేసింది. సకాలంలో రాఖీ అందజేయకపోవడం సేవా లోపమే అని భావించిన ఫోరం అధ్యక్షుడు సమీందర ఆర్ సుర్వే, సభ్యుడు సమీర్ కె కాంబ్లే జరిమానా విధించారు. తన మేనల్లుడికి పంపించేందుకు ఓ మహిళ 2019 ఆగస్టు 2న అమెజాన్ వెబ్‌సైట్ ద్వారా రాఖీని బుక్ చేసింది. ధనశ్రీ రాఖీ షాపు నుంచి రూ.100కు మోటూ పట్లూ కిడ్స్ రాఖీని కొనుగోలు చేసింది. 2019 ఆగస్టు 8-13 మధ్య అందజేస్తామంటూ మెసేజ్ వచ్చింది. కానీ రాఖీ అందలేదు. మరుసటి రోజున ఆ రూ.100 ఆమె బ్యాంకు ఖాతాలో జమయింది. దీంతో, ఆమె ఫోరంను ఆశ్రయించారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌కు చైనా అండ!

న్యూఢిల్లీ, మే 19: భారత దేశం మే 7న 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించగానే.. పాకిస్థాన్‌కు చైనా అండగా నిలిచిందని, ఆ దేశానికి అత్యంత కీలకమైన సైనిక సాయాన్ని, శాటిలైట్ డేటాను అందించిందని పేర్కొంటూ 'బ్లూమ్‌బెర్గ్' వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. మన రక్షణ శాఖకు చెందిన 'సెంటర్ ఫర్ జాయింట్ వార్‌ఫేర్ స్టడీస్' డైరెక్టర్ జనరల్ అశోక్‌కుమార్‌ను ఉటంకిస్తూ పలు కీలక విషయాలను అందులో వివరించింది. మన గగనతల దాడుల గురించి తెలుసుకోవడానికి వీలుగా పాక్ తన రేడార్లను, గగనతల రక్షణ వ్యవస్థలను పునర్వ్యవస్థీకరించుకోవడానికి సహకరించిందని పేర్కొంది. భారత ఆర్మీ కదలికలను, సైనిక మోహరింపుల వివరాలను మెరుగ్గా గుర్తించేలా తన రక్షణ వ్యవస్థలను ఉపయోగించుకోవడంలో చైనా పాకిస్థాన్‌కు సహకరించినట్టు వెల్లడించింది. ఈ అంశంపై బ్లూమ్‌బెర్గ్ విలేకరి చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్‌ను సోమవారం ప్రశ్నించగా.. రెండు దేశాల మధ్య ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నప్పటి నుంచీ తాము తటస్థ, నిష్పక్షపాత వైఖరిని అవలంబించామని ఆమె తెలిపారు.

స్వర్ణ దేవాలయంపై పాక్ టార్గెట్

» నిర్వీర్యం చేసిన భారత ఎయిర్ డిఫెన్స్

న్యూఢిల్లీ, మే 19: పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీరు (పీవోకే)ల్లోని 9 ఉగ్రవాద స్థావరాలను భారత్ నేలమట్టం చేయడంతో.. పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయాన్ని పాక్ టార్గెట్ చేసింది. ఈ నెల 8వ తేదీన దానిపైకి డ్రోన్లు, క్షిపణులను కురిపించింది. అయితే అప్పటికే అప్రమత్తంగా ఉన్న భారత సైన్యం.. గగనతల రక్షణ వ్యవస్థల సాయంతో వాటన్నిటినీ నిర్వీర్యం చేసింది. 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన 53 సెకన్ల వీడియోను సోమవారం విడుదల చేసింది. 9 స్థావరాల ధ్వంసం గురించి 15వ ఇన్‌ఫాంట్రీ డివిజన్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జీవోసీ) మేజర్ జనరల్ కార్తీక్ సిశేషాద్రి వివరించారు. 'స్వర్ణ దేవాలయం మొత్తంపై గగనతల రక్షణ ఛత్రాన్ని ఏర్పాటుచేశాం. ఆలయానికి చిన్నమెత్తు గీత కూడా పడకుండా కాపాడాం. మానవరహిత డ్రోన్లు, క్షిపణులన్నిటినీ భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ధ్వంసం చేసేశాయి. మనవైపు చాలా తక్కువ నష్టం జరిగేలా చూశాయి' అని వెల్లడించారు.

జైశంకర్... మౌనం వీడండి

న్యూఢిల్లీ, మే 19(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విషయంలో విదేశాంగ మంత్రి జైశంకర్ మౌనం వీడాలని, ఆ సమయంలో భారత్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందో సమాధానం చెప్పాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై పాక్‌కు ముందే సమాచారం ఇచ్చామంటూ జైశంకర్ మాట్లాడుతున్న వీడియోపై తీవ్ర విమర్శలు గుప్పించిన మరుసటి రోజే రాహుల్ గాంధీ.. యుద్ధ విమానాలపై కేంద్రాన్ని నిలదీయడం గమనార్హం. "పాకిస్థాన్‌కు మన ఆపరేషన్ గురించి సమాచారం ఇవ్వాలని జైశంకర్‌కు ఎవరు చెప్పారు" అని రాహుల్ ప్రశ్నించారు.

ట్రంప్ ప్రమేయమేమీ లేదు?

కాల్పుల విరమణ ప్రకటనపై ఆయన మా అనుమతి తీసుకోలేదు

» పార్లమెంటరీ కమిటీతో విక్రమ్ మిస్రీ!



పార్లమెంటరీ కమిటీ సభ్యులు అరుణ్ గోవిల్, ఒవైసీ, రవిశంకర్, శశిథరూర్, ఆర్పీఎన్ సింగ్‌లతో మిస్రీ

న్యూఢిల్లీ, మే 19: పహల్గాం ఉగ్రదాడి తర్వాత చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు విరామంగా భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం వెనక అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాత్ర ఏమీ లేదని పార్లమెంటరీ కమిటీతో విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు పీటీఐతోపాటు.. పలు వార్తాసంస్థలు కథనాలను ప్రచురించాయి. ఈ అంశంపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అధ్యక్షతన పార్లమెంటరీ కమిటీ సోమవారం భేటీ అయ్యింది. ఈ సమావేశంలో ఎంపీలు అభిషేక్ బెనర్జీ(తృణమూల్), రాజీవ్ శుక్లా(కాంగ్రెస్), దీపేందర్ హుడా(కాంగ్రెస్), అసదుద్దీన్ ఒవైసీ(మజ్లిస్), అపరాజిత సారంగి(బీజేపీ), అరుణ్ గోవిల్(బీజేపీ) తదితరులు పాల్గొన్నారు. భారత్-పాక్ ఉద్రిక్తతలపై కమిటీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు విక్రమ్ విస్రీ సమాధానమిచ్చారు. "భారత్-పాక్ మధ్య అణుయుద్ధాన్ని నిలువరించానని, కశ్మీర్ సమస్యను పరిష్కరించానని ట్రంప్ కనీసం ఏడు సార్లు ప్రకటించారు. అయినా.. భారత్ ఎందుకు మౌనంగా ఉంది?" అని పలువురు సభ్యులు మిస్రీని ప్రశ్నించారు. దీనికి ఆయన సమాధానమిస్తూ.. భారత్-పాక్ ఘర్షణను నిలువరించడంలో అమెరికా ప్రమేయం లేదని చెప్పారని జాతీయ మీడియా పేర్కొంది. "కాల్పుల విరమణ పూర్తిగా ద్వైపాక్షిక నిర్ణయం. ఈ విషయంలో డొనాల్డ్ ట్రంప్ ప్రమేయానికి మా నుంచి అనుమతి తీసుకోలేదు. ఆయన ఈ వ్యవహారంలో కేంద్రంగా నిలవాలని భావించి ఉంటారు. ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం పాకిస్థాన్ డీజీఎంవో నుంచి ప్రతిపాదన రాగా.. మన డీజీఎంవో కేంద్రానికి తెలిపారు. అలా ద్వైపాక్షికంగానే కాల్పుల విరమణకు అంగీకారం కుదిరింది" అని చెప్పినట్లు వివరించింది. "పాకిస్థాన్ అణుయుద్ధం బెదిరింపులతోనే కాల్పుల విరమణ జరిగిందా?" అని సభ్యులు అడిగిన ప్రశ్నకు.. పాకిస్థాన్ నుంచి అణు సంకేతాలేమీ రాలేదని స్పష్టంచేశారు. న్యూక్లియర్ బ్లాక్‌మెయిలింగ్‌కు భారత్ బెదిరిపోదని ప్రధాని మోదీ ఇదివరకే స్పష్టం చేసినట్లు గుర్తుచేశారు. చైనాకు చెందిన మిలటరీ హార్డ్‌వేర్(హెచ్‌క్యూ-9 క్షిపణి రక్షణ వ్యవస్థ)ను పాక్ ఉపయోగించడంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. "మేము పాక్ వైమానిక స్థావరాలను బలంగా కొట్టాం" అని చెప్పినట్లు సమాచారం. భారత్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను కూల్చినట్లు పాకిస్థాన్ చేస్తున్న ప్రకటనపై ప్రశ్నను 'జాతీయ భద్రత' ఆందోళనల పేరుతో దాటవేశారని జాతీయ మీడియా పేర్కొంది. "పాకిస్థాన్‌కు చెప్పే దాడులు చేశామని జైశంకర్ అన్నారు కదా?" అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. కేంద్ర మంత్రి జైశంకర్ మాటలను తప్పుగా అర్థం చేసుకోవద్దని విక్రమ్ మిస్రీ పార్లమెంట్ కమిటీ సభ్యులను కోరారు. పాక్, పీవోకేలోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై మాత్రమే దాడులు చేసినట్లు పాకిస్థాన్‌కు చెప్పామని మంత్రి అన్నట్లు గుర్తుచేశారు. పాకిస్థాన్‌కు తుర్కియే, అజర్‌బైజాన్ మద్దతుపై సభ్యులు ప్రశ్నలడగ్గా.. "ముగ్గురు సోదరులుగా పాకిస్థాన్-తుర్కియే-అజర్‌బైజాన్‌కు పేరుంది" అని విక్రమ్ మిస్రీ వ్యాఖ్యానించినట్లు సమాచారం. పహల్గాం దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులు పాకిస్థాన్‌లోని సూత్రధారులతో సంభాషణలు జరిపినట్లు తమ దర్యాప్తులో తేలిందని ఆయన పార్లమెంటరీ కమిటీకి వివరించారని పీటీఐ పేర్కొంది. "ఐక్య రాజ్య సమితి(ఐరాస) గుర్తించిన అంతర్జాతీయ ఉగ్రవాదులు సైతం పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నారు. అక్కడి నుంచే భారత్‌కు వ్యతిరేకంగా హింసను ప్రేరేపిస్తున్నారు. ఉగ్రవాదం విషయంలో పాకిస్థాన్‌కు ట్రాక్ రికార్డు ఉంది" అని కమిటీకి చెప్పినట్లు తెలిపింది.

శశిథరూర్‌పై కాంగ్రెస్ మల్లగుల్లాలు!

న్యూఢిల్లీ, మే 19(ఆంధ్రజ్యోతి): రోజురోజుకీ బీజేపీ దిశగా అడుగులు వేస్తూ.. పార్టీతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్న సీనియర్ నేత శశిథరూర్‌తో ఎలా వ్యవహరించాలన్నదానిపై కాంగ్రెస్ మల్లగుల్లాలు పడుతోంది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత విదేశాంగ విధానాన్ని అంతర్జాతీయ సమాజానికి వివరించటానికి కేంద్రం ఎంపిక చేసిన ఎంపీలలో శశిథరూర్ పేరు కూడా ఉండటం ఈ సమస్యను మరింత సంక్లిష్టం చేసింది. ఇప్పటికే జ్యోతిరాదిత్య సింధియా, జితిన్ ప్రసాద వంటి యువ నేతలు పార్టీని వీడిన నేపథ్యంలో.. శశిథరూర్ విషయంలో అధిష్ఠానం జాగ్రత్తగా వ్యవహరించాలని కాంగ్రెస్ సీనియర్ నేతలు సూచిస్తున్నారు. వచ్చే ఏడాది కేరళలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున.. శశిథరూర్ అదే రాష్ట్రానికి చెందినవారు కాబట్టి, ఆచితూచి నిర్ణయం తీసుకోవాలంటున్నారు. ఇదిలా ఉండగా, పాకిస్థాన్ ఉగ్రవాదానికి మద్దతివ్వడం గురించి ప్రపంచానికి వివరించేందుకు భారత ప్రతినిధి వర్గాలను పంపడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. ప్రధాని మోదీ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిన తర్వాతే భారత ప్రతినిధి వర్గాల గురించి నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదని జైరాం రమేశ్ అన్నారు. 7 ప్రతినిధి వర్గాలను పంపించడం వల్ల జరిగేదేముందని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రతిపాదించిన నాలుగు పేర్లలో కేవలం ఒకరి పేరునే అంగీకరించి, సొంతంగా పేర్లను ఎంపిక చేశారని ఆయన అన్నారు. ఇదేమి రాజకీయమన్నారు.

థరూర్‌కు బిలావల్ సమవుజ్జీ కాదు

భారత్‌ను కాపీ కొడుతూ.. పాకిస్థాన్ కూడా తమ దేశానికి చెందిన ఎంపీల బృందాలను విదేశాలకు పంపించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అమెరికా, బ్రిటన్ తదితర దేశాలకు వెళ్లే బృందానికి బిలావల్ భుట్టోను నాయకుడిగా ఎంపిక చేసింది. అమెరికా వెళ్లే భారత ఎంపీల బృందానికి థరూర్ నాయకత్వం వహిస్తున్నారు. దీంతో వీరిద్దరి సామర్థ్యంపై పాక్‌లో చర్చ జరుగుతోంది. అంతర్జాతీయ అంశాల పట్ల అవగాహనలోగానీ, వ్యక్తీకరణలోగానీ థరూర్‌కు బిలావల్ సమ ఉజ్జీ కాదని పలువురు పాక్ నేతలే పెదవి విరుస్తున్నట్లు సమాచారం. మరోవైపు, ఇండొనేషియా, మలేషియా తదితర దేశాలకు వెళ్లే ఎంపీల బృందంలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్ పేరు చేర్చటంపైనా వివాదం రేగుతోంది. తృణమూల్ పార్లమెంటరీ పార్టీ చెయిర్‌పర్సన్ అయిన తనకు సమాచారం ఇవ్వకుండానే తమ పార్టీ ఎంపీని ఎంపిక చేయటం ఏమిటని మమతా బెనర్జీ ప్రశ్నించారు. అయినప్పటికీ తాను వివాదం చేయదల్చుకోలేదని, తమ ప్రతినిధిని పంపిస్తామని చెప్పారు. అయితే, విదేశాలకు వేళ్లే ఎంపీల బృందం నుంచి తప్పుకొంటున్నట్లుగా యూసుఫ్ పఠాన్ ప్రకటించారు.

ఐదోరోజు 60వేల మంది స్నానాలు

- సరస్వతీ పుష్కరాల్లో కాస్త తగ్గిన రద్దీ
- సర్కారుకు అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ పుష్కరాల నిర్వహణపై ఏమాత్రం లేదు
- రూ.35కోట్లు ఏ మూలకు సరిపోతాయి?
- కేంద్ర మంత్రి బండి సంజయ్

భూపాలపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న అంతర్వాహిని సరస్వతీ పుష్కరాల్లో తొలి నాలుగు రోజులతో పోలిస్తే ఐదో రోజైన సోమవారం భక్తుల రద్దీ కాస్త తగ్గింది. సోమవారం 60వేల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు చేసి కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఏపీ నుంచీ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రద్దీ పెద్దగా లేకపోవడంతో శని, ఆదివారాల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలు సోమవారం కనిపించలేదు. సోమవారం సరస్వతీ నదిలో నాసిక్ త్రయంబకేశ్వర్ పీఠాధిపతి శ్రీమహా మండలేశ్వర స్వామిజీ, హైకోర్టు జడ్జి నందిగొండ నర్సింగారావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దంపతులు, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రనాయక్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు పుణ్యస్నానాలు చేశారు.

నిర్వహణలో రాష్ట్ర సర్కారు విఫలం: బండి

రాష్ట్ర ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ సరస్వతీ పుష్కరాలపై లేకుండా పోయిందని, అందాల పోటీలకు రూ.300కోట్లు ఖర్చు పెట్టిన ప్రభుత్వం పుష్కరాలకు మాత్రం రూ.35కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందని... ఈ నిధులు ఏ మూలకు సరిపోతాయని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యనించారు. ముక్తీశ్వర ఆలయాల వద్ద బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళా సందర్భంగా 50కోట్ల మంది భక్తులకు బీజేపీ ప్రభుత్వం అద్భుతమైన సౌకర్యాలు కల్పిస్తే కాళేశ్వరంలో 50లక్షల మందికి రాష్ట్ర ప్రభుత్వం తగిన వసతులు కల్పించలేకపోతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. పుష్కరాల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. గతంలో హామీ ఇచ్చినట్లుగా రూ.200కోట్లు విడుదల చేసి అన్ని మౌలిక సదుపాయాలతో కాళేశ్వరం ఆలయాన్ని, క్షేత్రాన్ని అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు వెంటనే చర్యలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.


కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద భక్తుల రద్దీ

వేములవాడలో భక్తుల రద్దీ

- 70 వేలకు పైగా మంది రాక

వేములవాడ కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు కావడంతో భక్తుల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రం నలుమూలల నుంచి 70 వేలకు పైగా వచ్చినట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. భారీగా తరలివచ్చిన భక్తులతో రాజన్న ఆలయ పరిసరాలు, క్యూలైన్ రద్దీగా కనిపించాయి. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడెమొక్కు చెల్లించు కునేందుకు భక్తులు సుమారుగా నాలుగు గంటల క్యూలైన్‌లో నిరీక్షించారు. మొక్కులు చెల్లించుకుని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. ఆలయ గుడి చెరువులోని పార్కింగ్ స్థలం వాహనాలతో నిండిపోయి కనిపించింది.

కుమారుడిని రక్షించి... తండ్రి మృత్యు ఒడికి!

- కృష్ణానది బ్యాక్‌వాటర్‌లో మునిగి మృతి

దేవరకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): స్నానం చేస్తున్న కుమారుడు నీట మునిగిపోతుండగా రక్షించి, ఆ తర్వాత మళ్లీ ఈతకు వెళ్లిన తండ్రి నీటిలో మునిగి మృతి చెందాడు. దీంతో సరదాగా గడిపేందుకు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి హైదరాబాద్ నుంచి కృష్ణా పరివాహక ప్రాంతానికి వచ్చిన ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. కాంట్రాక్టు సివిల్ ఇంజనీర్ అయిన హైదరాబాద్ షేక్‌పేటకు చెందిన రాంజోషి వాసుదేవరావు (52) కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి మూడు వాహనాల్లో 15 మంది ఆదివారం వైజాగ్‌కాలనీకి చేరుకున్నారు. సాయంత్రం కృష్ణా పరివాహక ప్రాంతంలో స్నానం చేసేందుకు కొంతమంది కుటుంబ సభ్యులు, బంధువులు నీటిలోకి దిగారు. కుమారుడు సాయి కృష్ణ నదిలో స్నానం చేస్తూ నీట మునిగిపోతుండగా, గమనించిన వాసుదేవరావు రక్షించి ఒడ్డుకు చేర్చాడు. ఆ తర్వాత స్నానం చేసేందుకు మళ్లీ లోపలికి వెళ్లిన వాసుదేవరావు ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు కేకలు వేయగా అక్కడే ఉన్న మత్స్యకారులు నీటిలో గాలించి వాసుదేవరావును ఒడ్డుకు చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వాసుదేవరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య రాంజోషి విశాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.


మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేటీఆర్

హైదరాబాద్ చరిత్రలోనే విషాదకర ఘటన

- 'గుల్జార్ హౌజ్' ఘటనలో బాధిత కుటుంబాలకు 25 లక్షల చొప్పున పరిహారమివ్వాలి : కేటీఆర్

హైదరాబాద్ సిటీ/మదీన, మే 19(ఆంధ్రజ్యోతి): గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాద ఘటన హైదరాబాద్ చరిత్రలోనే విషాదకరమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఆ కుటుంబానికి జరిగిన నష్టం భవిష్యత్తులో మరొకరికి జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 125 ఏళ్లుగా చార్మినార్ దగ్గర ఉంటున్న అగర్వాల్ కుటుంబంలోని 17 మంది చనిపోవడం ప్రతి ఒక్కరినీ కలిచివేసిందన్నారు. ఫైరింజన్ నీళ్లలేకుండా వచ్చిందని, అగ్నిమాపక సిబ్బంది మాస్కులు లేకుండా రావడంతో లోపలికి వెళ్లలేకపోయారని.. అంబులెన్స్‌ల్లో ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులులేవని..ఈ సదుపాయాలుంటే కొన్ని ప్రాణాలైనా దక్కేవంటూ బాధిత కుటుంబ సభ్యులు వాపోయారని తెలిపారు. అందాల పోటీలకే కాదని, ఇలాంటి సందర్భాల్లో ఉండాల్సిన మౌలిక సదుపాయలపైనా ఖర్చు పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. బాధితులకు రూ.25 లక్షల పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ తరఫునా ఆదుకునే యత్నంచేస్తామన్నారు. కాగా, 'ప్రభుత్వం మాకు ఏమీ చేయలేదు. ఆస్పత్రిలో మేమే సీపీఆర్ చేసుకున్నాం' అని బాధిత కుటుంబ సభ్యులు కేటీఆర్‌తో చెప్పారు. అత్తాపూర్‌లో వారిని కేటీఆర్ పరామర్శించారు. ఈ అంశంపై ఎన్‌హెచ్ఆర్‌సీకి వెళ్లి కొట్లాడదామని బాధితులకు హామీ ఇచ్చారు.

ఏసీ కంప్రెషర్ పేలడంతోనే..?

'గుల్జార్ హౌజ్' అగ్నిప్రమాదానికి కారణమదే?.. ప్రాథమికంగా నిర్ధారించిన అధికారులు!

- అంబులెన్స్ 8 నిమిషాల్లో వెళ్లింది: కలెక్టర్
- అంబులెన్సుల్లో ఆక్సిజన్ ఉంది: డీహెచ్

హైదరాబాద్ /సిటీ/చార్మినార్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఏసీ కంప్రెషర్ పేలడం వల్లే గుల్జార్ హౌజ్ ప్రాంతంలోని భవనంలో అగ్నిప్రమాదం జరిగిందా? ఇంట్లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఏసీ కంప్రెషర్ పేలిపోవడంతోనే మంటలు వ్యాపించాయా? అంటే అధికారులు అవుననే అంటున్నారు. అగ్ని ప్రమాదానికి ఏసీ కంప్రెషర్ పేలుడే కారణమని విచారణాధికారులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలుస్తోంది. నిరంతరాయంగా ఏసీలను వినియోగించడంతో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఏసీలోని కంప్రెషర్ పేలి, పక్కనే ఉన్న విద్యుత్తు మీటర్లకు మంటలు వ్యాపించాయని పేర్కొంటున్నారు. అక్కడి నుంచి మొదటి, రెండో అంతస్తుల్లోకి దట్టంగా పొగ వ్యాపించిందని అధికారులు చెబుతున్నారు. మంటలు, పొగ వ్యాపించడంతో కుటుంబసభ్యులు బయటకు వెళ్లేందుకు యత్నించారని.. టెర్రస్ నుంచి బయటకు వెళ్లలేక మళ్లీ కిందకు వచ్చారని.. మెట్ల మార్గంలో మంటలు ఎగసి పడడంతో లోపలే ఉండిపోయారని పేర్కొంటున్నారు. అయితే, దర్యాప్తు అంశంపై పోలీసులు అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. మరోవైపు ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని బాధిత కుటుంబసభ్యుడు ఉత్కర్ష్ మోదీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం తన తండ్రి వినోద్ మోదీకి గుల్జార్ హౌజ్‌లోని ఇంట్లో ఉన్న రాహుల్ ఫోన్ చేసి అగ్నిప్రమాదం జరిగిందని, కాపాడాలని చెప్పారని ఫిర్యాదులో తెలిపారు. వెంటనే అక్కడికి చేరుకోగా.. గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లో మంటలు వ్యాపించాయని తెలిపారు. అప్పటికే డీఆర్ఎఫ్,పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు చార్మినార్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అగ్నిప్రమాదం జరిగిన భవనంలో ఉన్న కృష్ణ పెరల్స్, మోదీ పెరల్స్ దుకాణాల్లోని ముత్యాలతోపాటు ఇతర సామగ్రి, నివాసం భవనంలోని సామగ్రి కాలి బూడిదైందని మోదీ ఫిర్యాదులో పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు మృతుల అంత్యక్రియలు చేస్తుండడంతో అగ్నిప్రమాదం జరిగిన ఇంటికి పోలీసులు తాళంవేసి, బందోబస్తు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, అగ్నిమాపక శాఖ, జీహెచ్ఎంసీ అధికారులతో ఆస్తి నష్టంపై అంచనా వేస్తామని పోలీసులు తెలిపారు.


అగ్ని ప్రమాదం జరిగిన ఇంటి షట్టర్‌కు తాళాలు వేసిన పోలీసులు

అంబులెన్సులు వెంటనే రాలేదన్నది అవాస్తవం

అంబులెన్సులు సకాలంలో రాలేదని, బాధితులకు ఆక్సిజన్ సరిగా అందలేదని కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు అవాస్తవమని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఓ ప్రకటనలో తెలిపారు. 15 మంది బాధితులను 7 అంబులెన్సులు, 108 వాహనాల్లో ఆస్పత్రులకు తరలించినట్లు పేర్కొన్నారు. ఉదయం 6.17 గంటలకు సమాచారం 108 కాల్ సెంటర్‌కు అందిన వెంటనే గోషామహల్ 108 అంబులెన్స్ సిబ్బందితో కలిసి ఉదయం 6.25 నిమిషాలకు (8 నిమిషాలలో) వెళ్లిందన్నారు. అగ్నిప్రమాద బాధితులను ఆస్పత్రులకు తరలించిన అంబులెన్సుల్లో ఆక్సిజన్ లేదంటూ జరుగుతున్న ప్రచారాన్ని ప్రజారోగ్య సంచాలకుడు (డీహెచ్) రవీందర్ నాయక్ తప్పుపట్టారు. ఘటనాస్థలి నుంచి ఉదయం 6.25 గంటలకు అంబులెన్స్‌లో తొలిపేషెంట్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని తెలిపారు. మొత్తం 8 అంబులెన్స్‌లను పంపించామన్నారు. ప్రతి అంబులెన్స్‌లోనూ ఆక్సిజన్ సౌకర్యం ఉందని తెలిపారు.

జూన్ 30లోగా నివేదిక ఇవ్వండి: హెచ్ఆర్‌సీ

అగ్ని ప్రమాద ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్‌సీ)ఆగ్రహం వ్యక్తం చేసింది. భవన భద్రత, విద్యుత్తు నిర్వహణ, అగ్నిమాపక నిబంధనలు పాటించడం లేదంటూ మీడియాలో వస్తున్న కథనాలపై హెచ్ఆర్‌సీ స్పందించింది. కమిషన్ ఛైర్మన్ షమీమ్ అక్తర్.. ప్రమాదంపై సుమోటోగా విచారణకు ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలపై జూన్ 30లోగా నివేదిక సమర్పించాలని సీఎస్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, అగ్నిమాపక శాఖ డీజీ, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఈలకు ఆదేశాలు జారీ చేశారు.

పొలాల్లో ప్రాణాలొదిలిన నలుగురు రైతులు!

- అప్పులు తీర్చలేక ఒకరి ఆత్మహత్య
- ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం.. పిడుగు పాటుకు ఒకరి మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

మట్టిపై మమకారం పెంచుకుని, ఎన్నో ఆశలతో సాగు చేసిన పంట పొలాల్లోనే నలుగురు అన్నదాతలు తుదిశ్వాస విడిచారు. వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడగా, పొలాల్లో జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వేర్వేరు జిల్లాల్లో చోటుచేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా వున్నాయి. ఆదిలాబాద్ జిల్లా సాత్నాల మండలం సుందరగిరికి చెందిన కొక్కుల లచ్చన్న (56) లక్షల్లో అప్పులు తెచ్చి రెండున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. కొన్నేళ్లుగా దిగుబడులు సరిగ్గా రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై సోమవారం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కొత్తూరుకు చెందిన చెందిన పి.మురళీధర్‌రెడ్డి(59) సోమవారం బైక్‌పై వ్యవసాయ క్షేత్రానికి వెళ్తూ కింద పడివున్న విద్యుత్ వైర్లను గమనించకపోవడంతో బైక్ వాటికి తగిలి మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో బైక్‌తో పాటు మురళీధర్‌రెడ్డి కాలిపోయి మృతి చెందాడు. ఇదే జిల్లా కారేపల్లి మండలం బాజుమల్లాయిగూడెంలో సోమవారం సాయంత్రం పిడుగు పడి 17 గొర్రెలు మృతిచెందాయి. భద్రాద్రి జిల్లా ఇల్లెందు మండలం కట్టుగూడెం గ్రామానికి చెందిన పరిటాల పుల్లయ్య(42) పక్క గ్రామమైన రేపల్లేవాడ సమీపంలోని తమ పొలంలో బావి తవ్వుతుండగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పుల్లయ్య తమ్ముడు వెంకటేశ్వర్లు గాయపడగా ఆస్పత్రికి తరలించారు. మరో ఘటనలో.. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం కోర్పోల్‌కు చెందిన నారన్నగారి వెంకటరెడ్డి(53) మంజీరా నదిలో ఏర్పాటు చేసుకున్న పంపుసెట్ చెడిపోవడంతో మరమ్మతు కోసం బయటకు తీసేందుకు ఆదివారం సాయంత్రం నదిలోకి దిగి గల్లంతయ్యాడు. సోమవారం ఉదయం మృతదేహం లభ్యమైంది.

అనుమానంతో భార్యను చంపిన భర్త

- కూతుళ్ల ఎదుటే.. కత్తితో గొంతు కోసి దారుణ హత్య


అంజలి (ఫైల్)

ఆర్మూర్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానం పెంచుకున్న భర్త.. తన కూతుళ్ల కళ్లెదుటే ఆమె గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ఆర్మూరులో సోమవారం జరిగింది. రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్‌కు జగిత్యాల జిల్లా మొగిలిపేట్‌కు చెందిన అంజలితో 18 ఏళ్ల క్రితం వివాహమయింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గంగాధర్ జీవనోపాధి నిమిత్తం కొన్నేళ్లుగా దుబాయి వెళ్లొస్తుండేవాడు. సాఫీగా సాగుతున్న వీరి సంసారంలో.. అనుమానం అనే పెనుభూతం ప్రవేశించింది. భార్యపై అనుమానంతో ఐదేళ్లుగా గంగాధర్ గొడవ పడుతుండడంతో.. దంపతులిద్దరూ తమకు విడాకులు కావాలంటూ బోధన్ కోర్టులో దాఖలు చేసుకున్నారు. కూతుళ్ల చదువు నిమిత్తం అంజలి ఆర్మూర్ పట్టణంలో నివాసం ఉంటోంది. గంగాధర్ నెల రోజుల క్రితం దుబాయి నుంచి వచ్చి విడాకుల విషయమై.. సోమవారం బోధన్ కోర్టుకు హాజరుకావాలని అంజలికి ఫోన్ ద్వారా తెలిపాడు. దీంతో పిల్లలతో కలిసి బోధన్‌కు బయలుదేరిన అంజలిని మార్గమధ్యలో నిజామాబాద్ బస్టాండ్‌లో గంగాధర్ కలిశాడు. ఇప్పుడు కోర్టుకు అవసరం లేదని, తిరిగి వెళ్లిపోవాలని చెప్పి ఆమెకు తెలియకుండా అనుసరిస్తూ ఆర్మూర్‌కు వెళ్లాడు. ఆ తర్వాత ఇంట్లోకి చొరబడి అంజలిపై దాడికి పాల్పడ్డాడు. అడ్డొచ్చిన ఇద్దరు కూతుళ్లను తోసివేసి.. వారి కళ్లెదుటే భార్య గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. పిల్లల అరుపులు విన్న ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించాడు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయిచైతన్య, ఏఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇక.. మహిళా ఫైర్‌ఫైటర్లు!

- ప్రభుత్వానికి అగ్నిమాపక శాఖ ప్రతిపాదన
- ఆమోదిస్తే వచ్చే నియామకాల నుంచే అమలు



హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖలో మహిళా సిబ్బంది నియామకానికి కసరత్తు ప్రారంభమైంది. పోలీస్ నియామకాల మాదిరిగానే అగ్నిమాపక శాఖ పోస్టుల భర్తీలోనూ మహిళలకు 33శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈ మేరకు అగ్నిమాపక శాఖ అధికారులు తాజాగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీనికి ఆమోదం లభిస్తే... వచ్చే నోటిఫికేషన్ నుంచి అగ్నిమాపక శాఖ నియామకాల్లో మహిళలకు రిజర్వేషన్ అమల్లోకి రానుంది. అగ్నిమాపక శాఖలో విధులు నిర్వర్తించాలంటే శారీరక ధృడత్వంతోపాటు కఠినమైన ఫిట్‌నెస్ పరీక్షలు పాస్ కావాలి.. దీన్ని దృష్టిలో పెట్టుకొని అగ్నిమాపక శాఖలో మహిళా సిబ్బందిని నియమించడం లేదు. అయితే ఇతర దేశాలు, రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసిన తెలంగాణ అగ్నిమాపక శాఖ అధికారులు.. ఫైర్ ఫైటర్లుగా మహిళలకూ అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి నివేదించారు. ఇప్పటి వరకు తమిళనాడు, మహారాష్ట్రల్లోని అగ్నిమాపక శాఖల్లో మాత్రమే మహిళా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ముంబై అగ్నిమాపక శాఖలో మహిళా సిబ్బంది నియామకం కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2019లో తమిళనాడు ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా నియామక ప్రక్రియ చేపట్టగా.. వందలాది మంది శిక్షణ పొంది అగ్నిమాపక శాఖలో చేరారు. ఆ రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాల్ని అధ్యయనం చేసిన తెలంగాణ అగ్నిమాపక శాఖ అధికారులు.. ఇక్కడ కూడా మహిళా సిబ్బంది నియామకం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. "అగ్నిమాపక శాఖలో మహిళా సిబ్బంది నియామకానికి కసరత్తు జరుగుతోంది. ప్రభుత్వం అనుమతిస్తే రాష్ట్రంలోనూ మహిళలకు రిజర్వేషన్ కల్పించి, నియామకాలు చేపడతాం" అని అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డి తెలిపారు.

వారూ అనుమతి పొందాల్సిందే...

మహిళా సిబ్బంది నియామకంతోపాటు మరికొన్ని ప్రతిపాదనలను అగ్నిమాపక శాఖ ప్రభుత్వానికి అందజేసింది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం హై రైజ్ బిల్డింగ్స్‌కు మాత్రమే అగ్నిమాపక శాఖ అనుమతులు తప్పనిసరి కాగా.. ఇకపై నాన్ హై రైజ్ బిల్డింగ్‌లో నిర్వహించే వ్యాపార సంస్థలకూ దీన్ని వర్తింపజేయాలని ప్రతిపాదించింది. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న చిన్న గోదాంలు, పరిశ్రమలు, ఫర్నిచర్ తయారీ యూనిట్లు నాన్ హైరైజ్ బిల్డింగ్స్‌లో ఉన్నా అగ్నిమాపక శాఖ అనుమతి పొందేలా చట్టసవరణ చేయాలని కోరింది.

ఆమె డ్రైవింగ్ సరదాకు బాలుడి బలి

- కారు నేర్చుకునేందుకు భర్తతో కలిసి గ్రౌండ్‌కు మహిళ
- అదుపు తప్పి ఇద్దరు పిల్లలపైకి దూసుకెళ్లిన వాహనం
- తీవ్రగాయాలతో బాలుడి మృతి.. బాలికకు గాయాలు



మణిధర్‌వర్మ, ఏకవాణి (ఫైల్)

పటాన్‌చెరు, మే 19 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ కారు డ్రైవింగ్ నేర్చుకుంటుండగా వాహనం అదుపుతప్పి అక్కడే ఆడుకుంటున్న ఇద్దరు తోబుట్టువులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో వారిలో బాలుడు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా బాలికకు గాయాలయ్యాయి. ఆదివారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పరిధిలో ఈ ఘటన జరిగింది. సీఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం అమీన్‌పూర్ నవ్యకాలనీలో నివాసముండే మహేశ్వరి అనే మహిళ కారు నేర్చుకునేందుకు సాయంత్రం ఐదు గంటలకు భర్త రవిశేఖర్‌తో కలిసి పక్కనే ఉన్న నర్రెగూడెం గ్రౌండ్‌కు వచ్చారు. ఆ సమయంలో నర్రెగూడెం గ్రామానికి చెందిన శేఖర్, అనురాధ దంపతుల పిల్లలు మణిధర్ వర్మ (10), ఏకవాణి (12) గ్రౌండ్‌లో ఆడుకుంటున్నారు. ఆ పిల్లలకు తోడుగా వారి పెద్దనాన్న, పెద్దమ్మలు అక్కడికొచ్చారు. ఈక్రమంలో మహేశ్వరి డ్రైవింగ్ సీట్లో కూర్చుని కారును ముందుకు దూకించింది. అయితే ఆ వాహనం అదుపుతప్పి పిల్లలపైకి దూసుకెళ్లింది. మణిధర్ వర్మ, ఏకవాణి కారు చక్రాల కింద నలిగిపోయారు. మణిధర్‌వర్మ అక్కడికక్కడే మృతి చెందగా ఏకవాణిని చికిత్స కోసం హుటాహుటిన అదే కారులో బీరంగూడలోని హరిణి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాలికకు ప్రాణాపాయం తప్పినట్లు తెలుస్తోంది. బాధితుల బంధువుల దాడిలో కారు ధ్వంసమైంది. ప్రమాదంపై ఆదివారం రాత్రి బాధితులు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహేశ్వరి, భర్త రవిశేఖర్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రిలో బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించగా సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

అధిక వేడితో గర్భిణులకు ముప్పు

- అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, మే 19: వాతావరణ మార్పుల కారణంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ప్రభావం గర్భిణులపై పడుతోంది. భారత్‌లో 2020-24 మధ్య ఐదేళ్ల కాలంలో గర్భిణులకు ప్రమాదకరమైన అధిక ఉష్ణోగ్రతలు ఏడాదికి సగటున ఆరు రోజులు అదనంగా నమోదయ్యాయని సోమవారం ప్రచురితమైన ఓ అధ్యయనం వెల్లడించింది. అలాంటి అధిక ఉష్ణోగ్రతలు నమోదైన రోజులు 90 శాతం దేశాల్లో రెట్టింపు అయ్యాయని అమెరికాకు చెందిన క్లైమేట్ సెంట్రల్ అనే సంస్థ పేర్కొంది. గర్భధారణ సమయంలో ఉష్ణోగ్రతల పరంగా ప్రమాదకరమైన రోజుల పెరుగుదలను గుర్తించేందుకు శాస్త్రవేత్తలు 247 దేశాలు, భూభాగాల్లో రోజువారీ ఉష్ణోగ్రతలను విశ్లేషించారు. భారత్‌లో ఏడాదికి సగటున ఆరు రోజులు అదనంగా ప్రమాదకర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని పరిశోధకులు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా మూడోవంతు దేశాల్లో ప్రతి ఏడాది అదనంగా 30 రోజులు నమోదయ్యాయని పేర్కొంది. తీవ్రమైన వేడి వాతావరణం వల్ల ముందస్తు ప్రసవాలు, తల్లికి అనారోగ్యం, గర్భధారణ మధుమేహం వంటి సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతుంటారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మహావిషాదం

హైదరాబాద్ చార్మినార్ సమీపంలోని ఒక భవనంలో ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించి పదిహేడుమంది ప్రాణాలు కోల్పోయిన ఘటన అత్యంత విషాదకరమైనది. వేసవిసెలవుల్లో సరదాగా గడిపేందుకు ఒకేచోటకు చేరిన ఇద్దరు అన్నదమ్ముల కుటుంబాలు ఈ భయానకప్రమాదంలో చిక్కుకొని ప్రాణాలుకోల్పోవలసి వచ్చింది. అంతాగాఢనిద్రలో ఉండగా అగ్నికీలలు భవనాన్ని కమ్మేయడంతో, మొదటి అంతస్తులో ఉన్నవారు కిందకు దిగలేక, పైకిపోలేక గదిలోనే ఉండిపోయి, పొగకు, వేడిమికి గురై అపస్మారక స్థితిలోకి జారుకొని, ఆస్పత్రికి తరలించేలోగానే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో అత్యధికులు చిన్నారులు, మిగతావారు మహిళలు, వృద్ధులు. దేశం యావత్తూ ఈ దుర్ఘటనకు నిర్ఘాంతపోయింది. రాష్ట్రపతి, ప్రధాని సహా ప్రముఖులంతా దిగ్భ్రాంతిని, సంతాపాన్ని తెలియచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతోపాటు, ఈ ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి సమగ్ర విచారణకు ఆదేశించారు.

ఉజ్వలమైన భవిష్యత్తు ఉన్న చిన్నారులతో సహా పదిహేడుమంది జీవితాలను అర్థంతరంగా ముగించేసిన ఈ దారుణం మనసులను కలచివేయడంతో పాటు కొన్ని ప్రశ్నలను కూడా లేవనెత్తుతోంది. ఇటువంటి ప్రమాదాలు ఆకస్మికంగా, అకారణంగా జరిగిపోయినట్టు ఉపరితలంలో కనిపిస్తాయి కానీ, మానవతప్పిదం, వ్యవస్థాగత నిర్లక్ష్యం వాటికి దోహదపడుతున్నాయన్నది వాస్తవం. కింద మూడు దుకాణాలతో వ్యాపారం, పైన నివాసం కలగలిసిన ఈ భవనం ప్రవేశద్వారం ఎంత ఇరుకుగా ఉన్నదో, ఉన్న ఆ కాస్త స్థలంలోనూ వాహనాలు సహా అనేక అడ్డంకులవల్ల అగ్నిమాపక సిబ్బంది ప్రవేశం ఎంత కష్టమైపోయిందో వార్తలు తెలియచెబుతున్నాయి. ఈ ఇంట్లోకి ప్రవేశించేందుకు మరో మార్గమన్నదే లేక, పక్కభవనం గోడలకు రంధ్రాలు చేసి అగ్నిమాపక సిబ్బంది బాధితులను కాపాడవలసివచ్చిందట. ఖరీదైన వ్యాపారాలు చేసుకుంటున్నవారు కూడా కనీస జాగ్రత్తలమీద శ్రద్ధపెట్టకపోవడం ప్రమాద తీవ్రత ఈ స్థాయిలో ఉండటానికి దోహదం చేసింది. ఏమీ జరగదన్న అర్థంలేని నమ్మకమో, బాధ్యతారాహిత్యమో తెలియదు కానీ, ఆ వ్యాపార కుటుంబం భవన నిర్మాణంనుంచి నిర్వహణ వరకూ పలు తప్పిదాలకు పాల్పడి తమ భద్రతనే ప్రమాదంలో నెట్టేసుకుంది. ఏసీల వంటివి వాడుతున్నప్పుడు ఇటువంటి ఆవాసాలను ప్రమాదరహితంగా తీర్చిదిద్దుకోవడం మరింత ముఖ్యం.

ప్రమాదం ఎందుకు జరిగిందో, మంటలు త్వరితగతిన మొత్తం భవనాన్ని ఎలా కమ్ముకురాగలిగాయో తెలుస్తూనే ఉంది. మానవ నిర్లక్ష్యం, నియమనిబంధనలపట్ల బేఖాతరు, పలు వ్యవస్థల బాధ్యతారాహిత్యం కలగలిసిన దారుణం ఇది. ఈ ఒక్క భవనమే కాదు, ఈ ప్రాంతంలోనే ఇటువంటివి అనేకం ఇదే తరహాలో అతి సునాయాసంగా ప్రమాదానికి లోనయ్యేరీతిలో ఉన్నాయన్న వాస్తవం అధికారులకు తెలియందీ కాదు. నిబంధనలకు లోబడి నిర్మాణాలు ఉన్నాయా, ప్రమాదాలు జరిగినప్పుడు తప్పించుకోగలిగే మార్గాలు ఉన్నాయా, అగ్గిరాజుకోగానే తక్షణం ఆర్పగలిగే పరికరాలు పనిచేస్తున్న స్థితిలో అందుబాటులో ఉంటున్నాయా అన్నది అధికారులు నిరంతరం గమనిస్తూ, యజమానులను అప్రమత్తం చేస్తూవుంటే ప్రమాదాలను నివారించవచ్చు. పాతభవనాలు, మరీముఖ్యంగా ఇరుకైన ప్రాంతాల్లోని ఇటువంటి గృహ, వాణిజ్య సదుపాయాలమీద అధికారుల నిఘా మరింత అధికంగా ఉండాలి. ప్రమాదాలు జరిగినప్పుడు ఫైరింజన్లు ఆ సందుల్లోకి పోలేకపోతున్నాయి, అగ్నిమాపక సిబ్బంది ప్రవేశం సైతం సమస్యగా పరిణమిస్తున్నది. భవనం కింద అంతస్తులో నిప్పు అంటుకుంటే, పై భాగాన ఉంటున్నవారు కిందకు దిగలేక, చివరకు కమ్మేసిన పొగవల్లనే ప్రాణాలు వదిలేయడం చాలా ఘటనల్లో చూస్తున్నాం. నిప్పుకంటే పొగే ప్రాణాంతంగా పరిణమిస్తున్నది. ప్రాణాలు దక్కించుకోవాలంటే పైనుంచి దూకేయడం తప్ప మరో ప్రత్యామ్నాయ మార్గమంటూ లేకపోవడం విషాదం. వ్యాపారాలు సాగిపోతూంటాయి, నగరాలు ఎదిగిపోతూంటాయి, ప్రాణాలకు మాత్రం నమ్మకం లేని స్థితి. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఘటన చేజేతులా చేసుకున్నదీ, కచ్చితంగా నివారించగలిగిందీ. అనేకానేక ఈ తరహా దుర్ఘటనల్లో ఇది కూడా ఒకటిగా కాలగర్భంలో కలిసిపోయి, విషాదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే, దీని హెచ్చరికలను లక్ష్యపెట్టాలి, పాఠాలు నేర్చుకోవాలి.

భూతాలు సృష్టికర్తలనూ ధిక్కరిస్తాయి!



రణతంత్రంలో సాంకేతిక ఆధిపత్యాన్ని ప్రదర్శించినా కశ్మీరీ ప్రజల హృదయాలను గెలవటం అంతకంటే ముఖ్యమనే ఆధునిక చరిత్ర చెబుతోంది. రాష్ట్రహోదాను పునరుద్ధరించటం అందుకు మొదటిమెట్టు కావచ్చు. నియంత్రణరేఖను అంతర్జాతీయ సరిహద్దుగా మార్చటానికి ఇతరదేశాల మద్దతు సంపాదించటం మరో మెట్టూ కావచ్చు! వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా ఆ ప్రయత్నం కొంత జరిగింది. వైషమ్యాల కాలం ముగిస్తేనే జనాకర్షక నినాదాలు తొలగి నిబ్బర ఆలోచనలతో నిజమైన అడుగులు పడతాయి. శత్రు పరివేష్టితం ఎప్పటికీ శ్రేయస్కరం కాదు.



■ రాహుల్ కుమార్

'ప్రజల జ్ఞాపకశక్తి చాలా స్వల్పం' అనే మాట మనం తరచూ వింటూంటాం. దీన్నొక బలహీనతగా రాజకీయ నాయకులు భావిస్తారు. ప్రజలు దీన్ని అధిగమించలేరనీ, అందుకే పాత వాగ్దానాలను విస్మరిస్తున్నా, గతంలో చేసిన ఘోర తప్పులను చేయలేదన్నట్లుగా ప్రవర్తిస్తున్నా నెగ్గుకు రాగలుగుతున్నామనీ నమ్ముతారు. నిత్యజీవన సమరంలో ఏదోరకంగా బండి నెట్టుకు రావటానికే శక్తులన్నీ కూడదీసుకుంటున్న సగటు మనిషి విస్తృత సమాజంలో జరిగే పరిణామాలను ఒక లెక్క ప్రకారం గుర్తుపెట్టుకోలేడు. వాటి ఆధారంగా మంచిచెడులపై అన్ని సందర్భాల్లోనూ స్పందించలేడు. బహుళపార్టీ ప్రజాస్వామ్యంలో సైతం కపటత్వానికీ, మోసానికీ, వాగ్దాన భంగతకూ ఈ బలహీనతే ప్రధానకారణం. సాధ్యమైనంతవరకూ సాధారణ ప్రజలను వర్తమానంలోనే ఉంచి చరిత్ర స్పృహలేకుండా చేయటంలోనే దారుణాలన్నీ విస్మరణకు గురవుతాయి. వాటికి కారణమైన రాజకీయ పార్టీలూ, వ్యక్తులూ పాపంలో తమకు వాటాలేదన్నట్లుగా వ్యవహరిస్తూ పెద్దరికాన్ని ప్రదర్శిస్తారు.

పహల్గాం దారుణం తర్వాత భారత్-పాక్ మధ్య సాగిన సైనిక దాడులు, ప్రతిదాడులను ప్రస్తావిస్తూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలు ఈ కోవలోకే వస్తాయి. భారత్-పాక్ మధ్య నెలకొన్న వైషమ్యాల్లో అమెరికా పాత్ర లేనేలేదనీ వాటితో తమకున్న సంబంధం ఏమిటనీ ప్రశ్నించారు. మే 9న ఈ ప్రకటన చేసి 10వ తేదీకల్లా మాటమార్చి భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణకు తమ మధ్యవర్తిత్వమే కారణమని చెప్పుకున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అయితే భారత్-పాక్‌ల మధ్య సైనిక సంఘర్షణలను ఆపివేసి అణుయుద్ధ ప్రమాదం నుంచి ప్రపంచాన్నే రక్షించానని ఆర్భాటంగా ప్రకటించుకున్నారు. మొత్తం వ్యవహారంలో అమెరికా పాత్ర ఎంతో ఇప్పుడే చెప్పలేం. కాలం గడిస్తేనే నిజాలు వెలుగులోకి వస్తాయి. యుద్ధ సమయాల్లో ప్రభుత్వాలు అసలు విషయాలన్నిటినీ చెప్పవు. పాక్షిక సత్యాలనే చెబుతాయి. విజయగాథలనే ఎక్కువగా వినిపిస్తాయి. వైఫల్యాలను విస్మరిస్తాయి. తీసుకున్న నిర్ణయాలను సమర్థించుకుంటూ ప్రచారాన్ని హోరెత్తిస్తాయి.

నిష్పాక్షికంగా చరిత్రను పరిశీలిస్తే భారత్-పాక్ మధ్య సంఘర్షణలకు దోహదం చేస్తున్న ప్రతివిషయంలోనూ అమెరికా పాత్ర గణనీయంగానే కనపడుతుంది. ఇస్లామిక్ తీవ్రవాదాన్నే తీసుకుంటే అమెరికా నిర్వహించిన పాత్రను తక్కువచేసి చూడలేం. 1980లకు ముందు కూడా భారత ఉపఖండంలో మతతత్వాలు ఉన్నాయి. హిందూ–ముస్లింల మధ్య సంఘర్షణలకు లక్షలమంది బలైపోయారు. ముస్లింలను ప్రత్యేక జాతిగా పేర్కొంటూ వారి కోసం పాకిస్థాన్ ఏర్పడాలనే వాదమూ, హిందువుల ఆధిపత్యమే చెల్లుబాటు కావాలనే సిద్ధాంతమూ అనేక రూపాల్లో వ్యక్తమై విపరీత సంఘర్షణ వాతావరణాన్ని సృష్టించింది. దీన్ని అతికష్టం మీద అధిగమించి భారత్‌లో లౌకిక రాజ్యాంగాన్ని, ఆధునిక ప్రజాస్వామ్యాన్ని ఏర్పరచగలిగారు. మతప్రాతిపదికగా పాకిస్థాన్ దేశంగా ఏర్పడినా లౌకిక రాజ్యాంగాన్ని, ఆధునిక ప్రజాస్వామ్యాన్ని ఏర్పరుచుకోలేక తొలి నుంచీ సంక్షోభాల్లో, నియంతృత్వాల్లో కూరుకుపోయింది. కశ్మీర్ సమస్యపై 1980ల వరకూ భారత్-పాక్‌ల మధ్య మూడు యుద్ధాలు జరిగినా ఇస్లామిక్ తీవ్రవాదం వ్యవస్థీకృతంగా మారి, విపరీత సిద్ధాంత ప్రచారంతో, టెర్రరిస్టు చర్యలతో పెను సమస్యగా పరిణమించలేదు.

1979లో ఆఫ్ఘానిస్థాన్‌లో రష్యను సేనల ప్రవేశంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అమెరికా–రష్యాల మధ్య 1945 నుంచి కొనసాగుతున్న ప్రచ్ఛన్నయుద్ధం (కోల్డ్‌వార్) అప్పటి నుంచి కీలకమలుపు తిరిగింది. రష్యను సేనలను ఆఫ్ఘాన్ నుంచి పారదోలటానికి అమెరికా అనుసరించిన వ్యూహం, చేపట్టిన చర్యలు ప్రపంచచరిత్రనే రక్తసిక్తం చేశాయి. అల్‌ఖయదా, ముజాహిద్దీన్, తాలిబాన్ లాంటివే కాదు ఇంకా వేర్వేరు పేర్లతో వ్యవహరిస్తూ అనేక దేశాలను కుదిపివేస్తున్న టెర్రరిస్టు ముఠాలన్నీ అమెరికా ఆఫ్ఘాన్ వ్యూహం నుంచే ప్రాణం పోసుకున్నాయి. ఆ వ్యూహం అమలుకు కార్యక్షేత్రంగా పాకిస్థాన్ మారిపోయింది. అక్కడి సైనిక నియంతృత్వాన్ని ఆ వ్యూహమే బలోపేతం చేసింది. పాకిస్థాన్ సమాజాన్ని సైనిక ఉక్కుచట్రంలో బంధించింది. మతం ఆధారంగా తీవ్రవాదాన్ని సృష్టించటం సాపేక్షికంగా తేలిక. కానీ అది బలపడిన తర్వాత దాన్ని నియంత్రించటం చాలా కష్టం. అగ్ర రాజ్యాలు అత్యాధునిక ఆయుధాలను తయారు చేయొచ్చు. మానవరహిత ఆయుధాలతో మారణహోమాలను సృష్టించొచ్చు. కానీ హృదయాల్లో పాతుకుపోయిన భావాలను పెకలించటం కష్టమైన పని. మతతత్వ భూతాలకు ప్రాణంపోసిన తర్వాత అవి స్వతంత్రజీవుల్లా వ్యవహరిస్తాయి. సొంత లక్ష్యాలను ఏర్పరచుకుంటాయి. అలా వ్యవహరించబట్టే అల్‌ఖయదా చేతుల్లో అమెరికా కనీవినీ ఎరగని దారుణాన్ని, భయోత్పాతాన్ని చవిచూసింది. పాకిస్థాన్‌కూ ఈ గతి తప్పటంలేదు. అమెరికా కోసం ఆఫ్ఘానిస్థాన్‌లో, కశ్మీర్ కోసం భారత్‌లో తీవ్రవాదులను తయారు చేసే పులిమీద స్వారీ చేస్తోంది. చివరికి ఆఫ్ఘానిస్థాన్ నుంచే తీవ్ర అస్తిత్వ ముప్పును ఎదుర్కొంటోంది. బలూచిస్థాన్‌పై పట్టును కోల్పోతోంది. తాను సృష్టించిన తాలిబన్లలోని ఒక శాఖే పాక్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రముఖ అమెరికా చరిత్రకారుడు స్టాన్లీ వోల్‌పర్ట్ 2010లో పేర్కొన్న ప్రకారం ముస్లిం టెర్రరిస్టులు అధికంగా ఉన్న దేశం పాకిస్థానే.

డబ్బులు, ఆయుధాలు ఇచ్చినంత మాత్రాన తీవ్రవాద సిద్ధాంతానికి ప్రాచుర్యం లభించదు. దాన్ని మించి చేయగల గాలి. అమెరికా అదీ చేసింది. ఇస్లాం గొప్పమతమనీ, అది తీవ్ర ప్రమాదంలో పడిందనీ, దేవుడిని నిరాకరించే కమ్యూనిస్టుల చేతుల్లోకి ఆఫ్ఘానిస్థాన్ వెళ్లిపోయిందనీ, ప్రతి ముస్లిమూ పవిత్రయుద్ధాన్ని (జిహాద్) చేయాల్సిన పరిస్థితి వచ్చిందనీ పెద్దఎత్తున ప్రచారం చేసింది. ఆఫ్ఘాన్‌లో పవిత్ర యుద్ధానికి తరలిరావాల్సిందిగా రకరకాల రూపాల్లో ముస్లింలకు పిలుపునిచ్చింది. అరబ్బు, మధ్య ఆసియా, ఉత్తర ఆఫ్రికాల నుంచే గాక యూరపు నుంచి కూడా ముస్లింలు తరలివచ్చారు. అయితే ఆఫ్ఘానిస్థాన్ నుంచి పొట్టచేతబట్టుకుని పాక్‌కు తరలివచ్చిన 40 లక్షల మందితో పోల్చితే వీళ్ల బలగం చాలా తక్కువ. తరలి వచ్చిన వారిలో అనువైన లక్షలాది వ్యక్తులకు ఆయుధాలు, డబ్బుని సమకూర్చి రష్యాసేనలపై మెరుపుదాడులకు శిక్షణ ఇచ్చారు. ఐఎస్ఐ, సీఐఏ నేతృత్వంలో శిక్షణశిబిరాలు ఏర్పాటయ్యాయి. కొత్త మదరసాలు, మతప్రచార సంస్థలూ పుట్టుకొచ్చాయి. వీటిల్లోనే ఇస్లామిక్ తీవ్రవాదాన్ని నూరిపోశారు. ఆఫ్ఘాన్ యుద్ధం కోసం పాకిస్థాన్‌కు అమెరికా 1980ల్లో 10 బిలియన్ డాలర్లను ఇచ్చింది. అప్పటికి కొన్ని నెలల ముందు పాక్ మాజీ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టోను ఉరితీసిన మిలటరీ నియంత జియా ఉల్ హక్‌పై వ్యతిరేకత కూడా మొదలైంది. ఆఫ్ఘాన్‌లో పవిత్ర యుద్ధం జియా గతిని మార్చివేసింది. 11 ఏళ్ల జియా నియంతృత్వ పాలనలో ఇస్లాం తీవ్రవాదం ఎప్పుడూలేని రీతిలో బలపడింది. అమెరికా తన మీద ఆధారపడటాన్ని అలుసుగా తీసుకుని పంజాబ్‌లో ఖలిస్థానీ తీవ్రవాదాన్ని కూడా జియా ఎగదోశాడు. అమెరికా సమకూర్చిన అత్యాధునిక ఆయుధాలతో అన్నివైపులా దాడులకు గురైన రష్యా సైన్యం 1989 చివరినాటికి ఆఫ్ఘాన్ నుంచి వైదొలగింది.

రష్యన్ల బెడద తొలగిన తర్వాత తీవ్రవాదులు కశ్మీర్‌లోకి అడుగుపెట్టటం ప్రారంభించారు. అప్పటికే కశ్మీరీ ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకుని ఉంది. ఎన్నికలు సక్రమంగా జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు సొంత నిర్ణయాలు తీసుకునే పరిస్థితి పోయింది. ఆర్టికల్ 370 కల్పించిన ప్రత్యేకతలన్నీ అప్పటికే చాలా భాగం తొలగిపోయాయి. భూముల కొనుగోలు, ఉద్యోగాల్లో స్థానికత మినహా మిగతా ప్రత్యేకతలంటూ ఏమీలేవు. ఆర్థికాభివృద్ధి అంతంతమాత్రంగానే జరిగింది. 1947, 1965, 1971లో భారత్-పాక్ మధ్య జరిగిన యుద్ధాలు, అంతర్గత అసంతృప్తుల వల్లా 1975 నాటికే సైన్యం ఇతర బలగాలు కలిపి 5 లక్షలకు పైగా భద్రతాదళాలు కశ్మీర్‌లో తిష్టవేశాయని వోల్‌పర్ట్ పేర్కొన్నారు. అధికార లెక్కల ప్రకారమే 1990–95 వరకూ 13000 మంది భద్రతాదళాల చేతుల్లో హతమయ్యారనీ, అనధికార లెక్కల ప్రకారం ఆ సంఖ్య 50,000 దాకా ఉండొచ్చని కూడా వోల్‌పర్ట్ పేర్కొన్నారు. 2001 సెప్టెంబర్ 11 ఘటనల తర్వాత 'వార్ ఆన్ టెర్రర్' పేరుతో ఆఫ్ఘాన్‌పై అమెరికా మొదలుపెట్టిన యుద్ధంతో పాకిస్థాన్‌కు మరోసారి 10 బిలియన్ల డాలర్లు వచ్చిపడ్డాయి.

మతతత్వ భూతాలకు ప్రాణంపోసిన తర్వాత అవి స్వతంత్రజీవుల్లా వ్యవహరిస్తాయి. సొంత లక్ష్యాలను ఏర్పరచుకుంటాయి. అలా వ్యవహరించబట్టే అల్‌ఖయదా చేతుల్లో అమెరికా కనీవినీ ఎరగని దారుణాన్ని, భయోత్పాతాన్ని చవిచూసింది. పాకిస్థాన్‌కూ ఈ గతి తప్పటంలేదు.


అల్‌ఖయదా తీవ్రవాదులకు ఆశ్రయమిచ్చిన తాలిబన్లు ఆఫ్ఘాన్‌లో 1996లోనే అధికారంలోకి వచ్చారు. రష్యన్ వ్యతిరేక ఆఫ్ఘాన్ యుద్ధంలో 10 లక్షల మంది ప్రాణాలు కోల్పోయిన పరిస్థితితో అనాథలైన పిల్లల నుంచి తాలిబాన్లు తయారయ్యారు. ఛాందస ముల్లాల నేతృత్వంలో కుటుంబ ప్రేమలు లేకుండా కరడుకట్టిన మధ్యయుగాల భావాలతో పెరిగిన తాలిబన్లకు... ఆధునిక నాగరికతతో వచ్చిన ప్రతి సాంకేతిక సౌకర్యంతో పాటు సంగీతం, శిల్పం, చలనచిత్రం ఇస్లాంకు విరుద్ధంగానే కన్పించాయి. అట్లాంటి తాలిబన్లతో యుద్ధం ఆరంభించి, 2.3 ట్రిలియన్ డాలర్లు ఖర్చుపెట్టి మధ్యలోనే అమెరికా కాడి కింద పడవేసింది. 2021 నాటికి ఆఫ్ఘన్ నుంచి పూర్తిగా వైదొలగి తాలిబన్లకు తిరిగి అధికారాన్ని అప్పగించింది. ఒకసారి అగ్రరాజ్యం చేతిలో ఓడిపోయిన గెరిల్లాలు రెండోదఫా అదే రాజ్యంపై 20 ఏళ్ల పాటు యుద్ధరంగంలో నిలబడి విజయం సాధించటం ప్రపంచంలోనే అరుదనీ ప్రముఖ జర్నలిస్టు అహ్మద్ రషీద్ వ్యాఖ్యానించారు.

ఏ కోణం నుంచి చూసినా ఇస్లాం తీవ్రవాదం బలపడటంలో అమెరికా ఆధిపత్య దాహం నిర్వహించిన పాత్ర విస్మరించలేనిది. అమెరికా అండతోనే భారత్‌తో పాక్ రెండుసార్లు యుద్ధానికి తలపడింది. రెండు కీలక ఒప్పందాల్లో (సీటీఎస్‌టీఓ, ఎస్‌ఈఏటీఓ) పాక్‌ను అమెరికా భాగస్వామిని చేసుకోవటంతో కశ్మీర్ సమస్యపై భారత్ పట్టు విడుపుల్లేకుండా వ్యవహరించాల్సి వచ్చింది. చరిత్ర ఇంకో వాస్తవాన్ని కూడా మన కళ్ల ముందు ఉంచుతోంది. రణ తంత్రంలో సాంకేతిక ఆధిపత్యాన్ని ప్రదర్శించినా కశ్మీరీ ప్రజల హృదయాలను గెలవటం అంతకంటే ముఖ్యమనే ఆధునిక చరిత్ర చెబుతోంది. రాష్ట్రహోదాను పునరుద్ధరించటం అందుకు మొదటిమెట్టు కావచ్చు. నియంత్రణరేఖను అంతర్జాతీయ సరిహద్దుగా మార్చటానికి ఇతరదేశాల మద్దతు సంపాదించటం మరో మెట్టూ కావచ్చు! వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా ఆ ప్రయత్నం కొంత జరిగింది. వైషమ్యాల కాలం ముగిస్తేనే జనాకర్షక నినాదాలు తొలగి నిబ్బర ఆలోచనలతో నిజమైన అడుగులు పడతాయి. శత్రు పరివేష్టితం ఎప్పటికీ శ్రేయస్కరం కాదు.

న్యాయ వ్యవస్థకు మకిలి పట్టిందా?

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల్లో సగం మంది అవినీతిపరులు, నేరస్తులేనని వేర్వేరు సందర్భాల్లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మార్కండేయ కట్జూ, ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ గతంలో ఆరోపించారు. వారిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకున్నప్పుడు, జరిమానా కట్టడానికి సైతం వారు నిరాకరించి తమ మాట మీదే నిలబడ్డారు.

ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి యశ్వంత్ వర్మ నివాసంలో జరిగిన ఓ అగ్ని ప్రమాదం అనంతరం కాలిన కరెన్సీ నోట్లు బస్తాల కొద్దీ బయటపడ్డాయి. దీంతో 'న్యాయమూర్తుల అవినీతి' అంశం దేశవ్యాప్తంగా మరోసారి చర్చల్లోకొచ్చింది. పక్కా ఆధారాలు దొరికిపోయినా, సాధారణ నేరస్తుల్లాగా యశ్వంత్ వర్మ ఆ నేరారోపణను తిరస్కరించి, 'తనకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోంద'ని వెల్లడించారు. గతంలో సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.డి. దినకరన్‌లా తన పదవికి రాజీనామా చేసి ఉంటే కనీసం ఆయనకు గౌరవం అయినా దక్కేది. యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు తిరిగి బదిలీ చేయబోగా, "మా హైకోర్టేమీ చెత్త బుట్ట కాదు" అంటూ అక్కడి న్యాయవాదులు విధులను బహిష్కరించి ఆందోళన చేశారు. చివరకు యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతూ నాటి సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా మే 7న కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాల్సి వచ్చింది.



ఎమర్జెన్సీ సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'జీవించే హక్కు'పై తీర్పు చెప్పిన జస్టిస్ ఖన్నా, ఆ తీర్పు ఇవ్వడానికి ముందు తన చెల్లెలితో మాట్లాడుతూ.. 'రేపు నేనివ్వబోయే తీర్పు భవిష్యత్తులో నన్ను ప్రధాన న్యాయమూర్తిగా ఉండనివ్వదు' అన్నారట. అన్నట్లే ఆయన స్థానంలో జూనియర్ అయిన జస్టిస్ బేగ్‌ను 1976లో సీజేగా నియమించారు.

దేశంలోని అన్ని హైకోర్టుల్లోను (25) కలిపి 1,044 మంది న్యాయమూర్తులు ఉండాలి. సుప్రీంకోర్టులో 34 మంది న్యాయమూర్తులు ఉండాలి. ఇక కింది స్థాయిలో మొత్తం 25,077 మంది న్యాయమూర్తులుండాలి. కానీ ప్రస్తుతం 19,309 మంది న్యాయమూర్తులు మాత్రమే ఉన్నారు. ఇంకా 5,768 ఖాళీలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే ఆంధ్రప్రదేశ్‌లో న్యాయమూర్తుల సంఖ్య 533, తెలంగాణలో 461. ఇక్కడ మరో విషయం చెప్పుకోవాలి. నేను న్యాయవాదిగా 42 సంవత్సరాల నుంచి క్రియాశీలకమైన ప్రాక్టీస్‌లో ఉన్నాను. నా సర్వీసు మొత్తంలో నేను సుమారు ఐదారు వందలమంది న్యాయమూర్తులతో కలిసి పనిచేశాను. న్యాయమూర్తుల గురించిన పరోక్ష సమాచారం కూడా నాకు అందుతూ ఉంటుంది. అందులో కూడా ఈ మొత్తం సంఖ్య 1000 మంది అనుకుంటే.. వీరందరిని కలిపి చూసినా కూడా అవినీతి ఆరోపణలు వచ్చిన న్యాయమూర్తులు ఏ స్థాయిలోనూ అయిదు శాతం మంది కూడా ఉండరు. 80వ దశకం ప్రారంభంలో నేను న్యాయవాదిగా వచ్చినప్పుడు జిల్లా జడ్జి జీతం పదివేల లోపు, మేజిస్ట్రేటుల జీతం మూడువేల లోపు ఉండేది. అయినా నిజాయితీగా జీవించిన న్యాయమూర్తులే అధికం.

ఎలా చూసినా మొత్తం న్యాయమూర్తుల్లో అవినీతిపరులు అయిదు శాతం కన్నా తక్కువే ఉన్నా... సగానికి సగం అవినీతిపరులు ఉన్నట్లు పేర్కొనటం న్యాయమేనా? ఈ అవినీతి కూడా ఉన్నత స్థాయి న్యాయమూర్తుల్లో ఉన్నంతగా కింది స్థాయిలో లేదనే విషయం కూడా గమనించాలి. న్యాయమూర్తుల్లో నీతి, న్యాయం కోసం తమ భవిష్యత్తును పణంగా పెట్టిన మహానుభావుల్ని కూడా మనం స్మరించుకోవాలి.

ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా తీర్పునిస్తే తదనంతర పరిణామాలు తెలిసి కూడా జస్టిస్ జగ్‌మోహన్ సిన్హా 1975లో ఆమె ఎన్నిక చెల్లదంటూ తీర్పునిచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'జీవించే హక్కు'పై తీర్పు చెప్పిన జస్టిస్ ఖన్నా, ఆ తీర్పు ఇవ్వడానికి ముందు తన చెల్లెలితో మాట్లాడుతూ.. 'రేపు నేనివ్వబోయే తీర్పు భవిష్యత్తులో నన్ను ప్రధాన న్యాయమూర్తిగా ఉండనివ్వదు' అన్నారట. అన్నట్లే ఆయన స్థానంలో జూనియర్ అయిన జస్టిస్ బేగ్‌ను 1976లో సీజేగా నియమించారు. జస్టిస్ ఏ.ఏ. ఖురేషిని సుప్రీం కొలీజియం సిఫార్సు చేసినా కూడా గుజరాత్‌లో మోదీకి, అమిత్‌షాకు వ్యతిరేకంగా తీర్పులిచ్చిన కారణంగా ఆయన్ను సుప్రీంకోర్టు మెట్లు ఎక్కనివ్వలేదు.

పదవీ విరమణ తర్వాత ఇతర పదవుల కోసం కక్కుర్తి పడిన ఓ అయిదారుగురిని చూపించి నిజాయితీగా జీవితం గడిపిన వందలాది న్యాయమూర్తుల్ని అవమానించటం సరైనది కాదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాల్ని అనుసరించిన అనేక సందర్భాల్లో ప్రజలకు ఊరట కలిగించింది న్యాయవ్యవస్థే. ప్రతిపక్షాలు సైతం నిర్వీర్యమైన పరిస్థితుల్లోనూ న్యాయస్థానాలే ప్రజలను ఆదుకున్న చరిత్రను 2019–24 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో చూశాం. అందుకే పదవీ విరమణ చేసి వెళ్లిపోతున్న న్యాయమూర్తులకు ప్రజలు బారులు తీరి నీరాజనాలు పలికిన దృశ్యాల్ని ఆనాడు అనేక మాధ్యమాల్లో వీక్షించాం. మరి మొత్తం న్యాయవ్యవస్థ పాపపంకిలమైందన్నట్లు ప్రచారం చేయడం న్యాయం కాదు. ప్రజలు అంతిమంగా ఆధారపడాల్సిన వ్యవస్థ పట్ల అపనమ్మకం కలిగించటం కూడా భావ్యం కాదు.

• చెరుకూరి సత్యనారాయణ

మూసీ ప్రక్షాళన మరిచినట్టేనా?

పాలకుల పలుకుల్లో ఉన్నంత గాఢత వారి చేతల్లో ఉండదు. 'మూసీ నదిని గంగలా గలగలా పారిస్తాం' అని గతంలో పలికిన పాలకులు ఇప్పుడు మిన్నకుండిపోయారు. మూసీని థేమ్స్ నదిలా మార్చేస్తామంటూ మాటిచ్చిన తెలంగాణ ముఖ్యమంత్రి ఇప్పుడు ఆ మాటే మరిచిపోయినట్లున్నారు. మూసీ ప్రక్షాళన కోసం కేటాయించిన బడ్జెట్ పేపర్లకే పరిమితం అయిందా? ఎందుకు ఈ జాప్యం?

మూసీ నది హైదరాబాద్‌కే పరిమితమైనది కాదు. ఏపీలోని గుంటూరు జిల్లా వరకు తన ప్రవాహాన్ని కొనసాగిస్తూ వ్యవసాయానికి కూడా ఆదరువుగా ఉన్నది. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న ఈ నది పరిశ్రమల వ్యర్థాల వల్ల మురికికూపంగా మారింది. దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యానికి గురై విషపు నదిగానే మిగిలిపోయింది. ఫలితమే నల్లగొండలో ఫ్లోరైడ్ భూతం. నీటికి సహజంగా రంగు ఉండదు అని చదువుకున్నాం. కానీ మూసీలో ప్రవహించే నీరు మాత్రం తెల్లగా నురగలు కక్కుతూ ఉంటుంది. ఈ నీటిని తాగి పశుపక్ష్యాదులు మృత్యువాత పడుతున్నాయి.

నీటిని శుద్ధి చేసే యంత్రాలు ఉన్నాయి. యంత్రాంగం ఉంది. విదేశాలకు వెళ్లి అక్కడి సాంకేతికత, మెళకువలు నేర్చుకుని వచ్చిన మంత్రులు, అధికారులూ ఉన్నారు. మరెందుకు ఇంకా కాలయాపన? మూసీ సుందరీకరణ మొదలుపెడితే పరిశ్రమల యజమానుల నుంచి ఒత్తిడులు ఉంటాయా? ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన విధంగా ప్రభుత్వం తక్షణమే మూసీ సుందరీకరణ మొదలుపెట్టాలి. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు మూసీలో చేరకుండా చూడాలి.

– ప్రొఫెసర్ వెంకట్ దాస్
డా. పోటు నారాయణ

రేపటి తరానికి మూడు నవీన విద్యానైపుణ్యాలు

సాంకేతిక పురోగతితోపాటు పలు వృత్తులలో పనిచేసే పద్ధతులు కూడా వేగంగా మారుతున్నాయి. పరిశ్రమలు విస్తృతంగా కృత్రిమ మేధస్సు (ఏఐ)ను వినియోగిస్తున్నాయి. పని తీరును డిజిటలైజ్ చేస్తున్నాయి. దీనికి అనుగుణంగా పరిశ్రమల యాజమాన్యాలు ఆ రంగాల్లో నిపుణులైనవారినే గాక, విమర్శనాత్మకంగా ఆలోచించగల, సృజనాత్మకంగా పనిచేయగల గ్రాడ్యుయేట్లను కోరుకుంటున్నాయి.

దశాబ్దాలుగా భారతీయ ఉన్నత విద్య లోతైన అంశాలవారీ విషయ పరిజ్ఞానంపై దృష్టి సారించింది. ఈ సాంప్రదాయ విద్య విద్యార్థులకు పునాది లాంటి విజ్ఞానాన్ని అందజేసినా, ఆధునిక జీవితంలో ఎదురయ్యే సవాళ్ళకు వారిని సంసిద్ధం చేసేందుకు చాలాసార్లు అది సరిపోవటం లేదు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా అండర్ గ్రాడ్యుయేట్ విద్య స్వరూపంపై పునరాలోచన చేయాల్సిన అవసరం ఉంది. మూడు ముఖ్యమైన ఆధునిక నైపుణ్యాలు నేడు కీలకంగా మారాయి. అవి- కంప్యూటేషనల్ థింకింగ్ (సీటీ), కృత్రిమ మేధస్సుపై అవగాహన (ఏఐ), డిజైన్ థింకింగ్ (డీటీ).

సాంప్రదాయ విద్య ద్వారా నేర్చుకున్న పరిజ్ఞానం ఇక భవిష్యత్తు తరాలకు సరిపోదు. అంశాలవారీ విజ్ఞానంతో పాటు సమస్య పరిష్కారం, సాంకేతిక అవగాహన, విభిన్న ఆలోచనలను ఏకీకృతం చేయగల మూడు ముఖ్యమైన ఆధునిక సామర్థ్యాలు (సీటీ–ఏఐ–డీటీ)తో సన్నద్ధం చేయాలి.

కంప్యూటేషనల్ థింకింగ్ (సీటీ) అనేది సంక్లిష్ట సమస్యలను విశ్లేషించి, పరిష్కారాలను రూపొందించడంలో కంప్యూటర్ సైన్స్ పద్ధతులను ఉపయోగించే విధానం. ఇందులో క్లిష్టమైన సమస్యలను సులభంగా చేయగల భాగాలుగా విభజించడం, నమూనాలను గుర్తించడం, అల్గారిథమ్‌లను తయారు చేయడం, ముఖ్యమైన సమాచారంపై దృష్టిసారించి ప్రాధాన్యం లేని వివరాలను వడపోసి సమస్యా పరిష్కార పద్ధతులను రూపొందించడం... వంటివి ఇమిడి ఉంటాయి. దీనిని అన్ని రంగాలలోనూ ఉపయోగించవచ్చు.

ఏఐ అక్షరాస్యత (ఏఐ లిటరసీ) నేటి కాలంలో ఎంతో కీలకంగా మారింది. ఏఐ అభివృద్ధి అటు పరిశ్రమల పనితీరును, ఇటు నిత్య జీవితాన్ని వేగంగా మారుస్తుంది. ఈ పరిస్థితుల్లో ఏఐకి సంబంధించిన ప్రాథమిక అంశాలను అర్థం చేసుకోవడం ప్రతి ఒక్కరికీ కీలకం. ఏఐ అక్షరాస్యత అంటే– మనుషులు విషయాలను నేర్చుకునే విధానాన్ని, సమస్యలను పరిష్కరించే పద్ధతిని, నిర్ణయాలు తీసుకునే తీరును, కొత్త ఆలోచనలను విడమరచి చెప్పే సామర్థ్యాన్ని యంత్రాలు ఎలా అర్థం చేసుకుంటాయో తెలుసుకోవడం. పెరుగుతున్న కృత్రిమ మేధ సమ్మిళిత (ఏఐ ఇంటిగ్రేటెడ్) ప్రపంచాన్ని ముందుకు నడపడానికి గాను ఏఐ పనితీరు, పరిమితులు, నైతిక బాధ్యతలను విద్యార్థులు అర్థం చేసుకోవాలి.

విశ్వవిద్యాలయాలన్నీ కంప్యుటేషనల్ థింకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజైన్ థింకింగ్‌లను తమ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్‌లో ప్రధాన భాగాలుగా వేగంగా అమలు చేయాలి. భవిష్యత్తు సమాధానాలు గుర్తుంచుకునే వారిది కాదు, సరైన ప్రశ్నలు అడిగి, మెరుగైన పరిష్కారాలను సూచించే వారిది!



వినియోగదారుల అవసరాలు, సాంకేతికపరమైన అవకాశాలు, వ్యాపార సాధ్యాసాధ్యాలను సమన్వయపరిచే మానవ కేంద్రీకృతమైన ఆవిష్కరణ విధానమే డిజైన్ థింకింగ్ (డీటీ). ఇది ఐదు దశల ప్రక్రియ. ఇతరుల అవసరాలను సానుభూతితో అర్థం చేసుకోవడం, నిర్వచించడం, కొత్త రూపకల్పనలను సూచించడం, ఆమోదించిన నమూనాను రూపకల్పన చేయడం, ఆ నమూనా పరీక్ష చేయడం. వినియోగదారుల ఆలోచనలకు అనుగుణంగా సమస్యలను అర్థం చేసుకోవడంలో, కొత్త పరిష్కారాలను రూపొందించడంలో ఇది ఎంతో సహాయ పడుతుంది.

పలు వృత్తుల వారికి అవసరమైన ప్రాథమిక అంశాలుగా ఈ మూడు నైపుణ్యాలు రూపొందాయి. కళలు, వాణిజ్యం, సైన్స్, న్యాయవిద్య తదితర రంగాలలో ఇవి ఎంతో ఉపయోగపడతాయి. ఈ నైపుణ్యాలను అండర్ గ్రాడ్యుయేట్ విద్యా ప్రణాళికలో భాగం చేయాలి. దీనికోసం ఒక సమగ్ర విధానం రూపొందించి, దేనిని, ఎలా బోధించాలో పునరాలోచించాలి. సిద్ధాంత పరంగా వివరించే కంటే, ఆచరణాత్మకంగా నైపుణ్యాలను పెంపొందించేలా కంప్యూటేషనల్ థింకింగ్, ఏఐ, డిజైన్ థింకింగ్ కోర్సులను ప్రధాన పాఠ్యాంశాలలో చేర్చాలి.

ఈ మార్పులను అమలు చేయడానికి ముందు పాఠ్యాంశాలను జాగ్రత్తగా తీర్చిదిద్దాలి. తగిన వనరులను సమకూర్చాలి. ఈ ఆధునిక సమ్మిళిత విద్య ద్వారా గ్రాడ్యుయేట్లు తమ అంశాలవారీ జ్ఞానాన్ని వినూత్న నైపుణ్యాలతో అన్వయించగలుగుతారు. విమర్శనాత్మక ఆలోచన చేయగలుగుతారు. సమస్యకు తగ్గ పరిష్కారం కనుగొనడానికి అందుబాటులో ఉన్న కొత్త పద్ధతులను వినియోగించగలుగుతారు.

జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ) 2020 వివిధ రకాల సబ్జెక్టులు నేర్చుకోవడం, లోతుగా ఆలోచించడం, డిజిటల్ అక్షరాస్యతకు ప్రాధాన్యతనిస్తుంది. ఈ ప్రతిపాదించిన పాఠ్యాంశాలు జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా ఉంటాయి. ఇప్పటికే సమతూకంగా ఉన్న పాఠ్య ప్రణాళికలకు మరిన్ని అంశాలను జోడించే బదులు, ఈ అత్యాధునిక కోర్సులు విద్యార్థులను మరింత రాటుదేలేలా, ఉపాధికి పనికొచ్చేలా చేస్తాయి. ఇవి కేవలం సాంకేతిక నైపుణ్యాలు మాత్రమే కాదు, అన్నిరకాల గ్రాడ్యుయేట్లకు అవసరమైన ప్రాథమిక అక్షరాస్యతలు. విశ్వవిద్యాలయాలన్నీ కంప్యుటేషనల్ థింకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజైన్ థింకింగ్‌లను తమ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్‌లో ప్రధాన భాగాలుగా వేగంగా అమలు చేయాలి. భవిష్యత్తు సమాధానాలు గుర్తుంచుకునే వారిది కాదు, సరైన ప్రశ్నలు అడిగి, మెరుగైన పరిష్కారాలను సూచించే వారిది!

◆ ప్రొఫెసర్ ఎన్. శివప్రసాద్
విశ్రాంత ఆచార్యుడు, ఐఐటీ మద్రాసు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలి

తెలంగాణ రాష్ట్రంలో వివిధ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలు, సొసైటీల్లో దాదాపు రెండు లక్షల మందికి పైగా ఔట్ సోర్సింగ్ సిబ్బంది పని చేస్తున్నాం. మమ్మల్ని ఈ ఏడాది రెన్యువల్ చేయకుండా దశలవారీగా విధుల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇది చాలా అన్యాయమైన నిర్ణయం. దాదాపు పది పదిహేనేళ్లుగా చాలీచాలని జీతాలతో వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్నాం. మాలో చాలా మంది వయసు నాలుగు పదులు దాటింది. ఇప్పటికిప్పుడు మమ్మల్ని విధుల నుంచి తప్పిస్తే మా పరిస్థితి, మాపై ఆధారపడిన మా కుటుంబాల పరిస్థితి గురించి ప్రభుత్వం పునరాలోచన చేయాలి. కొన్ని ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు నిరుద్యోగులకు ఆశ చూపి వారి నుంచి లక్షల్లో డబ్బులు దండుకుంటున్నాయి. చాలా ఏజెన్సీలు ఉద్యోగులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించకుండా, గవర్నమెంట్‌కు జీఎస్టీ కట్టకుండా ఇటు ఉద్యోగులను, అటు ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న విషయం ప్రభుత్వం గ్రహించాలి. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి, మాకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు చట్టబద్ధత కల్పించాలి. ఎన్నికల సమయంలో ప్రజా ప్రభుత్వాలకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అండగా నిలిచిన విషయం గుర్తుంచుకోవాలి.

– డి. శ్రీధర్
ఔట్‌సోర్సింగ్ జేఏసీ వైస్ ప్రెసిడెంట్





మన బంగారం మంచిదేనా? 6

- సీజీఎక్స్ 101 యంత్రం లేక ఇబ్బందులు
- నష్టపోతున్న పసిడి కొనుగోలు దారులు

నేడు ప్రపంచ తూనికలు, కొలతల దినోత్సవం



పైకం లేనిదే.. పని కాదంతే..

రవాణాశాఖలో దళారుల కమీషన్ల దందా



- అధికారులను గుప్పిట్లో పెట్టుకుని హవా
- 'కోడ్' భాషతోనే పనులన్నీ పూర్తి
- హనుమకొండ, వరంగల్ కార్యాలయాల్లో ఇదే తంతు
- రెండు కార్యాలయాల్లోనూ రా'రాజు' చక్రం
- కింది స్థాయి నుంచి జిల్లా అధికారి వరకు వాటాలు
- ఉన్నతాధికారులు దృష్టిసారించాలంటున్న ప్రజలు

వరంగల్ క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆ కార్యాలయంలో చేయి తడపందే పని కాదు.. ప్రభుత్వానికి అధికారికంగా పైకం చెల్లించినప్పటికీ అడ్డదారిలో వెళితేనే పని అవుతుంది.. లేదంటే రకరకాల సాకులతో దరఖాస్తు తిరస్కరించి వెనక్కి పంపిస్తారు. దళారులను ప్రోత్సహించి తద్వారా డబ్బులు పోగుచేసుకుంటున్న ఈ అక్రమదందా రవాణాశాఖ కార్యాలయంలో దర్జాగా కొనసాగుతోంది. వాహనదారులు అధికారులను నమ్మివస్తే తిరకాసులో పడ్డట్టే.. దళారీని నమ్ముకొని జేబు తడిపితే పని ఇట్టే పూర్తవుతుంది. నిత్యం ఆర్‌టీఏ కార్యాలయాల్లో జరిగే బహిరంగ దోపిడీని చూసి వాహనదారులు విస్మయానికి గురవుతున్నారు. కౌంటర్ మూసిన తర్వాత సాయంత్రం దళారులు, అధికారులు ఎవరి వాటా వారు పంచుకుంటారనే చర్చ సైతం ప్రచారంలో ఉంది.

దళారులదే హవా

లర్నింగ్, పర్మినెంట్ డ్రైవింగ్ లెసెన్స్‌కు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.2000లోపే ఫీజు ఉండగా వాహనదారుడి నుంచి రూ.5వేల నుంచి 6వేల మధ్య డబ్బులు వసూలుచేసి దళారులు డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పిస్తున్నారు. ఇలా ప్రతీదానికి రెండింతలు, మూడింతలు వసూలు చేసి దళారులు, వారి ద్వారా రవాణాశాఖ అధికారులు అడ్డదారిలో లక్షల్లో డబ్బులు మూటగట్టుకుంటున్నారని ఆర్‌టీఏ కార్యాలయంలో పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. కాదని ఆర్‌టీఏ కార్యాలయంలోని అధికారులను సంప్రదిస్తే వివిధ రకాల సాకులు చెప్పి దళారులను ఆశ్రయించే వాతావరణానికి దారితీస్తారు. చివరికి వాహనదారుడు చేసేదేమీ లేక దళారులను ఆశ్రయించి వారు అన్నంతా చెల్లించి పని పూర్తి చేసుకుంటున్నారు. దళారి ద్వారా వెళ్లేవారికి ఎగ్జామ్ ఉండదు, డ్రైవింగ్ టెస్ట్ ఉండదు.. ఎలాంటి నిబంధనలు ఉండవు.. ఒక వేళ డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించినప్పటికీ దళారుల ద్వారా వస్తే ఎలాంటి నిబంధనలు, హెల్మెట్ అవసరం లేదు. పరీక్షలు నిర్వహించినట్లు షో చేసి మమ అనిపిస్తారనేది బహిరంగ రహస్యమే. వాహనదారుడు కార్యాలయంలో అడుగుపెట్టి కౌంటర్ నెంబర్ నుంచి పని పూర్తయ్యేంత వరకు ఎవరెవరి భాగస్వామ్యం ఉందో వారికి దళారుల నుంచి సాయంత్రం వరకు వాటా పక్కాగా వెళుతుంది. చేతికి మట్టి అంటకుండా కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు డబ్బులు దండుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అధికారులకు అడ్డదారిలో వచ్చే ఆదాయం ఒక్కోరోజు లక్షల్లో ఉంటుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రత్యేక కోడ్‌లతోనే పని పూర్తి

ఏజెంట్లను కార్యాలయంలోకి అనుమతించమని పైకి ఆర్‌టీఏ అధికారులు చెబుతున్నప్పటికీ దళారులు చెప్పిందే జరుగుతుంటుంది. అధికారులకు, దళారులకు మధ్య ఉన్న ప్రత్యేక కోడ్‌తో పని క్షణాల్లో జరిగిపోతుంది. వాహనదారుడు దళారీని కలవగానే దరఖాస్తుపై కోడ్ బాష రాసి ఎక్కడికి పోవాలనేది వరుస క్రమంలో చెబుతాడు. ఆ విధంగా వాహనదారుడు పని కానిచ్చుకొని బయటికి వస్తాడు. కార్యాలయంలో ఏమైనా అవాంతరాలు ఎదురైతై ఫోన్‌లో అధికారి లేదా సిబ్బందికి దళారీ అందుబాటులోకి వచ్చి తమది పూచీగా అన్నట్లుగా భరోసా కల్పించి వాహనదారుడికి చిక్కులు లేకుండా పని పూర్తిచేయిస్తాడు. దాదాపుగా కోడ్ ద్వారా తంతు ముగిసేలా జాగ్రత్తలు

మిగతా 8వ పేజీలో...



ప్రత్యేక పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ దంపతులు



పుష్కరిణికి నవరత్న హారతి ఇస్తున్న కాశీ పండితులు

పుష్కర స్నానం.. పుణ్యఫలం

కాళేశ్వర త్రివేణి సంగమానికి కొనసాగుతున్న భక్తుల రద్దీ

- ఐదో రోజున స్వల్ప తగ్గుదల.. 60వేల మందికిపైగా వచ్చినట్టు అంచనా
- పుష్కరస్నానం ఆచరించిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ దంపతులు
- త్రయంబకేశ్వర్ స్వామీజీ సహా పలువురు వీఐపీల రాక
- ట్రాఫిక్ సమస్యకు చెక్‌పెడుతూ పోలీసుల పకడ్బందీ చర్యలు

7



త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ఉగ్రవాదం అంతమే భారత్ పంతం

- బీజేపీ క్రమశిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్ మార్తినేని ధర్మారావు
- నగరంలో ఘనంగా తిరంగా యాత్ర



తిరంగా యాత్ర నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

వడ్డెపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదం అంతం చేయడమే భారత్ పంతమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ క్రమశిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్ మార్తినేని ధర్మారావు అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా సోమవారం వేయిస్తంభాల అలయం నుంచి చౌరస్తా, పబ్లిక్ గార్డెన్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు రాజకీయాలకతీతంగా తిరంగా యాత్ర నిర్వహించారు. జాతీయ జెండాలను ప్రదర్శించి టెర్రరిజానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ధర్మారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ మేయర్ టి. రాజేశ్వర్‌రావు మాట్లాడారు. టెర్రరిజాన్ని అణచివేయడంలో భారత్ సైనికులు సాహసోపేతంగా పోరాడారన్నారు. భారత పౌరులంతా సైనికులకు వందనం చేయాలని కోరారు. భారతదేశ ఐక్యత, దేశభక్తిని చాటాలన్నారు. సస్యశ్యామల భారతదేశమే పరమావధి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ హనుమకొండ చైర్మన్ పెసరు విజయచందర్‌రెడ్డి, బ్రహ్మకుమారి శ్రీదేవి, కార్పొరేటర్లు దాస్యం అభినవ్ భాస్కర్, గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి, చాడ స్వాతి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ శ్రేణులు డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ సమ్మిరెడ్డి, డాక్టర్ నాగార్జునరెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మాతంగి రమేశ్, స్వదేశీ జాగరణ్ మంచ్ ప్రతినిధి కంది శ్రీనివాస్‌రెడ్డి, అల్లం మల్లికార్జున్‌రావు, మట్టెపల్లి రాంరాజ్, తిరుపతిరెడ్డి, రోకుల సతీష్, నాగపురి అశోక్, బింగి శ్రీనివాస్, రఘుపతి, బండి హరీష్ ముదిరాజ్, మండోటి మహేందర్ పటేల్‌తో పాటు ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- ప్రజల నుంచి 86 వినతుల స్వీకరణ

హనుమకొండ కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే సమస్యలపై సంబంధిత అధికారులు దృష్టిపెట్టి వెంటనే పరిష్కారమయ్యేలా చూడాలని కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతులు అందజేశారు. ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 86 వినతులు వచ్చాయి. ప్రజల నుంయి వినతులు స్వీకరిస్తూనే సంబంధిత అధికారిని కలెక్టర్ పిలిపించి సమస్య ఏంటో పరిశీలించి వెంటనే పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. 86 వినతులలో ఎక్కువగా హనుమకొండ ఆర్డీవో కార్యాలయం, హనుమకొండ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్,



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీనుతోపాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీఈఓపై చర్యలు తీసుకోవాలి

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలకు అనుమతులు ఇస్తున్న డీఈవో వాసంతిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు రాచకొండ రంజిత్‌కుమార్ పీడీఎస్‌యూ కార్యవర్గంతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుకునే విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు లేవని, వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు.

ప్రైవేట్ హాస్పిటళ్లపై చర్యలు తీసుకోవాలి

వైద్యం పేరుతో ప్రజలను దోచుకుంటున్న హనుమకొండలోని ప్రైవేట్ హాస్పిటళ్లపై చర్యలు తీసుకుని పేద ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నోముల కిశోర్, దొగ్గెల తిరుపతిలు కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు.

బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు

వీడియో కాన్ఫరెన్స్‌లో సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి



ఇన్నర్ రింగ్‌రోడ్డు పనులను పరిశీలిస్తున్న కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి వైస్ చైర్‌పర్సన్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో బయోగ్యాస్ ప్లాంట్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి తెలిపారు. సోమవారం హైదరాబాద్ సెక్రెటేరియెట్ నుంచి వివిధ జిల్లాల మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి అధికారులకు పలు సూచనలు చేశారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ ఏర్పాటుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, అందులో విజ్ఞానవంతులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ సందర్భంగా బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఇక్కడి స్థితిగతులను వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో బల్దియా అధికారులు ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ మాధవీలత, సీఎంహెచ్‌వో రాజారెడ్డి పాల్గొన్నారు.

ఇన్నర్ రింగ్‌రోడ్డు పనుల పురోగతిపై పర్యవేక్షణ

వరంగల్ నగరం చుట్టుపక్క ప్రాంతాల్లో జరుగుతున్న ఇన్నర్ రింగ్‌రోడ్డు పనులను సోమవారం కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కుడా వైస్ చైర్‌పర్సన్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పర్యవేక్షించారు. నాయుడు పెట్రోల్‌పంపు, వరంగల్ కోట, చింతల్, నర్సంపేట రోడ్డు, గొర్రెకుంట, ఏనుమాముల ప్రాంతాలలో జరుగుతున్న పనులను పరిశీలించి అక్కడి అధికారులతో మాట్లాడారు. పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించి వేగవంతంగా పనులు పూర్తి చేయాలని అక్కడి కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుడా అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి
- కలెక్టర్ సమక్షంలో రైస్ మిల్లర్లతో సమావేశం

నర్సంపేట టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): రైతులు నష్టపోకుండా ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. సోమవారం నర్సంపేట రైతు వేదికలో ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో కలిసి అధికారులు, రైస్‌మిల్లర్లతో నర్సంపేట నియోజకవర్గంలోని ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్షించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ.. రబీకాలంలో నియోజకవర్గంలోని 6 మండలాల్లో అధిక వరి దిగుబడి వచ్చిందని, ఇప్పటి వరకు 40 శాతం ధాన్యం కొనుగోలు చేశారన్నారు. క్షేత్ర స్థాయిలో మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి అధికారులు ధాన్యం నిలువ వివరాలు సేకరించి దాని ప్రకారం ప్రణాళికబద్ధంగా లారీలను, హమాలీలను ఏర్పాటు చేసుకొని వేగవంతంగా మిల్లులకు తరలించాలన్నారు. రైస్‌మిల్లర్లకు సామర్థ్యాన్ని బట్టి వెంటనే కేటాయింపులు చేయాలని అధికారులను ఆదేశించారు. కొంతమంది మిలర్లు కావాలని తరుగు పేరుతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారని, ఇది మంచి పద్ధతికాదని హెచ్చరించారు. ట్రక్ షీట్ ప్రకారమే తీసుకోవాలని, కోతలు విధిస్తే ఉపేక్షించేది లేదన్నారు. 1638 రకం ధాన్యం గ్రేడ్-ఎ కింద పరిగణించి వాటిని తిరస్కరించకుండా తీసుకోవాలని అన్నారు. ఎక్కువ నూకలు వస్తున్నాయని బాయిల్డ్ రైస్ కింద తీసుకునేందుకు అనుమతించాలని మిల్లర్లు ఎమ్మెల్యేకు తెలుపగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.



అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి, చిత్రంలో కలెక్టర్ సత్యశారద

కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. నర్సంపేట నియోజకవర్గంలో 1.07 మెట్రిక్ టన్నుల అంచనా ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 31.54 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామన్నారు. ఇంకా 70వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓపీఎంఎస్ నమోదు వెంటనే చేయాలని, తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువలను వెంటనే ఖాళీచేసే ప్రయత్నం చేయాలన్నారు. తగినంత టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేష్, ఆర్డీవో ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ జిల్లా జట్టును అభినందిస్తున్న అజీజ్‌ఖాన్

నెట్‌బాల్ పోటీల్లో వరంగల్ జట్టు సత్తా

రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచి కాంస్యం కైవసం

వరంగల్ స్పోర్ట్స్, మే 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-16 మిక్స్‌డ్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో వరంగల్ జిల్లా జట్టు తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ఈ మేరకు సోమవారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని నెట్‌బాల్ కోర్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ పాల్గొని వరంగల్ జిల్లా జట్టు సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన నెట్‌బాల్ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 33జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా, ఇందులో వరంగల్ జిల్లా జట్టు తృతీయ స్థానంలో రాణించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో అశోక్‌కుమార్, నెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల సృజన్‌కాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లిల్లీ ఫోరెన్స్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్‌లో మంగమ్మకు డాక్టరేట్



వరంగల్ ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మ్యాథ్స్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఇప్ప మంగమ్మకు హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ ఎం.ముత్తారెడ్డి సోమవారం మ్యాథ్స్‌లో పీహెచ్‌డీ పట్టాను అందజేశారు. ప్రొఫెసర్ వై.ధర్మేందర్‌రెడ్డి పర్యవేక్షణలో 'న్యూమరికల్ సొల్యూషన్స్ ఆఫ్ ఎంహెచ్‌డీ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ నానో ఫ్లూయిడ్ ఫ్లో ప్రాబ్లమ్ ఓవర్ ఏ ష్రింకింగ్ స్ట్రెచింగ్ సర్ఫేస్' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి ఆమెకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేసింది.

దీప్తికి గీతం యూనివర్సిటీ డాక్టరేట్



వరంగల్‌కు చెందిన ఆర్.దీప్తికి విశాఖపట్టణంలోని గీతం యూనివర్సిటీ ఫార్మసీలో పీహెచ్‌డీ డిగ్రీని సోమవారం ప్రకటించింది. ప్రొఫెసర్ జి.సుహాసిన్ పర్యవేక్షణలో 'అడెనిన్ ఇన్‌డ్యూస్డ్ క్రానిక్ కిడ్నీ డామేజ్ అండ్ కార్డియోవాస్క్యూలర్ ఆల్టరేషన్స్ టార్గెటింగ్ టీజీఎఫ్ బీటా-1 అండ్ కాస్పేస్-3' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి ఆమెకు డాక్టరేట్‌ను ప్రకటించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రకటించారు. కాగా దీప్తి ప్రస్తుతం ఓగ్లాపూర్ కేర్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

కమిషనరేట్‌లో పలువురు ఏసీపీల బదిలీ

వరంగల్ క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ డివిజన్‌లలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఏసీపీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డిని హైదరాబాద్ డీజీ కార్యాలయానికి బదిలీ చేశారు, ఆయన స్థానంలో రాచకొండ షీ టీం ఏసీపీగా పనిచేస్తున్న పి.నర్సింహరావును నియమించారు. మామునూరు ఏసీపీ బి.తిరుపతిని డీజీ కార్యాలయానికి ట్రాన్స్‌ఫర్ చేయగా, ఆయన స్థానంలో ఖమ్మం ఎస్‌బీఐ అండ్ సెక్యూరిటీ ఏసీపీ ఎన్.వెంకటేష్‌ను నియమించారు. సీఐడీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న పి.సదయ్యను వరంగల్ సీసీఎస్ ఏసీపీగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, రెండు రోజుల కిందటే క్రైం ఏసీపీగా వి.కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించడం గమనార్హం.

మన బంగారం మంచిదేనా?

- తూనికలు, కొలతల శాఖాధికారులకు తనిఖీ అధికారం
- సీజీఎక్స్ 101 యంత్రం లేక ఇబ్బందులు
- నష్టపోతున్న పసిడి కొనుగోలు దారులు
- నగరంలో నాలుగు హాల్‌మార్కింగ్ సెంటర్ల మూత
- నేడు ప్రపంచ తూనికలు, కొలతల దినోత్సవం



బంగారం స్వచ్ఛతను కొలిచే సీజీఎక్స్ 101 యంత్రం

హనుమకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో అమ్మకమయ్యే వివిధ వస్తువుల బరువు, ధరల విషయంలో వ్యాపారులు మోసాలకు పాల్పడకుండా తనిఖీలు చేసే తూనికలు, కొలతల అధికారులకు బంగారం స్వచ్ఛతను తనఖీ చేసే అధికారం కూడా ఉంది. కానీ వీరు దీనిని వినియోగించుకోలేకపోతున్నారు. ఇందుకు కారణం బంగారం, వెండి స్వచ్ఛతను నిర్ధారించే సీజీఎక్స్ 101 పరికరం అందుబాటులో లేకపోవడమే. ఈ యంత్రం లేకపోవడం వల్ల అధికారులు బంగారం, వెండి దుకాణాల జోలికి వెళ్లడంలేదు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. నేడు ప్రపంచ తూనికలు, కొలతల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో బంగారం, వెండి నగల స్వచ్ఛతలో జరుగుతున్న మోసాలు, అధికారం ఉండి ఏమీ చేయలేని తూనికల కొలతల అధికారులపై ప్రత్యేక కథనం.

సీజీఎక్స్ 101 యంత్రం ఏర్పాటు ఎప్పుడు?

బంగారం స్వచ్ఛత, బరువును పరీక్షించే అధికారం తూనికలు కొలతల శాఖకు కూడా ఉన్నది. బహిరంగ మార్కెట్‌లో ఎలక్ట్రానిక్ కాంటాలు, నిత్యావసర వస్తువుల బరువు, రేట్లు తదితర వాటిని తనఖీచేసే తూనికలు కొలతల శాఖ అధికారులకు 2011 రూల్ 9 (4) ప్రకారం బంగారం, వెండి ఆభరణాల నాణ్యతను పరీక్షించే అధికారం కూడా ఉన్నది. వారు కూడా ఎప్పటికప్పుడు వెండి, బంగారం నగల దుకాణాలతో ఆకస్మిక తనిఖీలు జరిపి అక్కడ విక్రయిస్తున్న బంగారం స్వచ్ఛత, బరువును పరీక్షించి లోపాలు ఉన్నట్లయితే కేసులు నమోదు చేయవచ్చు. కానీ అధికారులు వాటికి జోలికి వెళ్లడం లేదు. ఇందుకు కారణం బంగారం, వెండి స్వచ్ఛతను కొలిచే పరికరం లేకపోవడమే.

ప్రతీ జిల్లాలో ఏర్పాటు చేయాలి

వాస్తవంగా ప్రతీ జిల్లాలో తూనికలు కొలతల శాఖ ఆధ్వర్యంలో ఇలాంటియంత్రాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ యంత్రం పేరు ఎక్స్ రే ఫ్లోరోసెన్సెస్ స్పెక్ట్రో మీటర్ కాంటెక్ సీజీఎక్స్ 101. ఈ యంత్రం సహాయంతో కేవలం 30 సెకన్లలో బంగారం స్వచ్ఛతను తెలుసుకోవచ్చు. బంగారం ఆభరణాన్ని యంత్రంపై ఉంచితే చాలు. యంత్రంలోని ఎక్స్‌రే కిరణాలు ఆభరణంలోకి దూసుకువెళ్లి తిరిగి రిఫ్లెక్స్ అవుతాయి. యంత్రానికి అనుసంధానం చేసిన సాఫ్ట్‌వేర్ ఆధారంగా క్షణాల్లో ఆ ఆభరణం ఎన్ని క్యారెట్లు ఉంది? అందులో కలిసిన కాపర్, జింకు, సిల్వర్, నికెల్ తదితర లోహాల శాతాన్ని చెప్పేస్తుంది. ఈ యంత్రంతో బంగారంలో నాణ్యత, స్వచ్ఛతను సులువుగా తెలుసుకోవడంతో పాటు మోసం జరిగితే సదరు వ్యాపారిపై కొనుగోలుదారులు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఈ యంత్రం ఖరీదు సుమారు రూ.15లక్షల నుంచి రూ.20లక్షల వరకు ఉంటుంది. ఈ యంత్రం లేకపోవడంవల్ల తమకు అధికారం ఉన్నప్పటికీ తూనికలు, కొలతల శాఖ అధికారులు బంగారుం, వెండి దుకాణాల్లో తనఖీలు చేయలేకపోతున్నారు. ఖరీదైనదవి అయినందువల్ల బంగారం, వెండి వస్తువుల శాంపిళ్లను సేకరించడం కష్టం. ఒక వేళ సేకరించినా వాటిని పరీక్ష కోసం హైదరాబాద్‌లోని తూనికలు కొలతల ప్రధాన కార్యాలయానికి పంపి రిపోర్టులు వచ్చే వరకు ఎదురుచూడాలి. ఈ తతంగం అంతా కష్టంతో కూడుకున్నది కావడంతో అధికారులు వాటి జోలికి వెళ్లడం లేదు. బీఐఎస్ అధికారులే ప్రస్తుతం ఈ బాధ్యతను నిర్వహిస్తున్నారు.

హాల్‌మార్క్ సెంటర్ల మూత

నగరంలో 5 హాల్‌మార్క్ సెంటర్లు ఉండగా వీటిలో నాలిగింటిని బ్యూరో ఆఫ్ ఇండియాన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధికారులు మూసివేశారు. వాటి లైసెన్సులను రద్దు చేశారు. ఈ నాలిగింటిలో మూడు వరంగల్ విశ్వకర్మ వీధిలోనివి కాగా, ఒకటి హనుమకొండ టైలర్ స్ట్రీట్‌లోది. బంగారం షాపుల్లో కొన్న నగలు నిర్ధేశిత ప్రమాణాల మేరకు స్వచ్ఛతతో ఉన్నాయా? లేవా అనేది నిర్ధారించడానికి కొనుగోలుదారులు తాము కొన్న నగలను ఈ హాల్ మార్కింగ్ సెంటర్లకు వెళ్లి పరీక్షలు చేయించుకోవచ్చు. ఇటీవల బీఐఎస్ అధికారులు హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో బంగారం శాంపిల్స్‌ను సేకరించిన క్రమంలో చాలా వరకు అవి నిర్ధారిత ప్రమాణాల మేరకు స్వచ్ఛత లేదన్న విషయం బయటపడింది. దీనితో నాలుగు హాల్ మార్క్ సెంటర్ల లైసెన్సులను రద్దు చేసింది. వాటిని మూసివేయించింది.

బంగారం, వెండిలో మోసాలు

సాంబరాజు చక్రపాణి, జాతీయ ప్రధాన కార్యదర్శి, వినియోగదారులదారుల మండలి



బంగారం, వెండి స్వచ్ఛతను తనఖీ చేసేందుకు తూనికలు, కొలతల అధికారులు వారికున్న అధికారాన్ని వినియోగించుకునేందుకు వీలుగా బంగారం స్వచ్ఛతను కొలిచే యంత్రాలను వెంటనే అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలి. ఇందు వల్ల బంగారం, వెండి నాణ్యత విషయంలో కొనుగోలుదారులు మోసపోకుండా ఉంటుంది. నగల వ్యాపారుల మోసాలను అరికట్టేందుకు వినియోగదారుల మండలి ఇప్పటికే హనుమకొండలోని మూడు కార్పొరేట్ బంగారు ఆభరణాల షోరూంలపై వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది.

రైలు ఢీకొని యువకుడి మృతి



మహేశ్(ఫైల్)

నెక్కొండ, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్లవాడ గ్రామానికి చెందిన కర్నెకంటి మహేశ్ (19) రైలు ఢీ కొనడంతో మృతి చెందినట్లు రైల్వే పోలీసులు సోమవారం తెలిపారు. రెడ్లవాడ గ్రామానికి చెందిన అయిలయ్య, పద్మ దంపతుల కుమారుడు మహేశ్ తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్‌లో హౌస్ కీపింగ్ పనులు చేసుకుంటున్నాడు. మహేశ్ తాతయ్య యాదగిరి అనారోగ్యంతో ఈనెల 17న మృతి చెందగా 18న జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్న అనంతరం హైదరాబాద్ వెళుతున్నట్లు తల్లిదండ్రులకు చెప్పి నెక్కొండ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రైల్వే స్టేషన్ సమీపంలో అప్‌లైన్‌పై వెళుతున్న గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురైన మహేశ్ మృతి చెందినాడు, శవ పంచనామా జరిపి శవాన్ని తండ్రి అయిలయ్యకు అప్పగించారు. మృతుడు అవివాహితుడు.



మీడియాతో మాట్లాడుతున్న శ్రీరామమూర్తి

ఎయిర్‌పోర్ట్ తరహాలో వరంగల్ రైల్వేస్టేషన్

ప్రారంభానికి సిద్ధం చేశాం

అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ శ్రీరామమూర్తి

గిర్మాజీపేట, మే19 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకం కింద వరంగల్ రైల్వేస్టేషన్‌ను రూ.25.41కోట్లతో ఎయిర్‌పోర్ట్ తరహాలో తీర్చిదిద్దామని, ఈనెల 22న ప్రధానమంత్రి నరేంద్రమోదీ దీన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తారని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశామని సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఐ.శ్రీరామమూర్తి తెలిపారు. సోమవారం ఆయన వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆసియాలో అతి పెద్ద ప్రజారవాణా వ్యవస్థగా సేవలందిస్తున్న భారతీయ రైల్వేశాఖను కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని, రైళ్లు, రైల్వేస్టేషన్‌ల, రైలు మార్గాల అభివృద్ధి, విస్తరణ చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్‌ను కాకతీయ కళావైభవంతో రూపొందించామన్నారు. ఐదేళ్లలో వరంగల్ రైల్వేస్టేషన్‌ను రూ.45కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. త్వరలో భద్రతా స్కానింగ్ యంత్రాలు, అధునాతన సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో స్టేషన్ మేనేజర్ జె.సారయ్య, ఐఎడబ్లు శ్రీనివాస్, ఆర్‌పీఎఫ్ సీఐ పి.శ్రీనివాస్‌గౌడ్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ బి.రాజ్‌గోపాల్, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్లు విజయ్ కుమార్, రాజేంద్రప్రసాద్, ఆరోగ్య అధికారి మధు తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కేయూ క్యాంపస్ మే 19, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మే 20 నుంచి నిర్వహించే ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర పీజీ కోర్సుల అఖరు సెమిస్టర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో 4,300 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. వర్సిటీ పరిధిలో విద్యార్థులకు 26 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షలు 20, 22, 24, 27, 29, 31వ తేదీల్లో నిర్వహిస్తామని వెల్లడించారు.

వరంగల్‌లో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు సీఎం హామీ

● ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ● సందడిగా అండర్-25 బాలురు క్రికెట్ లీగ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బస్వరాజు సారయ్య

వరంగల్ స్పోర్ట్స్, మే 19(ఆంధ్రజ్యోతి) : రంజీ, ఐపీఎల్ స్థాయి క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించే విధంగా నగరంలో అధునాతన క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తెలిపారు. సోమవారం వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్డిపురంలోని క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా అండర్-25 బాలుర క్రికెట్ లీగ్ పోటీలను ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా క్రికెట్ క్రీడాకారుల చిరకాల వాంఛ అయిన క్రికెట్ స్టేడియం ఏర్పాటు కోసం ఇటీవల ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డిలను కలిశానన్నారు. దీంతో వరంగల్‌లో స్టేడియం గురించి వేం నరేందర్‌రెడ్డి సీఎం వద్ద ప్రస్తావించగా త్వరలోనే స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని మాట ఇచ్చారన్నారు. హైదరాబాద్ నగరం తరువాత పెద్ద నగరంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్‌లో క్రికెట్ స్టేడియం తప్పకుండా ఉండాలని, స్టేడియం ఏర్పాటుకు తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు.

వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంతర్ జిల్లా స్థాయి అండర్-25 బాలుర క్రికెట్ లీగ్ పోటీలు జూన్ 2వ తేదీ వరకు రెడ్డిపురం, మొగిచర్ల, వంగపల్లి క్రికెట్ మైదానాల్లో లీగ్ పద్ధతిన నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు జట్ల అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను గుర్తించి జూన్ 2వ తేదీ నుంచి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న టూ-డే క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కాగా, తొలిరోజు రెడ్డిపురం క్రికెట్ మైదానంలో హనుమకొండ - భూపాలపల్లి జట్ల మధ్య, మొగిలిచర్ల మైదానంలో జనగామ - ములుగు జట్ల మధ్య, వంగపల్లి మైదానంలో వరంగల్ - మహబూబాబాద్ జట్ల మధ్య పోటీలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్, సభ్యులు సదాశివ్, తోట రాము, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

తలంచి.. తరించి..

సముద్రాలలో ఘనంగా మహాకాళి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ● పాల్గొన్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి



మహంకాళి అమ్మవారి వద్ద జరిగిన హోమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే


స్టేషన్‌ఘన్‌పూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాలలో నూతన ఆలయంలో మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం సోమవారం కన్నులపండువగా జరిగింది. యాదాద్రి దేవాలయ విశ్రాంత ప్రధాన అర్చకుడు కారంపూడి నరసించార్యులు, బొర్రా హరికిషన్ శర్మల అర్చకుల బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహంకాళి జయజయధ్వానాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అర్చకులు మహంకాళి, పోచమ్మ అమ్మవారి ఆలయాల్లో ధ్వజస్తంభంల వద్ద ఏక కాలంలో యంత్రప్రతిష్ఠను నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో గ్రామంలో, ఆలయం వద్ద పండుగ వాతావరణం నెలకొంది.

పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ

వేడుకలకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యలు హాజరయ్యారు. ధర్మకర్త కుందూరు నాగమణి - సోమిరెడ్డిల ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. వారు ప్రత్యేక పూజలు చేసి, హోమం. శివ-పార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ఆలయ ధర్మకర్త నాగమణి-సోమిరెడ్డి దంపతులు లక్షలాది రూపాయలు వెచ్చించి రాతితో ఆలయంను నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన విద్యుత్ అందించడానికి, నారాయణపురంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఛైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్‌రెడ్డి, నాయకులు సీహెచ్ నరేందర్ రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర్ రెడ్డి, అంబటి కిషన్‌రాజ్, గన్ను నర్సింహులు, ఎస్. శ్రీరాములు, బొస్కుల కిరణ్, తాటికొండ కుమారస్వామి, వీరగోని రాజు, గుండె నర్సయ్య, బత్తుల బాలరాజు, ఇమ్మడి హరిప్రసాద్, దైద ఎలిషన్, పల్లె రవీందర్, మందపురం అనిల్, ఎన్. అజయ్ రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

ఉత్సవాలకు సైలానీబాబా ముస్తాబు

- రేపటి నుంచి ప్రారంభం కానున్న గంధం ఉర్సు
- మూడు రోజుల పాటు వేడుకలు
- ఒగ్లాపూర్‌లోని దర్గా ఆవరణలో ఏర్పాట్లు పూర్తి



ఉత్సవాలకు ముస్తాబైన సైలానీబాబా దర్గా

దామెర, మే 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఒగ్లాపూర్‌లోని సైలానీ బాబా దర్గా ప్రాంగణంలో 118వ హజ్రత్ సందల్ గంధం ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 21(బుధవారం) నుంచి మూడు రోజుల పాటు సందల్ గంధం ఉర్సు ఉత్సవాలు జరుగనున్నాయి. దర్గా ప్రాంగణమంతా విద్యుత్ లైట్లతో ముస్తాబు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ఉత్సవాలకు వచ్చే భక్తులకు తాగు నీరు, వైద్యం, భోజనం, వసతి వంటి వివిధ సదుపాయాలను నిర్వాహకులు సిద్ధం చేశారు. అలాగే పలు ప్రాంతాల నుంచి పీఠాధిపతులు, ప్రముఖులతో పాటు లక్షలాదిగా భక్తులు హాజరు కానున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా మహారాష్ట్ర నుంచి ప్రముఖ బ్యాండ్ వాయిద్యం కళాకారులతో నగారా (వాయిద్యం) ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బెంగళూరు, ఢిల్లీ, ముంబయి, చెన్నై, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు గంధం వేడుకలకు హాజరవుతారు. హనుమకొండ, కరీంనగర్, హైదరాబాద్, ములుగు, భూపాలపల్లి, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి రానున్న భక్తులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఉర్సు గంధం ఉత్సవాలు

సైలానీ బాబా దర్గా ఆవరణలో ఈ నెల 21న ఒంటె మీద ఊరేగింపుగా గంధం తీసుకురావడంతో ఉర్సు జాతర ప్రారంభమవుతుంది. తర్వాత దర్గా పీఠాధిపతి అబ్దుల్ హమీద్ షామియా (సైలానీబాబా) సమక్షంలో ఛాదర్లు సమర్పిస్తారు. 22న రాత్రి 9 గంటలకు ప్రముఖుల ఆధ్వర్యంలో కవ్వాలీ కార్యక్రమం నిర్వహిస్తారు. 23న పీఠాధిపతి సైలానీ బాబా ఆధ్వర్యంలో తహలీల్ ఫాతెహ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.

గంధం ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం..

పీఠాధిపతి అబ్దుల్ హమీద్ షామియా



గంధం ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు హాజరు కానున్నారు. భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. వైద్య, రెవెన్యూ, విద్యుత్, రవాణా తదితర శాఖల సహకారంతో జాతర విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. అలాగే వాహనాల పార్కింగ్ కోసం దర్గా సమీపంలోని మూడు ప్రాంతాల్లో స్థలాలను కేటాయించాం. జాతరకు వచ్చే భక్తులకు మూడు రోజుల పాటు అన్నదానం చేయనున్నాం.



త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పుష్కర స్నానం.. పుణ్యఫలం..

కాళేశ్వర త్రివేణి సంగమానికి కొనసాగుతున్న భక్తుల రద్దీ



సంవిదానంద సరస్వతికి సరస్వతీ మాత విగ్రహాన్ని బహూకరిస్తున్న ఆలయాధికారులు

- ఐదో రోజున 60వేల మందికిపైగా వచ్చినట్టు అంచనా
- పుష్కరస్నానమాచరించిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ దంపతులు
- త్రయంబకేశ్వర్ స్వామిజీ సహా పలువురు వీఐపీల రాక
- ట్రాఫిక్ సమస్యకు చెక్‌పెడుతూ పోలీసుల చర్యలు

కాళేశ్వరం, మే 19 (ఆంధ్రజ్యోతి): పుష్కరస్నానం ఆచరిస్తే.. పుణ్యఫలం దక్కుతుందంటూ వేలాదిమంది భక్తులు.. సరస్వతీ నమోనమామి అంటూ పుష్కరాలకు తరలొస్తున్నారు. కాళేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమంలో అంతర్వాహిని చెంత పలు రాష్ట్రాలకు చెందిన వేలాది భక్తులు పుణ్యస్నానాలాచరించి.. ముక్తీశ్వరుడిని దర్శించుకుని పునీతులవుతున్నారు. ఉదయం వచ్చి రాత్రి జరిగే సరస్వతీ నదీ హారతిచ్చే వరకు ఉండి ఆ మహాఘట్టాన్ని చూసి భక్తులు పరవశించిపోతున్నారు. ఐదో రోజైన సోమవారం కాస్త భక్తుల రద్దీ తగ్గినప్పటికీ మొత్తం 60వేల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వీవీఐపీల తాకిడి పెరిగింది. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ దంపతులు, నాసిక్ త్రయంబకేశ్వర్ పీఠాధిపతి శ్రీమహా మండలేశ్వర స్వామిజీ, హైకోర్టు జడ్జి నందిగొండ నర్సింగారావుదంపతులు, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రనాయక్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మల్లారెడ్డి, తదితరులు హాజరై పుణ్యస్నానాలు ఆచరించి ముక్తీశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి అర్చకులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు.

ఐదో రోజు 60వేల మంది భక్తులు..

పుష్కరాలు ప్రారంభమై సోమవారానికి ఐదోరోజు కాగా.. సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు అధికంగా వస్తారని అధికారులు అంచనా వేశారు. కానీ అనుకున్న స్థాయిలో భక్తులు రాలేదు. తొలి నాలుగు రోజులతో పోలిస్తే రద్దీ తక్కువగా కనిపించింది. ఈ క్రమంలో నాలుగు రోజుల్లో తలెత్తిన సమస్యలు, ఇబ్బందులపై సమీక్షించుకున్న అధికార యంత్రాంగం ఇకపై అలా జరగకుండా చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీ పెరుగుతుందన్న అంచనాలతో అధికారులు చలువపందిళ్లను మరికొన్నింటిని పెంచారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ..

శని, ఆదివారాల్లో తలెత్తిన ట్రాఫిక్ సమస్య పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. వారాంతమైన శని, ఆదివారాల్లో భక్తులు అధికంగా ఉండడం వల్లనో, ట్రాఫిక్ సమస్య తలెత్తడం మూలంగానో సోమవారం భక్తుల సంఖ్యపై ప్రభావం చూపిందని అధికారులు భావిస్తున్నారు. అయితే ఆదివారం ఉత్పన్నమైన సమస్యలను దృష్టిలోపెట్టుకుని జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలను వేర్వేరు మార్గాల్లో నడిపించేందుకు కార్యాచరణ తయారుచేసింది. ఇందులో ఆర్టీసీ బస్సులను నేరుగా కాళేశ్వర క్షేత్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించగా ప్రైవేటు వాహనాలను అన్నారం క్రాస్ నుంచి చంద్రుపల్లి, పుస్కుపల్లి మార్గం మీదుగా మళ్లించాలని, లేదా, కాటారం, గంగార ం క్రాస్, దామెరకుంట మీదుగా కాళేశ్వరం వరకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. అయితే సోమవారం పెద్దగా జనం రాకపోవడంతో ప్రధానరహదారి గుండానే వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.



ముక్తీశ్వరాలయంలో పూజలు చేస్తున్న బండి సంజయ్ దంపతులు



మహదేవుడి దర్శనం కోసం ముక్తీశ్వరాలయానికి వస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



పుష్కర స్నానమాచరిస్తున్న హైకోర్టు జడ్జి నర్సింగరావు, కుటుంబసభ్యులు





పుష్కరాల్లో.. పుష్కల ఆదాయం..

ముక్తీశ్వరాలయానికి ఐదురోజుల్లో రూ.57.04లక్షలు రాక

కాళేశ్వరం, మే 19 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరంలోని శ్రీ ముక్తీశ్వరాలయానికి ఆదాయం పుష్కలంగా వచ్చింది. పుష్కరస్నానాలు చేసిన అనంతరం భక్తులు అధిక సంఖ్యంలో ముక్తీశ్వరుడిని దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రత్యేక దర్శనాల టికెట్లు, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా ఐదు రోజుల్లో దేవస్థానానికి రూ.57.04లక్షలు ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. పుష్కరాలు జరగడం ఇది తొలిసారే అయినా ఐదు రోజుల్లో ఆదాయం రూ.50లక్షలు దాటడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తొలిరోజు పలుచగా వచ్చినా రూ.4.26లక్షలు వచ్చాయి. అలాగే రెండో రోజు 12.73లక్షలు, మూడో రోజు 11.97లక్షలు, నాలుగోరోజు 12.84లక్షలు, ఐదో రోజు రూ.15.22లక్షలు ఆదాయం వచ్చిందని వివరించారు. లడ్డూ పులిహోర తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నామని, భక్తులు సంతృప్తిగా కొనుగోలు చేస్తున్నారని, మిగిలిన వారం రోజుల్లో కోటికి పైగానే ఆదాయం సమకూరే అవకాశం ఉంటుందని తెలిపారు.

అంతర్వాహినీ.. పాహిమాం
సరస్వతీ పుష్కరాలు

వైభవంగా నవరత్న హారతి

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి): కాళేశ్వర త్రివేణి సంగమంలో సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి 7.20గంటల నుంచి 8గంటల వరకు ఏడుగురు కాశీ పండితులు నవరత్న హరతిని వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక సంగీత నేపథ్యంతో ఓంకార, నాగ, పంచ, సూర్య, చంద్ర, నంది, సింహ, కుంభ, నక్షత్ర హరతులతో కూడిన నవరత్న హరతిని పండితులు కన్నుల పండువుగా త్రివేణి సంగమం అంతర్వాహిని సరస్వతి మాతకు నిర్వహించారు. సుమారు గంటపాటు నిర్వహించిన నవరత్న హరతి కార్యక్రమంలో ఐజీ తరుణ్‌జోషి, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, కాళేశ్వర-ముక్తీశ్వర ఆలయ అధికారులు పాల్గొన్నారు.



నదీహారతి వేడుకను ఫోన్లలో బంధిస్తున్న భక్తులు

వీడియో కాల్స్‌తో హారతి దర్శనం..

పుష్కరాల్లో భాగంగా నిత్యం సాయంత్రం సాయంలో కాశీ పండితులతో వైభవంగా నిర్వహిస్తున్న నవరత్న హారతిని వందలాది మంది భక్తులు తమ ఫోన్లలో ఫోటోలు, వీడియోలు తీసుకుంటున్నారు. కొందరు భక్తులు వివిధ రాష్ట్రాలు, విదేశాల్లో ఉన్న తమ కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులకు వీడియో కాల్ చేసి చూపుతున్నారు. అయితే సిగ్నళ్ల సమస్య తలెత్తుతుండటంతో చాలామంది వీడియోలు తీసుకుంటున్నారు.



పార్కింగ్‌లో ఉన్న వందలాది వాహనాలు

ఐదో రోజూ ఆలయంలో ప్రత్యేక హోమాలు

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకుని ఐదోరోజు కాళేశ్వర ముక్తీశ్వరాలయంలో పలు హోమాలను నిర్వహించారు. సోమవారం సప్తమి కావడంతో ఉన్నత చదువులు, విదేశీ చదువుల కోసం మేధా దక్షిణామూర్తి హోమము, అపమృత్యు దోషాలు తొలగడానికి మహా అమృత మృత్యుంజయ హోమం నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. మంగళవారం మన్యుసూక్త, కాలభైరవ హోమాలు నిర్వహించనునట్లు అధికారులు తెలిపారు.





అర్ఘ్యం వదులుతున్న డోర్నకల్ ఎమ్మెల్యే, విప్ రాంచంద్రునాయక్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



ముక్తీశ్వరుడి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



హైదరాబాద్ కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

ఆలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి): పుష్కరాల్లో భాగంగా కాళేశ్వరం త్రివేణి సంగమ తీరంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరిస్తున్నాయి. సోమవారం హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి నృత్య కళాకారులు తమ ప్రదర్శనలతో అదరగొట్టగా.. అనంతరం నిర్వహించిన సంగీత విభావరి భక్తులను ఆకట్టుకుంది. నిత్యం కళాకారులు నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి.

అనుబంధ ఆలయాల్లో భక్తుల రద్దీ

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి) : సరస్వతి నదిలో పుష్కర స్నానం అనంతరం భక్తులు కాళేశ్వర, ముక్తేశ్వర స్వామి దర్శించుకొని అనుబంధ దేవాలయాల్లోని స్వామివార్లను దర్శించుకోవడంతో ఆలయాల్లో రద్దీ కొనసాగుతుంది. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు శుభానంద దేవి, ప్రౌఢ సరస్వతి, రామాలయం, ఆది ముక్తేశ్వర స్వామి దర్శించుకుంటున్నారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు లడ్డు, ప్రసాదాలు తీసుకుంటున్నారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిట లాడుతున్నాయి.

భక్తుల సేవలో పోలీసులు.. భద్రత విధుల్లో బలగాలు



దేవాలయంలో భక్తులకు వాటర్ బాటిల్స్ అందిస్తున్న పోలీసు అధికారి



కుదుర్పల్లె వద్ద అడవిలో ఏరియా డామినేషన్ చేస్తున్న బలగాలు

సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టింది. ఓ వైపు వేలాదిగా తరలొస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు సేవల్లో నిమగ్నమైతే.. మరోవైపు వీఐపీల రాక నేపథ్యంలో వారి భద్రత దృష్ట్యా ప్రత్యేక బలగాలు పహారా కాస్తున్నాయి. పోలీసులు ఎర్రటి ఎండలో ట్రాఫిక్ నియంత్రణ కోసం కాళేశ్వరం వచ్చి పోయే రోడ్లలో విధులు నిర్వహిస్తున్నారు. మరికొందరు పుష్కరఘాట్‌లు, ముక్తీశ్వరాలయంలోని క్యూ లైన్ల వద్ద బందోబస్తులో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో కొందరు క్యూలైన్లలో ఉంటున్న భక్తుల దాహార్తి తీర్చేందుకు వాటర్ బాటిళ్లు అందజేస్తున్నారు. ఇక కర్రెగుట్టల్లో మావోయిస్టుల కదలికలు, ఎన్‌కౌంటర్ అలజడి నేపథ్యంలో పుష్కరాలకు వచ్చే వీఐపీల భద్రతను దృష్ట్యా ప్రత్యేక బలగాలు ఎర్రటి ఎండలో అడవిబాటలో నడస్తూ ఏరియా డామినేషన్ నిర్వహిస్తున్నాయి.

- ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

అందుబాటులో 'ఆయుష్' సేవలు



వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో జరగుతున్న సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం ప్రాచీన వైద్య పద్ధతులైన ఆయుర్వేదం, యునాని, హోమియోపతిలకు సంబంధించిన చికిత్సలు, మందులు అందుబాటులో ఉంచారు. కాళేశ్వరం పీహెచ్‌సీ ఆవరణలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. హనుమకొండ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ భానుకుమార్ నేతృత్వంలో జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ తనూజారాణి ఆధ్వర్యంలో పలువురు వైద్యులు, ఫార్మసిస్టులు, ఎంఎన్‌వోలు భక్తులకు ఈ వైద్య సేవలందిస్తున్నారు. పుష్కరాలు ప్రారంభమైన ఐదురోజుల్లో సుమారు 2,500మందికిపైగా జనరల్, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు చికిత్సలు అందించి మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు.

నీట మునిగిన ఇద్దరిని కాపాడిన బలగాలు



త్రివేణి సంగమంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి): పుష్కర స్నానం చేయడానికి వచ్చే భక్తులను నీటి ప్రమాదాల నుంచి కాపాడేందుకు నదీ తీ రంలో, పుష్కర ఘాట్లలో ప్రభుత్వం ఎన్డీ ఆర్ఎఫ్ బలగాలను మోహరించింది. ము లుగు జిల్లా చల్వాయి 5వ బెటాలియన్‌కు చెందిన 66మంది స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్‌ఎఫ్)కు చెందిన 22మంది సిబ్బంది పలు బృందాలుగా, షిఫ్టులవారీగా సరస్వతి పుష్కర ఘాట్‌తో పాటు ఇతర ఘాట్ల వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు రోజులుగా పుష్కర స్నానం చేస్తూ ఇద్దరు బాలురు నీటిలో మునిగిపోతుండగా.. వారిని రక్షించి తల్లిదండ్రులకు అప్పగించినట్టు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది తెలిపారు.

'జాతీయ సదస్సు' పుస్తకాల ఆవిష్కరణ

కేయూ క్యాంపస్ మే 19, (ఆంధ్రజ్యోతి): మార్చి 21, 22వతేదీల్లో కేయూ రాజనీతిశాస్త్ర విభాగం నేతృత్వంలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు పరిశోధన పత్రాల పుస్తకాలను సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ జి.బాలకృష్ణారెడ్డి, కేయూ రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్‌ల నేతృత్వంలో ఆవిష్కరించారు. బాలక్రిష్ణారెడ్డిని హైదరాబాద్‌లోని తన చాంబర్‌లో కలిసి పుస్తకాలను అందచేశారు. కేయూ రాజనీతిశాస్త్ర విభాగం నేతృత్వంలో రెండు రోజులు పాటు 'భారతదేశంలో సంకీర్ణ ప్రభుత్వాల ప్రాధాన్యత' అనే అంశంపై నిర్వహించిన సదస్సు సమగ్ర నివేదికను అందచేశారు. హైదరాబాద్ ఐసీఎస్ఎస్ఆర్ ఎస్ఆర్‌సీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధాకర్‌రెడ్డికి కూడా నివేదిక ప్రతులను అందచేసినట్లు తెలిపారు. రెండు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను సమర్పించినట్లు వెల్లడించారు. సదస్సు పరిశో ధన పత్రాల సంపుటి పుస్తకాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో రాజనీతిశాస్త్ర విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ డాక్టర్ జి.కృష్ణయ్య, డాక్టర్ వడ్లకొండ సత్యనా రాయణ, డాక్టర్ వొడపల్లి నాగరాజు, స్కాలర్లు అంకిళ్ళ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మార్నేని రవీందర్‌రావును సన్మానిస్తున్న దృశ్యం

డీసీసీబీ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం

హనుమకొండ సిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు పాల్గొని పలు సూచనలు చేశారు. ఆర్థిక లావాదేవీలు, టర్నోవర్స్, జిల్లాలోని డీసీసీబీ బ్యాంకుల పనితీరు, పురోగతిపై, రుణాల మంజూరు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పురోగతిని పరిశీలించారు. అనంతరం డీసీసీబీకి అంతర్జాతీయ ప్రామాణీకరణ సంస్థ (ఐఎస్ఓ) సర్టిఫికెట్ వచ్చిన సందర్భంగా బ్యాంక్ యూనియన్ నాయకులు ఛైర్మన్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ కుందురు వెంకటేశ్వరెడ్డి, డైరెక్టర్లు హరిప్రసాద్, జగన్‌మోహన్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి, మాడుగుల రమేశ్, దొంగల రమేశ్, గోపాల్‌రావు, యాదగిరిరెడ్డి, నర్సింగరావు, శ్రీనివాస్, రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారంతో థీసిస్ రూపొందించాలి

కేయూ క్యాంపస్ మే 19, (ఆంధ్రజ్యోతి): పరిశోధకులు సమగ్ర సమాచారం తో థీసిస్ రూపొందించాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉద్బోధించారు. సోమవారం మ్యాథ్స్ విభాగం సెమినార్ హాల్‌లో జరుగుతున్న సైన్స్ విభాగాల స్కాలర్స్ ప్రీ పీహెచ్‌డీ కోర్సు వర్క్‌లో భాగంగా నిర్వహిస్తున్న స్కాలర్స్ సదస్సును రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం పరిశీలించారు. ఈ సందర్భంగా స్కాలర్స్‌ను ఉద్దేశించి మాట్లాడారు. కామన్ టాపిక్ తరగతుల నిర్వహణపై చర్చించారు. స్కాలర్స్ శిక్షణ తరగతులు మే 15నుంచి ప్రారంభించి మే 31వరకు కొనసాగుతాయని వెల్లడించారు. స్కాలర్స్ రీసెర్చ్ మెట్రిక్స్, ప్లాగరిజం, టెక్నికల్ రిపోర్టింగ్, థైరింగ్, లెటెక్స్‌తో పాటు ఇతర పరిశోధన అంశాలపై అధ్యయనం చేయాలని సూచించారు. విషయ నిపుణులు నేతృత్వంలో జరుగుతున్న శిక్షణ తరగతులను స్కాలర్స్ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశానికి మ్యాథ్స్ విభాగాధిపతి డాక్టర్ ఆర్.భారవీశర్మ అధ్యక్షత వహించిన ఓఎస్డీ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్లాగరిజం సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి

మడికొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): మడికొండలో మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం సఖి సేవలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, అనూష మాట్లాడుతూ.. సఖి సెంటర్ మహిళలకు అందిస్తున్న కౌన్సెలింగ్, వైద్య, న్యాయ, పోలీస్, ఉచిత వసతి వంటి ఐదు రకాల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహ హింస, లైంగిక వేధింపులు, పని చేసే చోట వేధింపులు, అత్యాచారాలు వంటి వాటి నుంచి మహిళలకు రక్షణ కల్పించడం సఖి సెంటర్ ముఖ్య ఉద్దేశమన్నారు. 181 టోల్‌ఫ్రీ నెంబర్‌కు గానీ, 0870 245212, 7382983088 నెంబర్లకు ఫోన్ చేసి బాధిత మహిళలు తక్షణ సహాయం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కాజీపేట ఏసీపీని కలిసిన సంతోష్‌రెడ్డి

వరంగల్ క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డిని హనుమకొండ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచం అందజేసి సన్మానించారు. సంతోష్‌రెడ్డి వెంట ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, నాయకులు అరణ్యారెడ్డి, రుత్విక్‌రెడ్డిలు ఉన్నారు.

ఏడీఎన్ నరసింహారావుకు సన్మానం

కాజీపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటకు సోమవారం నూతనంగా వచ్చిన రైల్వే ఏడీఎన్ నరసింహారావుకు రైల్వే సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. పూలబొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అధికారి ఇమ్రాన్ హైమద్, కోదాటి దిలీప్, సిబ్బంది మహేశ్వర్ రెడ్డి, ఇక్బాల్, నార్లగిరి సంపత్, శంకర్, రఫీ, కార్తిక్ తదితరులు ఉన్నారు.

పైకం లేనిదే.. పని కాదంతే..

5వ పేజీ తరువాయి

తీసుకుంటారు. తప్పని పరిస్థితి అయితేనే ఫోన్‌లో రాయబారం నడిపిస్తుంటారు.

- ఓ యువకుడు ఇటీవల కొత్త వాహనం కొనుగోలు చేయగా ఆ సమయంలో షోరూమ్ నిర్వాహకులు రిజిస్ట్రేషన్ ఫీజు వసూలు చేశారు. ఆర్‌టీఏ కార్యాలయానికి వెళ్లి అధికారులను కలిస్తే పని అయిపోతుందని చెప్పగా.. అన్నట్టుగానే యువకుడు ఆర్‌టీఏ కార్యాలయంలో కలవగా వివిధ పత్రాలు కావాలని వాహనదారుడిని ఆగమాగం చేసి చివరికి దళారుడి ద్వారా వస్తే పని అవుతుందని ఉచిత సలహా ఇచ్చారు. బాధితుడు షోరూమ్ నిర్వాహకులకు ఫోన్ ద్వారా విషయం తెలపగా.. పని తొందరగా కావాలంటే తప్పదని బదులివ్వడంతో తప్పనిపరిస్థితుల్లో దళారుడిని ఆశ్రయించి రూ.1000 చెల్లించి పని పూర్తిచేసుకున్నాడు.
- ఫుట్‌పాత్‌లపై దుస్తులు విక్రయించే ఓ వ్యక్తి గిరాకీ లేక భార్యకు ఆ వ్యాపారాన్ని అప్పగించి ట్రాలీఆటో నడుపుకుంటున్నాడు. (ట్రాలీఆటో) ఫిట్‌నెస్ కోసం వచ్చి రూ.800లోపు అయ్యే దానికి రూ.2000 చెల్లించాడు. అదనంగా ఎందుకు చెల్లించావు?? అని పక్కవాళ్లు ఆరా తీస్తే.. దళారీకి డబ్బులు ఇచ్చి చసుకున్నానని చెప్పడం విశేషం.

నిఘా శూన్యం

అధికారుల అక్రమ ఆదాయంపై సంబంధితశాఖ అధికారులు కన్నెత్తి చూడక పోవడంతో ఆర్‌టీఏ కార్యాలయాల్లో దళారులు, అధికారులు చెలరేగిపోతున్నారని వాహనదారులు అంటున్నారు. చక్రం తిప్పే దళారులతో పాటు ఆర్‌టీఏ కార్యాలయాల్లోని దస్త్రాలను తనిఖీ చేస్తే పక్కా ఆధారాలతో దొరికిపోతారని పలువురు వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. ఏజెంట్ల కన్నా అధికారులకే లాభార్జన ఎక్కువగా ఉందని కొంత మంది దళారులు పేర్కొనడం విశేషం.

పూర్తిస్థాయి అధికారి లేక..

ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కార్యాలయం హనుమకొడ జిల్లాలోనే ఉంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గత డీటీసీ పుప్పాల శ్రీనివాస్‌ను ప్రభుత్వం తొలిగించగా, కరీంనగర్ డీటీసీ పురుషోత్తంను ఇన్‌చార్జ్ డీటీసీగా ప్రభుత్వం నియమించింది. పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ఆర్‌టీఏ కార్యాలయాల్లో అక్రమదందాకు అడ్డుఅదుపు లేకుండా పోయిందని ప్రచారం ఉంది.

రారాజు సామ్రాజ్యం

ప్రస్తుతం హనుమకొండ, వరంగల్ జిల్లాల రవాణాశాఖలో ఓ దళారి రా'రాజు' హవా నడుస్తోంది. ఈయన ఒక్క ఫోన్ చేస్తే ఆర్టీఏ కార్యాలయంలో ఏ పని అయినా ఇట్టే పూర్తవుతుంది. నెలకు వేలల్లో కిరాయిలు చెల్లిస్తూ.. పదుల సంఖ్యలో మనుషులను పెట్టుకొని హనుమకొండ, వరంగల్ జిల్లాల రవాణాశాఖ కార్యాలయాల్లో కార్యకాలాపాలు కొనసాగిస్తుంటాడు. అధికారులకు సైతం అదే స్థాయిలో ముడుపులు ముట్టచెబుతాడానే ఆరోపణలు ఉన్నాయి. ఇతర ఏజెంట్లు సైతం సదరు వ్యక్తి చెప్పుచేతుల్లోనే పనిచేస్తారనే ప్రచారం సైతం ఉంది. ఆర్‌టీఏ కార్యాలయంలో ఏ సేవలు పొందాలన్న ముందుగా ఆ వ్యక్తి ఏర్పాటు చేసుకున్న మనుషులను ప్రసన్నం చేసుకోవాల్సిందే. ఈ రారాజుగా జిల్లా అధికారులనే కాదు.. వారి పైఅధికారులను సైతం మచ్చిక చేసుకొని తన వలలో వేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఆర్టీఏ కార్యాలయాల్లో చక్రం తిప్పుతున్న ఈ పేరుమోసిన దళారీ దందాను, ఆయనకు సహకరిస్తున్న అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకొని వాహనదారుల జేబులకు చిల్లుపడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా ఫిర్యాదులపై శ్రద్ధ వహించండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- 99 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో నగర ప్రజలు ఇస్తున్న ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బల్దియా కమిషనర్ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. నగర ప్రజలకు అందించవలసిన మౌలిక సదుపాయాలపై అధికారులు చొరవ చూపాలని అన్నారు. టౌన్‌ప్లానింగ్‌పై ప్రతీ ప్రజావాణిలో తరుచుగా ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ప్రస్తుత వేసవిలో నగర ప్రజలకు మంచినీటి సమస్య రాకుండా ఇంజనీరింగ్ అధికారులు చొరవ చూపాలన్నారు. 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 99 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో లు రమేష్, లక్ష్మరెడ్డి, ఇంచార్జీ సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్‌కుమార్‌తో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు	
ఇంజనీరింగ్	: 16
హెల్త్, శానిటేషన్	: 14
ప్రాపర్టీ ట్యాక్స్ రెవెన్యూ	: 07
టౌన్‌ప్లానింగ్	: 56
తాగునీటి సరఫరా	: 06
మొత్తం	: 99

ఫిర్యాదులు ఇలా..

- వరంగల్ నగరంలో చాలా ప్రాంతాల్లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా చాలా మంది నాయీబ్రాహ్మణ వృత్తిని కొనసాగిస్తున్నారని, బల్దియా నిబంధలను అనుసరిస్తున్న వారిని గుర్తించి ట్రేడ్ లైసెన్స్ మంజూరు చేయాలని వరంగల్ నగర నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కులకట్టు ప్రకారం పని చేస్తున్న వారిని తప్ప.. ఇతరులకు ట్రేడ్ లైసెన్స్ ఇవ్వకూడదని విజ్ఞప్తి చేశారు.
- ప్రభుత్వ ఆర్థిక సహాయంతో హనుమకొండలో పిండివంటలు తయారు చేస్తానని, నాకు షాపు పరిధికంటే ఎక్కువగా ట్రేడ్‌లైసెన్స్ ఫీజు విధిస్తున్నారని, ఫీజును పరిశీలించాలని ప్రమీల కమిషనర్‌కు విన్నవించారు.
- హనుమకొండ 56వ డివిజన్ గోపాలపురంలో ఓ వ్యక్తి గృహనిర్మాణం చేస్తూ రోడ్డుకు అడ్డంగా మెటీరియల్ పోయడం వల్ల చాలా ఇబ్బందిగా ఉందని, అటుగా వెళ్లే వారికి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని కాలనీకి చెందిన దేవేందర్‌రెడ్డి అనే వ్యక్తి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు మహిళపై గతంలో చాలాసార్లు ఫిర్యాదు చేసినా బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు.
- హనుమకొండ 50వ డివిజన్‌లో విద్యారణ్యపురి న్యూబృందవన్ కాలనీలో చాలా కాలంగా కుక్కల బెడద అధికంగా ఉందని, దారి వెంట వెళ్లే పిల్లలను, పెద్ద వారిని కరుస్తున్నాయన్నారు. కాలనీలో కుక్కల సమస్య నివారించాలని కాలనీవాసులు కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందించారు.

రుద్రేశ్వరుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



వేయిస్తంభాల గుడిలో కుటుంబ సభ్యులతో హైకోర్టు న్యాయమూర్తి కందికొండ నర్సింగరావు

హనుమకొండ కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయయమూర్తి నందికొండ నర్సింగరావు కుటుంబ సమేతంగా సోమవారం హనుమకొండలోని వేయిస్తంభాల గుడిని సందర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా న్యాయమూర్తిగా పనిచేసి పదోన్నతిపై హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా వేయిస్తంభాల గుడిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తొలుత ఉత్తిష్ట గణపతి దర్శనం కలి గించి అనంతరం రుద్రేశ్వర స్వామికి సహస్ర నామార్చాన నిర్వర్తింప చేశారు. ఆ తర్వాత ఆలయ నాట్య మండపంలో తీర్థప్రసాదాలు, స్వామి వారి శేషవస్త్రాలను అందచేశారు. ఆశీర్వచం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్, అర్చకులు మణికంఠశర్మ, ప్రణవ్, ఆలయ సిబ్బంది మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షలు వాయిదా వేయాలి

రాత్రి వేళ కేయూలో విద్యార్థుల ఆందోళన



సోమవారం రాత్రి కేయూ మొదటి గేటు వద్ద బైఠాయించి నిరసన చేస్తున్న పీజీ విద్యార్థులు

కేయూ క్యాంపస్ మే 19, (ఆంధ్రజ్యోతి): పీజీ కోర్సుల పరీక్షలను వాయిదా వేయాలని కాకతీయ యూనివర్సిటీలో సోమవారం రాత్రి విద్యార్థులు ఆందోళనలకు దిగారు. కేయూ మొదటి గేటు వద్ద వర్సిటీ క్యాంపస్‌తోపాటు సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాలల విద్యార్థులు బైఠాయించి పెద్ద పెట్టున నినాదా లు చేశారు. జాతీయ, రాష్ట్రస్థాయి పోటీ పరీక్షల నేపథ్యం లో పరీక్షలను వాయిదా వేయాలని గతంలోనూ విద్యార్థు లు ఆందోళనలు చేపట్టగా తాత్కాలికంగా వాయిదా వేశారు. అయితే తమకు పరీక్షలు నిర్వహించాలని ఇటీ వల కొందరు విద్యార్థులు వర్సిటీ ఉన్నతాధికారులకు విన్నవించడంతో మే 20 నుంచి 31 వరకు నిర్వహిస్తా మని వారం కిందట పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించారు. అయితే సోమవారం రాత్రి పరీక్షలను వాయిదా వేయాల ని విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేశారు. ఆందోళనలు చేస్తున్న విద్యార్థుల వద్దకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ వచ్చి నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు. విద్యార్థుల నిరసనల నేపథ్యం లో కేయూ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆదర్శ నేత, అధ్యయనశీలి పుచ్చలపల్లి

సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న సీపీఎం పార్టీ నాయకులు

హనుమకొండ చౌరస్తా, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు ఆదర్శనేత, అధ్యయనశీలి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని జిల్లా కమిటీ సభ్యుడు గొడుగు వెంకట్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి సుందరయ్య చిత్ర పటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాడి 10లక్షల ఎకరాల భూములను పేద ప్రజలకు పంపిణీచేసిన యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. పీడిత ప్రజల కోసం తన ఆస్తులను, భూములను దానం చేసి, సమాజం కోసం పిల్లల్ని కూడ వద్దనుకున్న ఆదర్శనేత సుందరయ్య అని తెలిపారు. చట్టబద్ధ పదవులను అనుభవించినప్పటికీ ఆడంబరాలకు పోకుండా సైకిల్ పైనే పార్లమెంట్‌కు వెళ్లి పేదల సమస్యలను చట్టసభల్లో చర్చించిన మహోన్నత వ్యక్తి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న విధానాల ప్రాతిపదికగా అర్థవంత మైనరీతిలో ప్రజాసమస్యలను చర్చించి, పార్లమెంట్‌ను ప్రజా సమస్యల చర్చావేదికగా నిలిపారన్నారు. అగ్రకులంలో పుట్టినప్పటికీ వివక్షకు, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడి దళితుల చేత ఆలయ ప్రవేశాలు చేయించి, సహపంక్తి బోజనాలు నిర్వహించిన ఆదర్శనేత అని తెలిపారు. నీటి వనరుల వినియోగం, భూమిపై ఉన్న సహజ వనరులు ప్రజలందరివని, సంపద వికేంద్రీకరణ జరగాలని, దున్నేవాడికే భూమి ఇవ్వాలని ప్రజల కోసం పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తిసుందరయ్య అని అన్నారు. సుందరయ్య స్ఫూర్తితో ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలు లేని సమాజం కావాలని ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రమేష్, నాయకులు మంద సంపత్, నోముల కిశోర్, కంచర్ల కుమారస్వామి, ఎం. రమాదేవి, బొచ్చు కళ్యాణ్, కడారి సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.



పుచ్చలపల్ల సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, ఉద్యోగులు

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి

కేయూ క్యాంపస్ : కమ్యూనిస్టు నేత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం కేయూ అధ్యాపకులు, ఉద్యోగులు నివాళులర్పించారు. కేయూ బయోటెక్నాలజీ విభాగంలో అఖిల భారతీయ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పుచ్చలపల్లి సుందరయ్య నిరాడంబరతతో ఆదర్శ జీవితం గడిపి గొప్ప కమ్యూనిస్టు యోధులన్నారు. కుల వ్యవస్థను నిరసించారని అన్నారు.కార్యక్రమంలో కేయూ బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ తాడూరి శాస్త్రి, వై.రవికుమార్, బా లాజీ, ప్రకాశ్, రంజిత్, రాంచందర్,రవి, గౌరీశంకర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య గొప్ప పోరాటయోధుడు

హసన్‌పర్తి : పుచ్చలపల్లి సుందరయ్య గొప్ప తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడని సీపీఎం జిల్లా కార్యదర్శి గాద ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. శ్రమ జీవుల హక్కులు, భూ సంస్కరణలు, సమానత్వం వంటి సుందరయ్య ఆశయాలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రజాస్వామిక విలువలను కాపాడేందుకు ఆయన తన జీవితాన్నే అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు, మండల కమిటీ సభ్యుడు పుల్ల అశోక్, మంద సుచేందర్, వేలు సుమన్, వేలు రజిత, నాంపల్లి మౌనిక, రవి, సుధాకర్, సమ్మయ్య, అనిఫా, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలి

హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య సూచించారు. సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో గర్బిణులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏఎన్ఎంలు, ఆశాలకు, జీఎంహెచ్ సిబ్బందికి, డాక్టర్లకు అనుసంధానంగా ఉండేలా ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం ముగ్గురు మహిళా పబ్లిక్‌హెల్త్ అధికారులను డిప్యూటేషన్ చేశామన్నారు. ప్రతీ గర్భిణికి మొదటి, రెండో చెకప్‌లు సంబంధిత పీహెచ్‌సీ డాక్టర్ చేస్తారని, అలాగే మూడు, నాలుగో చెకప్‌లు సీఎంహెచ్‌వోలో జరగాలని, ఇందుకోసం జిల్లాకు చెందిన గర్భిణుల రిజిస్ట్రేషన్ నెంబరు, ఫోన్‌నెంబర్ తీసుకొని తప్పనిసరిగా చెకప్‌కు వచ్చేలా కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. ప్రమాదకర లక్షణాలను గుర్తించి వారి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మీ, మాతాశిశు సంక్షేమ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మంజుల, లీల, సుందరి, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

హనుమకొండ సిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఘటన ఆదివారం నగరంలోని న్యూశాయంపేటలో జరిగింది. బాలరక్ష భవన్ అధికారులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. న్యూశాయంపేటకు చెందిన మైనర్ బాలిక (16)ను నెక్కొండ మండలానికి చెందిన బాలుడు (17)కు ఇచ్చి వివాహం చేయడానికి ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న హనుమకొండ జిల్లా బాలల పరిరక్షణ విభాగం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పోలీసులు, చైల్డ్‌లైన్, సుబేదారి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాల్య వివాహాన్ని అడ్డుకుని ఇద్దరి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం బాలికలను చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ ఎదుట ప్రవేశపెట్టి తాత్కాలికంగా పునరావాసం నిమిత్తం సఖి వన్‌స్టాప్ సెంటర్‌కు పంపించారు. సోమవారం బాలుడు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్ అనంతరం బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ అన్నమనేని అనిల్‌చందర్‌రావు, సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్, రాజేంద్రప్రసాద్, హైమావతి, కజాంపురం దామోదర్, పి.వెంకన్న, సౌరం ప్రవీణ్ కుమార్, భాస్కర్, శ్రీనివాసులు, రజిత, సుజాతదేవి, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

వాల్యుయేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి

కేయూ క్యాంపస్ మే 19, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో విద్యార్థులకు త్వరితగతిన ఫలితాలను ప్రకటించేందుకు వాల్యుయేషన్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం కోరారు. ఈ మేరకు సోమవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి కార్యాలయంలో నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం. తిరుమలదేవి, డాక్టర్ పి.వెంకటయ్య, డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలతో కలిసి పరీక్షల విభాగంలో అన్ని విభాగాలను పరిశీలించారు. వాల్యువేషన్ ప్రక్రియలో మూల్యాంకనం తీరును గమనించారు. కంప్యూటర్ సెక్షన్, యూజీ, పీజీ, కాన్ఫిడెన్షియల్‌తో పాటు కాన్వకేషన్ విభాగంలో ఆకస్మికంగా పర్యటించారు. ఉద్యోగుల హాజరుతో పాటు పనితీరును పరిశీలించారు. పరీక్షల విభాగంలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా? అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డాక్టర్ నరసింహారావు, సూపరింటెండెంట్ సురేశ్‌కుమార్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం



పొగతోనే ప్రమాదం

హైదరాబాద్ చార్మినార్ చేరువలో ఇటీవల చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో ఏకంగా 17 మంది దుర్మరణం పాలైన విషయం మనందరికీ తెలిసిందే! సాధారణంగా ఇలాంటి అగ్నిప్రమాదాల్లో కాలిన గాయాలకు మించి, అగ్నికీలల నుంచి వెలువడే పొగను పీల్చుకోవడం వల్లే మరణాలు ఎక్కువగా సంభవిస్తూ ఉంటుంది. కాబట్టి ఇలాంటి సందర్భాల్లో ఎలా నడుచుకోవాలో, విషపూరిత పొగల నుంచి ప్రాణాలను ఎలా కాపాడుకోవాలో వైద్యులు వివరిస్తున్నారు

సాధారణంగా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు భయంతో, మంటలకు దూరంగా పరుగులు పెట్టే ప్రయత్నం చేస్తారు. కానీ దట్టంగా పరుచుకున్న పొగల నుంచి తప్పించుకునే ప్రయత్నం కూడా చేయాలి. అగ్నిప్రమాదం జరిగినప్పుడు వెలువడే పొగలను పీల్చుకోవడం వల్ల శరీరానికి సరిపడా ఆక్సిజన్ అందని పరిస్థితి తలెత్తుతుంది. దీనికి తోడు పొగలోని కార్బన్ మోనాక్సైడ్ అనే విషపూరిత వాయువు ఊపిరితిత్తులను దెబ్బ తీస్తుంది. ఆ ప్రదేశంలోని వేడి, సెగ, మంటల వల్ల ముక్కు నుంచి గొంతు వరకూ శ్వాసకోశాల్లో వాపు ఏర్పడుతుంది. అలాగే మంటల మూలంగా ఊపిరితిత్తుల గొట్టాలకు గాయాలవుతాయి. కాబట్టి అగ్నిప్రమాదానికి గురైనప్పుడు ఆ తీవ్రత నుంచి తప్పించుకునే మార్గాలను అనుసరించాలి. అందుకోసం...

- తేలికగా ఉండే పొగలు గదిలో పైకి చేరుకుంటాయి. కాబట్టి నేల మీదకు వంగి అక్కడి నుంచి తప్పించుకోవాలి
- వస్త్రాన్ని ముక్కుకు అడ్డుపెట్టుకోవడం వల్ల కొంత మేరకు ప్రయోజనం ఉంటుంది
- శరీరం కాలకుండా తడిపిన వస్త్రాన్ని చుట్టుకోవచ్చు
- మంటల్లో కాలిన వారిని రక్షించాలనే తొందర్లో చేతులతో చుట్టేస్తే గాయాల తీవ్రత పెరిగే ప్రమాదం ఉంటుంది. కాబట్టి వాళ్ల ఒంటికి వస్త్రం చుట్టి, ఆ తర్వాతే తరలించాలి
- లేదంటే కాలిన గాయాలైన వారికి వస్త్రం చుట్టి నేల మీద దొర్లిస్తూ తరలించాలి

నియంత్రణ ఇలా...

- మంట, పొగలను పసిగట్టే ఫైర్ అలారం, స్మోక్ డిటెక్టర్ లాంటి ఏర్పాట్లు చేసుకోవాలి
- ఇంట్లో తేలికగా తగలబడే వీలున్న వస్తువులను పరిమితం చేసుకోవాలి
- ఇంటికి రెండు వైపులా తలుపులు ఉండేలా చూసుకోవాలి
- మంటలను ఆర్పే పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి

ప్రథమ చికిత్స

అగ్నిప్రమాద బాధితులను ఆస్పత్రికి తరలించేలోగా...

- నూరు శాతం ఆక్సిజన్‌ను అందించే 'నాన్ రీబ్రీతర్ మాస్క్'ను ఉపయోగించి స్వచ్ఛమైన ఆక్సిజన్ అందేలా చేయాలి
- కుంచించుకుపోయిన శ్వాసనాళాలను విప్పార్చే ఇన్‌హేలర్స్ కూడా ఉపయోగించుకోవచ్చు

దీర్ఘకాలంలో...

అగ్నిప్రమాదం బారిన పడిన వారు దీర్ఘకాలంలో క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మొనరీ డిసీజ్ (సిఒపిడి)కు గురయ్యే అవకాశాలుంటాయి. అగ్నిప్రమాద సమయంలో పొగలను పీల్చుకోవడం వల్ల, ఆ ప్రభావంతో ఊపిరితిత్తుల్లోని గాలిగదులు దెబ్బతినే పరిస్థితి ఇది. అలాగే విపరీతమైన మంటలు, పొగలకు బహిర్గతమైన వారి ఊపిరితిత్తులు గట్టిపడిపోతాయి. గాలిగొట్టాలు కూడా కుంచించుకుపోయే అవకాశం ఉంటుంది. అలాగే పొగలోని కార్బన్ మోనాక్సైడ్ వాయువును ఎక్కువగా పీల్చుకోవడం వల్ల, ఆ క్రమంలో మెదడుకు సరిపడా ఆక్సిజన్ అందక, తర్వాతి కాలంలో కొన్ని మెదడు సంబంధ సమస్యలు కూడా తలెత్తుతాయి. ఇంకొందరు ఆస్తమాను పోలిన పిల్లకూతలు, ఆయాసంతో బాధపడే పరిస్థితి తలెత్తవచ్చు. కాబట్టి అగ్నిప్రమాదం బారిన పడినవారు ఎటువంటి చికిత్సతో పనిలేకుండా పూర్తిగా కోలుకున్నప్పటికీ, దీర్ఘకాలంలో ఊపిరితిత్తుల అస్వస్థలకు గురికాకుండా ఉండడం కోసం, ఊపిరితిత్తుల పనితీరునూ, సామర్థ్యాన్నీ తరచూ పరీక్షించుకుంటూ ఉండాలి. ఇందుకోసం ప్రమాదం జరిగిన ఒక నెల, మూడు నెలలు, ఆరు నెలలకు ఒకసారి పల్మొనరీ ఫంక్షన్ టెస్ట్ చేయించుకోవాలి.

డాక్టర్ హరికిషన్ గోనుగుంట్ల
సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మొనాలజిస్ట్, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్.



తెలుసుకుందాం

'బెడ్ రాటింగ్' గురించి విన్నారా?



గంటల తరబడి ఏ పనీ చేయకుండా, కదలకుండా విశ్రాంతిలో గడపడం లేదా ఫోన్, టివి చూస్తూ కాలక్షేపం చేయడమే 'బెడ్ రాటింగ్'. నేటి తరం ఈ ధోరణిని 'సెల్ఫ్ కేర్'గా పరిగణిస్తున్నప్పటికీ, దీంతో శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పని ఒత్తిడి, అలసట, అనాసక్తి... ఇవన్నీ కలిసి పడక పైనుంచి కదలనివ్వవు. తీరిక దొరికిన వెంటనే ఫోన్ చేతిలోకి తీసుకుని అదే పనిగా స్క్రోలింగ్ చేయడం లేదా నచ్చిన నెట్‌ఫ్లిక్స్ సిరీస్‌ను గంటల తరబడి కొనసాగించడం లాంటివి చేస్తోంది జెన్ జడ్ తరం. కొందర్లో ఈ అలవాటు ఉదయం నిద్ర లేచిన వెంటనే, లేదా రాత్రి నిద్రకు ముందు కొనసాగుతూ ఉంటుంది. దీన్ని కాలక్షేపంగా, సేద తీరడంగా వాళ్లు బలంగా నమ్ముతూ ఉంటారు. కానీ ఇక్కడే ఒక తిరకాసు ఉంది. అడపాదడపా ఫోన్లు, టివిలతో సేద తీరడంలో తప్పు లేదు. కానీ తీరిక దొరికిన ప్రతిసారీ ఇదే పని చేస్తుంటే జీవగడియారం అస్తవ్యస్థమై, సెరటోనిన్ హార్మోన్ మోతాదులు తగ్గిపోయి, గాబా, డోపమైన్ న్యూరోట్రాన్స్‌మీటర్లు అదుపు తప్పుతాయనీ, ఫలితంగా ఆందోళన, ప్రేరణ లోపం, మానసిక కుంగుబాటుకు గురవుతారనీ వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇలా దీర్ఘసమయాల పాటు అచేనతంగా ఉండిపోవడం వల్ల, శరీర కదలికలు లోపించి, మనసును తేలిక పరిచే, హుషారుగా ఉంచే హ్యాపీ హార్మోన్ల స్రావాలు తగ్గిపోయి, నిద్రలేమి, కుంగుబాటు, ఆందోళనలు వేధించే అవకాశం ఉంటుంది. కాబట్టి తీరిక దొరికిన కొద్దిపాటి సమయాన్ని మానసిక ప్రశాంతతను చేకూర్చే పనులకు కేటాయించడం అవసరం. కిటికీలో కూర్చుని ప్రకృతిని ఆస్వాదించడం, ఆరుబయట విహరించడం, వ్యాయామం చేయడం, పుస్తకాలు చదవడం, ఆప్తులతో సరదా సమయాలు గడపడం, స్నేహితులతో గడపడం లాంటి పనుల కోసం తీరిక సమయాలను కేటాయించడం అలవాటు చేసుకోవాలి.

అధ్యయనం

క్యాన్సర్ చికిత్సతో మతిమరుపు

కార్-టి సెల్ థెరపీ ఫలప్రదమైన క్యాన్సర్ చికిత్స. అయితే ఈ చికిత్సతో మతిమరుపు, ఏకాగ్రతా లోపం లాంటి దుష్ప్రభావాలు ఉంటాయని తాజాగా స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ చేపట్టిన ఒక అధ్యయనంలో వెల్లడైంది.

రోగి సొంత టి సెల్స్‌ను మార్పుకు గురి చేయడం ద్వారా, క్యాన్సర్ కణాలను గుర్తించి, వాటిని నాశనం చేసే కార్-టి సెల్ చికిత్స ఎంతో సమర్థవంతమైనది. వేగంగా విజృంభించే తత్వం కలిగిన క్యాన్సర్ కొమ్ములు విరచడంలో ఈ చికిత్స అత్యంత సమర్థమైనదిగా పేరుపొందింది. అయితే ప్రతి కేన్సర్ చికిత్సకూ దుష్ప్రభావాలు ఉనట్టే, దీనికి కూడా మెదడు పనితీరును ప్రభావితం చేసే స్వభావం ఉన్నట్టు అధ్యయనాల్లో తేలింది. మెదడు, చర్మం, రక్తం, ఎముక.. ఇలా వేర్వేరు శరీరావయవాలకు క్యాన్సర్ సోకిన ఎలుకలపై చేపట్టిన చిట్టెలుకలను అధ్యయనం చేసినప్పుడు, కార్-టి చికిత్సకు ముందు, తర్వాత సదరు చిట్టెలుకలతో మెదడు సామర్థ్యం తగ్గిన సూచనలు కనిపించినట్టు పరిశోధకులు కనిపెట్టడం జరిగింది. అయితే కార్-టి చికిత్స ఎంతో సమర్థమైనది కాబట్టి ఈ చికిత్స ప్రభావం మెదడు పనితీరు మీద కనబరిచే శాశ్వత ప్రభావాలను అర్థం చేసుకోవడం ఎంతో కీలకం. కాబట్టి ప్రస్తుతం పరిశోధకులు, ఈ చికిత్సతో



క్షీణించిన మెదడు పనితీరును తిరిగి సరిదిద్దగలిగే వ్యూహాత్మకమైన చికిత్సా ప్రత్యామ్నాయాలను కనిపెట్టడంతో పాటు, ఇలాంటి దుష్ప్రభావాలు తక్కువగా ఉండే భవిష్యత్తు చికిత్సా విధానాలను కూడా రూపొందించే పనికి పూనుకున్నారు.

మైగ్రేన్



పార్శ్వ నొప్పిని భరించడం కష్టమే! అయితే తెలివిగా వ్యవహరించగలిగితే దీని మీద పైచేయి సాధించడం అంత కష్టమేమీ కాదనీ, ప్రేరకాలను కనిపెట్టి, ముందస్తు మందులతో దీనికి అడ్డుకట్ట వేయడం సులభమేనని వైద్యులు అంటున్నారు. పార్శ్వ నొప్పి పని ఎలా పట్టాలో ఇలా వివరిస్తున్నారు.

పార్శ్వ నొప్పి పని పడదాం!

ఈ నొప్పికి వయసుతో పని లేదు. పిల్లల్లో, పెద్దల్లో, వృద్ధుల్లో ఎవరికైనా ఈ నొప్పి వేధించవచ్చు. అయితే ముఖ్యంగా 20 నుంచి 40 ఏళ్ల వయస్కుల్లో ఈ నొప్పి ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. సాధారణ తల నొప్పికీ పార్శ్వపు నొప్పికీ స్పష్టమైన తేడాలుంటాయి. సాధారణ తలనొప్పులు కొన్ని నిమిషాల పాటు ఇబ్బంది పెడితే, మైగ్రేన్ నొప్పి గంటలు, రోజుల తరబడి వేధిస్తుంది. అలాగే కొన్ని లక్షణాలతో ఈ నొప్పిని తేలికగా కనిపెట్టవచ్చు. అవేంటంటే....

- కంటి వెనక నొప్పి మొదలవుతుంది
- తలకు ఎడమ వైపు, కుడి వైపు ఇలా తలలో ఒక వైపున నొప్పి మొదలవుతుంది
- ఈ ప్రదేశాలు కూడా వేర్వేరు వ్యక్తుల్లో వేర్వేరుగా ఉంటాయి
- తల మీద కొట్టినట్టు, తల పగిలిపోతున్నట్టు నొప్పి ఉంటుంది
- కళ్ల బైర్లు కమ్మడం
- నీరసం, చీకాకు
- శబ్దాలను, వెలుతురునూ భరించలేకపోవడం
- వాంతి వస్తున్న భావన కలగడం
- వాంతితో పాటు తలనొప్పి తగ్గడం

వ్యాధినిర్ధారణ సులువే!

ఈ నొప్పికి కొన్ని అంశాలు దోహదపడుతూ ఉంటాయి. నిద్ర లేమి, వేడుకల్లో అధిక వెలుగులకూ, శబ్దాలకూ బహిర్గతం కావడం, సినిమాకు, పబ్‌లకూ వెళ్లి రావడం, విపరీతమైన ఒత్తిడికి లోనవడం, మద్యం తీసుకోవడం, మాదక ద్రవ్యాలు తీసుకోవడం.. వీటి తదనంతరం తలనొప్పి మొదలైతే దాన్ని మైగ్రేన్ నొప్పిగా, మైగ్రేన్ ప్రేరేపిత అంశాలుగా పరిగణించాలి. ఈ నొప్పి ప్రారంభంలో నెలలో ఒకసారికి పరిమితమైతే, క్రమేపీ నెలలో ఐదారుసార్లకు పెరిగిపోతుంది. ఈ నొప్పి తీవ్రత కూడా కాలక్రమేణా పెరిగిపోతూ, రోజంతా పడకకే పరిమితమయ్యే పరిస్థితికి దారి తీస్తుంది. కాబట్టి మైగ్రేన్ నొప్పిని వీలైనంత త్వరగా నిర్ధారించుకుని, వెంటనే చికిత్స మొదలుపెట్టుకోవాలి. ఎమ్మారై, స్కాన్‌లో తలలో ఎటువంటి సమస్య లేదని తేలినప్పుడు, ఒక ప్రశ్నావళి ఆధారంగా ఈ సమస్యను మైగ్రేన్‌గా వైద్యులు నిర్ధారిస్తారు. సమస్య తీవ్రత పెంచే కారకాలు, ప్రేరకాలు, లక్షణాల ఆధారంగా ఈ సమస్యను కచ్చితంగా నిర్ధారించుకోవచ్చు.

మందులతో అదుపులోకి రాని మైగ్రేన్ కోసం నేడు బొటాక్స్ ఇంజెక్షన్లు అందుబాటులో కొచ్చాయి. తలలో నొప్పి వేధించే ప్రదేశంలో కండరాలకు ఈ ఇంజెక్షన్లు ఇవ్వడం ద్వారా నొప్పి నుంచి ఉపశమనాన్ని అందించవచ్చు.

వీటికి దూరం

- సరైన నిద్రవేళలు పాటించడం
- ఆహార సమయాలు పాటించడం
- ఒత్తిడికి దూరంగా ఉండడం
- డిజెలు, బిగ్గర శబ్దాలకు దూరంగా ఉండడం
- వ్యాయామం చేయడం
- వెలుగులకు బహిర్గతం అవకపోవడం

తలలోని ట్రైజెమైనల్ నాడి, న్యూరోట్రాన్స్‌మీటర్లలో హెచ్చుతగ్గులు మైగ్రేన్‌కు కారణం. సెరోటినిన్ అనే న్యూరోట్రాన్స్‌మీటర్ మోతాదు తగ్గితే, శరీరం న్యూరోపెప్టైడ్స్‌ను విడుదల చేస్తుంది. దాంతో తల్లోని రక్తనాళాలు విప్పారి, ఎక్కువ రక్తం మెదడులోకి చేరుకుంటుంది. దాంతో తలభారం మొదలవుతుంది. స్థూలంగా మైగ్రెయిన్ నొప్పికి కారణమిదే!

- నొప్పిని ప్రేరేపించే పదార్థాలను మానేయడం
- మద్యపానం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడం

చికిత్స ఇలా...

మైగ్రేన్ నొప్పి ప్రేరకాలకు దూరంగా ఉండడం ద్వారా ఈ సమస్యను నిలువరించుకోవచ్చు. ఏఏ అంశాలు ఈ నొప్పిని ప్రేరేపిస్తున్నాయో ఎవరికి వారు కనిపెట్టి వాటికి దూరంగా ఉండడం ముఖ్యం. అప్పటికీ నొప్పి వేధిస్తుంటే మందులతో నొప్పిని అదుపు చేసుకోవచ్చు. మైగ్రేన్ నొప్పిని ప్రారంభంలోనే గుర్తించడం, గుర్తించిన వెంటనే మందులు వేసుకుని నొప్పిని అదుపులో ఉంచుకోవడం అవసరం. సమస్యను త్వరగా నిర్ధారించుకోవడంతో పాటు నివారణ చర్యలు, చికిత్సలను ఎంత త్వరగా అనుసరించగలిగితే ఈ సమస్య అంత మెరుగ్గా అదుపులో ఉంటుంది. వైద్యులు సూచించిన మాత్రలను నొప్పి మొదలైన మొదటి గంటలోపే వాడుకుంటే, నొప్పి తీవ్రమవకుండా ఉంటుంది. నొప్పి తీవ్రమైన తర్వాత మందులు వాడుకుంటే, ఆ మందులతో నొప్పి అదుపులోకి రావడానికి ఎక్కువ సమయం పడుతుంది. అలాగే వేర్వేరు ఆరోగ్య సమస్యలున్న వారికి వైద్యులు సూచించే మైగ్రేన్ మాత్రలు కూడా వేర్వేరుగా ఉంటాయి. అన్ని మాత్రల్లాగే వీటికి కూడా జుట్టు రాలిపోవడం, బరువు పెరగడం, నెలసరి సమస్యలు లాంటి దుష్ప్రభావాలు కూడా ఉంటాయి. అయితే ఈ తలనొప్పి శాశ్వత సమస్య కాదు. వైద్యుల సూచనల మేరకు కారకాలకు దూరంగా ఉంటూ క్రమం తప్పకుండా మందులు వాడుకోగలిగితే, క్రమేపీ మందులతో పని లేకుండానే ఈ నొప్పి అదుపులోకొస్తుంది.

కాలక్రమేణా మైగ్రేన్ తలనొప్పులు పెరుగుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం అసహనం. అన్నీ క్షణాల్లో జరిగిపోవాలనే తొందర అందర్లో ఉంటోంది. అనుకున్నదే తడవుగా చేతికి అందాలనే స్వభావం మెదడు ఒత్తిడికి దారి తీసి, అదనపు హార్మోన్లు విడుదలై అంతిమంగా మైగ్రేన్ లాంటి సమస్యలను తెచ్చిపెడుతోంది. కాబట్టి శాంత స్వభావాన్ని అలవరుచుకోవడం కూడా కీలకమే! మనసును ప్రశాంతంగా ఉంచుకుంటూ, వాస్తవ దృష్టితో నడుచుకుంటూ, పార్శ్వ నొప్పిని ప్రేరేపించే కారకాలకు దూరంగా ఉండగలిగితే, ఈ సమస్య నుంచి తేలికగా బయటపడవచ్చు.

నొప్పి నాలుగు దశల్లో...

24 నుంచి 72 గంటల పాటు వేధించే పార్శ్వపు నొప్పి నాలుగు దశల్లో సాగుతుంది. అవేంటంటే...

ప్రొడోమ్: నొప్పికి రెండు గంటల నుంచి రెండు రోజుల ముందు వరకూ చోటుచేసుకునే అంశాల సమూహమిది. ఈ సమయంలో చీకాకు, ఒత్తిడి, ఆందోళన, వెలుతురు భరించలేకపోవడం, మెడనొప్పి లాంటి లక్షణాలుంటాయి.

ఆరా: నొప్పి మొదలయ్యే కొన్ని నిమిషాల ముందుండే దశ ఇది. చూపు మందగించడం, కళ్లకు ఎగుడుదిగుడు లైన్లు కనిపించడం, తలలో సూదులు గుచ్చినట్టు ఉండడం, మాటలు తడబడడం, నీరసం లాంటి లక్షణాలుంటాయి.

ఎటాక్: ఈ దశ రెండు నుంచి మూడు రోజుల వరకూ ఉండవచ్చు. ఈ దశలో వాంతులు వేధిస్తాయి.

పోస్ట్‌డ్రోమ్: ఈ చివరి దశలో నొప్పి తగ్గిపోయినా, తల భారం కొన్ని రోజుల పాటు కొనసాగుతుంది.

డాక్టర్ వేణుగోపాల్ గోక
సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ అండ్ స్పైన్ సర్జన్, మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, హైదరాబాద్



మనోగతం

ఆ రోగుల పట్ల దృక్పథం మారాలి

నేనొక వ్యక్తిగతమైన, ఎంతో ప్రాధాన్యం ఉన్న విషయం గురించి మాట్లాడాలనుకుంటున్నాను. ఇది నాకెందుకింత ముఖ్యమో చెప్పాలంటే మూడు సంవత్సరాలు వెనక్కి వెళ్లాలి. అది పీజీ సీటు వచ్చిందన్న వార్త తెలిసిన రోజు. సైకియాట్రీకి ఎంపికైనట్టు తెలిసినప్పుడు మొదట గర్వంగా అనిపించింది. నా తల్లిదండ్రులు చదువుకున్న వాళ్లు అయినప్పటికీ, "సైకియాట్రీలో సీటొచ్చింది" అని



వారితో పంచుకోవడం అంత సులభం కాలేదు. నాకే కాదు నా తోటి డాక్టర్ల పరిస్థితి కూడా అదే! "నేను మానసిక వైద్యురాలిని అవుతున్నాను అని చెప్పినప్పుడు మా అమ్మ... "నిన్ను పిచ్చి డాక్టర్ అంటారు, నిన్ను పెళ్లాడడానికి ఎవరూ ముందుకు రారు" అని అంది. అవి కోపంతో వచ్చిన మాటలు కావు. ఆ మాటల వెనక అమ్మ ఆందోళన నాకు అర్థమైంది. చివరకు మా కుటుంబ స్నేహితులందరూ కలిసి తల్లిదండ్రులను ఒప్పించవలసి వచ్చింది. ఇందులో మా అమ్మ తప్పేమీ లేదు. ఇది ప్రతి తల్లి ఆవేదనే! ఆప్తులే కాదు, నా తోటి డాక్టర్లు కూడా వింతగా స్పందించారు. "ఓహ్ సైకియాట్రీ తీసుకున్నావా? ఎలాంటి పేషెంట్స్ వస్తారు నీ దగ్గరికి? వాళ్లతో ప్రమాదం ఉండదా?" అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఇది రోగుల గురించిన చర్చలా లేదు. ఒక జాతికి ఇంకో జాతికీ, ఇంకో జాతికీ మధ్య జరిగే పోరాటంలో నేనొక భూమికను పోషిస్తున్న భావనకు వాళ్లు లోనయ్యారు.

సానుభూతి, తోడ్పాటు అవసరం

మానసిక రోగులు మిగతా రోగుల్లా తినే ఆహారం, వైరస్, బ్యాక్టీరియాలతో ఆరోగ్యాన్ని వాళ్లే పాడు చేసుకున్న వాళ్లు కాదు. వాళ్లు సమాజంలోని అనేక అపసవ్య సంబంధాలు, రుగ్మతల బాధితులు. కానీ వారి పట్ల ఎంతో సానుభూతితో, బాధ్యతతో వ్యవహరించాల్సిన కుటుంబసభ్యులు, స్నేహితులు, సభ్య సమాజం... వారికి తగిన వైద్యం చేయించి సహాయపడడానికి బదులుగా, దూరం పెట్టాలనే ఆలోచిస్తున్న పరిస్థితి నేడు నెలకొని ఉంది. ఈ సమస్యకు తోడు, మానసిక అనారోగ్యానికి గురైన వ్యక్తులు కూడా తామొక మానసిక రుగ్మతకు గురైనట్టు అంగీకరించకుండా సమస్యను పెద్దది చేసుకోవడం మరో పెద్ద అడ్డంకిగా మారుతోంది. ఫలితంగా చికిత్స ఆలస్యమై, ఏళ్ల తరబడి సమస్యను భరిస్తూ ఉండిపోతున్నారు. దాంతో వ్యాధి ముదిరిపోయిన దశలోనే వైద్యులను కలుస్తూ ఉంటారు. వ్యాధితో బాధపడడం ఒక ఎత్తైతే, వ్యాధిని గుర్తించకుండా, చికిత్సకు దూరంగా బ్రతకడం మరొక ఎత్తు.

మనందరి బాధ్యత

మానసిక వ్యాధి కేవలం వ్యక్తిగతం కాదు. అది సామాజికం కూడా. మానసిక రుగ్మతల పట్ల సమాజంలో నెలకొని ఉన్న వ్యతిరేకతలు బాధితులను ఒంటరులను చేస్తున్నాయి. మానసిక ఆరోగ్యాన్ని శారీరక ఆరోగ్యంగా పరిగణించే పరిపక్వత సమాజం సాధించవలసిన అవసరం ఉంది. మనిషి ఆరోగ్యంగా ఉండడం అంటే సదరు వ్యక్తి మానసికోల్లాస పరిస్థితిలో ఉండడమే! ప్రపంచీకరణ, అనిశ్చిత ప్రపంచ రాజకీయ వ్యాపార పరిస్థితి వలన ఈ రోజు సమాజంలో చోటుచేసుకుంటున్న మార్పులు ప్రతి వ్యక్తి మానసిక ఆరోగ్యం మీద ప్రభావం చూపుతున్నాయి. మనమింకా "మానసిక వ్యాధి" అనే పదానికి భయపడుతూ ఉన్నాం. ఈ మౌనం, ఈ అపహాస్యం ఆగాలి. సైకియాట్రిస్టులు అంటే పిచ్చివాళ్ల డాక్టర్లు కాదు. మనందరి ప్రాణాలు కాపాడే మిగతా వైద్యులతో ఈ వైద్యులూ సమానులే! చికిత్స తీసుకోవడం బలహీనత కాదు, అదొక తెలివైన నిర్ణయం. ప్రతి మనిషి మానసిక ఆరోగ్యాన్ని సమర్థవంతంగా నిర్వహించుకునే సమాజం కావాలి.

డాక్టర్ సనా కౌసర్
ఎంబీబీఎస్(ఎండీ, సైకియాట్రి)
కాంటాక్ట్ నంబరు- 9121318569
మమత మెడికల్ కాలేజీ, ఖమ్మం



మీకు తెలుసా?

వీటిని ఇలా తినాలి

కొన్ని పదార్థాల్లోని పోషకాలు ఇంకొక పదార్థంలోని ఇతర పోషకాలతో జత కలిసినప్పుడే ప్రభావవంతమైన ఫలితాన్నిస్తాయి. అవేంటో తెలుసుకుందాం!

- పుచ్చ ముక్కల మీద కొద్దిగా ఉప్పు చల్లుకుని తింటే, పుచ్చలోని పొటాషియం ఉప్పులోని సోడియంతో జతకట్టి మనలోని ఎలక్ట్రొలైట్స్ సంతులనానికి సహాయపడుతుంది
- బాదం పప్పును, చాక్లెట్‌తో కలిపి తింటే బాదంలోని విటమిన్ ఇ, ఆరోగ్యకరమైన కొవ్వులు డార్క్ చాక్లెట్‌లోని ఫ్లేవనాయిడ్స్‌తో కలిసి, యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ పెరిగి, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది
- ఓట్స్‌ను పెరుగులో నానబెడితే, ఓట్స్‌లోని ప్రిబయాటిక్ బీటా గ్లూకాన్ పెరుగులోని ప్రొబయాటిక్స్‌తో కలిసి పేగుల్లోని మంచి బ్యాక్టీరియా వృద్ధి చెంది, పేగుల ఆరోగ్యం మెరుగుపడుతుంది
- బ్రొకొలిని ఆవాలతో కలిపి తీసుకుంటే, ఆవాలలోని ఎంజైమ్స్, బ్రొకొలిలోని సల్ఫొరఫైన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ శోషణకు తోడ్పడతాయి



- గ్రీన్ టీలో నిమ్మరసం కలుపుకుని తాగాలి. నిమ్మరసంలోని విటమిన్ సి, గ్రీన్‌టీలోని యాంటీఆక్సిడెంట్లను శరీరం మెరుగ్గా శోషించుకోడానికి తోడ్పడుతుంది

బియ్యం ఉత్పత్తిలో.. సస్యశ్యామల భారతం



(మొదటి పేజీ తరువాయి)

అమెరికా వ్యవసాయ శాఖ(యూఎస్‌డీఏ) గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా భారత్ 14.8 కోట్ల టన్నుల మేర ఉత్పత్తి సాధించనుందని, చైనా కొంత మెరుగుదలతో 14.52 కోట్ల టన్నుల ఉత్పత్తిని నమోదు చేస్తుందని ముందస్తు అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. భారత్ ఈ ఘనత సాధించడంలో రాష్ట్రాల పాత్ర కీలకంగా ఉందని వ్యవసాయ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. దాంతోపాటు.. భారతీయ వ్యవసాయ శాస్త్రవేత్తల కృషి ఎంతో ఉందంటున్నారు.

పెరిగిన పంట విస్తీర్ణం

2023-24తో పోలిస్తే.. గత ఏడాది పంట విస్తీర్ణం పెరిగినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. మూడు సీజన్లలో కలిపి 2023-24లో వరి విస్తీర్ణం 4.78 కోట్ల హెక్టార్లుగా ఉండగా.. 2024-25లో అది మరో 5.1 కోట్ల హెక్టార్ల మేర పెరిగింది. జైద్ సీజన్‌లో పంట దిగుబడి ఏకంగా కోటి టన్నులకు చేరుకోవడం కూడా భారత్‌ను బియ్యం ఉత్పత్తిలో అగ్రగామిగా నిలబెట్టడానికి దోహదపడినట్లు వ్యవసాయ రంగ నిపుణులు చెబుతున్నారు.

రాష్ట్రాల పథకాలతో ఊతం

ఒకప్పుడు వరి పంటలో వాయవ్య రాష్ట్రాలు ముందంజలో ఉండేవి. పంజాబ్ లాంటి రాష్ట్రాలు అధిక దిగుబడిని సాధించేవి. గడిచిన పదేళ్లలో వాయవ్యంలో దిగుబడి యథావిధిగా కొనసాగుతూనే.. వరిని అధికంగా పండించే తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిసాల్లో విస్తీర్ణం, ఉత్పత్తి బాగా పెరిగింది. వరి ఉత్పత్తిలో దేశంలోనే పంజాబ్‌ను వెనక్కి నెట్టేసిన తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచి.. 'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా'గా మారుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి చేస్తున్న సాయం కూడా భారత్ వరి దిగుబడిలో అగ్రస్థానంలో నిలవడానికి కారణమైందని నిపుణులు వివరిస్తున్నారు. ఉచిత విద్యుత్తు, ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక ఏర్పాట్లు, కేంద్ర ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) వంటి అంశాలు రైతులను వరి వైపు ఆకర్షించినట్లు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు భూసార పరీక్షలు నిర్వహించడం, నాట్లు మొదలు.. కోతల వరకు వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తలు సహకరిస్తుండడంతో.. దిగుబడి బాగా పెరిగినట్లు తెలుస్తోంది. 2014-15తో పోలిస్తే.. 2024-25 వరకు దేశంలో వరి దిగుబడి దాదాపు 4.5 కోట్ల టన్నుల మేర పెరగడం గమనార్హం.!

దేశంలో వరి ఉత్పత్తి

సంవత్సరం	దిగుబడి (కోట్ల టన్నుల్లో)
2015-16	10.44
2016-17	10.97
2017-18	11.27
2018-19	11.64
2019-20	11.88
2020-21	12.43
2021-22	12.94
2022-23	13.57
2023-24	13.78
2024-25	14.90

గోధుమల దిగుబడిలోనూ..

గోధుమల దిగుబడిలోనూ భారత్ దూసుకుపోతోందని తాజా గణాంకాలు చెబుతున్నాయి. 2014-15లో భారత్‌లో గోధుమల దిగుబడి 8.65 కోట్ల టన్నులు కాగా.. 2024-25లో 11.7 కోట్ల టన్నులకు చేరుకుంది. గోధుమ ఉత్పత్తిలో చైనా 14.2 కోట్ల టన్నులతో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉండగా.. భారత్ రెండో స్థానాన్ని ఆక్రమించింది. వరి, గోధుమలతోపాటు.. పలు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో భారత్ మంచి పురోగతిని సాధిస్తున్నా.. నూనెగింజల ఉత్పత్తి మాత్రం స్వల్పంగా పడిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

భారత్ ధర్మసత్రం కాదు!

ఇప్పటికే 140 కోట్ల మంది జనాభాతో ఇబ్బందులు.. శరణార్థులపై సుప్రీం వ్యాఖ్య

» ఆశ్రయం కోరిన శ్రీలంక జాతీయుడి పిటిషన్ తిరస్కరణ



న్యూఢిల్లీ, మే 19: భారత్‌లో ఆశ్రయం కోరుతూ ఓ శ్రీలంక జాతీయుడు వేసిన పిటిషన్‌ను తిరస్కరిస్తూ సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పించేందుకు భారత్ ధర్మశాల (ఉచిత సత్రం) కాదని, ఇప్పటికే 140 కోట్ల మంది జనాభాతో దేశం ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంది. అసలు ఇక్కడ స్థిరపడేందుకు మీకేం హక్కు ఉందని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఎల్‌టీటీఈతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో 2015లో ఒక శ్రీలంక జాతీయుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. 2018లో ట్రయల్ కోర్టు చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద అతన్ని దోషిగా తేల్చి, 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అయితే 2022లో అతను మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం శిక్షను ఏడేళ్లకు తగ్గించింది. అయితే శిక్ష పూర్తయిన వెంటనే దేశం విడిచి వెళ్లాలని స్పష్టం చేసింది. దీనిపై నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తాను చట్టబద్ధమైన వీసాపైనే భారత్‌కు వచ్చానని, తిరిగి తమ దేశానికి వెళ్తే తన ప్రాణాలకు ముప్పు అని వాదించాడు. అంతేగాక తన భార్య, పిల్లలు కూడా భారత్‌లోనే స్థిరపడ్డారని పేర్కొన్నాడు. దాదాపు మూడేళ్లుగా నిర్బంధంలో ఉన్నానని, బహిష్కరణ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని, తనకు ఇక్కడే ఆశ్రయం అవకాశం కల్పించాలని పిటిషనర్ అయిన శ్రీలంక తమిళుడు అభ్యర్థించాడు. పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారణ జరిపింది. 'ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన శరణార్థులందరికీ భారత్ ఆశ్రయం ఇవ్వాలా? మేం ఇప్పటికే 140 కోట్ల మంది జనాభాతో ఇబ్బంది పడుతున్నాం. విదేశీ శరణార్థులను ఆశ్రయించేందుకు ఇదేమీ ధర్మశాల కాదు' అని జస్టిస్ దత్తా అన్నారు. రాజ్యాంగంలోని 19, 21 అధికరణలను పరిగణనలోకి తీసుకోవాలని పిటిషన్ తరఫు న్యాయవాది వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం పిటిషనర్‌ను చట్టప్రకారమే కస్టడీలోకి తీసుకున్నారని, అతని నిర్బంధం ఆర్టికల్ 21ను ఉల్లంఘించ లేదని, అదేవిధంగా ఆర్టికల్ 19 అనేది భారత్ పౌరులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది. అసలు ఇక్కడ స్థిరపడేందుకు మీకేం హక్కు ఉందని కోర్టు ఈ సందర్భంగా ప్రశ్నించింది. పిటిషనర్ శరణార్థి అని, శ్రీలంక వెళ్తే అతని ప్రాణాలకు ప్రమాదమని న్యాయవాది వాదించగా.. అయితే వేరే దేశానికి వెళ్లండని కోర్టు పేర్కొంది.

చిత్రజ్యోతి
SINCE 1965

సూర్య కొత్త సినిమా ఆరంభం



తెలుగునాట సూర్యకు ఉండే ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. 'గజని', 'సింగం', 'యముడు' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఇప్పటి వరకు డబ్బింగ్ చిత్రాలతోనే అలరించిన సూర్య ఇప్పుడు నేరుగా తెలుగు చిత్రం ద్వారా ప్రేక్షకులను పలకరించబోతున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందనున్న చిత్రంలో సూర్య నటిస్తున్నారు. ఇది సూర్యకు 46వ చిత్రం. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. 'ప్రేమలు' ఫేమ్ మమిత బైజు కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రంతో రవీనా టాండన్ తెలుగు సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇస్తున్నారు. సీనియర్ నటి రాధిక శరత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. జీ.వీ.ప్రకాశ్ కుమార్ సంగీతం అందించనున్నారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో రూపొందించడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. మొత్తానికి తెలుగు సినిమా చేయాలన్న సూర్య కోరిక ఇన్నాళ్లకు నెరవేరింది.



జూనియర్ తొలి గీతం

కర్ణాటక మాజీ మంత్రి, పారిశ్రామికవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా పరిచయం అవుతున్న లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కథానాయిక. వారాహి చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మిస్తున్నారు. జూన్ 18న తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కాబోతోంది. బెంగళూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్రం నుంచి 'లెట్స్ లివ్ దిస్ మూమెంట్' అనే తొలి పాటను చిత్రబృందం విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో దేవీశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ 'ఈ వేడుక చూస్తుంటే ఒక లైవ్ కాన్సర్ట్ చేస్తున్న ఆనందం కలిగింది. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. శ్రీరమణి అద్భుతమైన సాహిత్యం రాశారు' అని అన్నారు. హీరో కిరీటి రెడ్డి మాట్లాడుతూ 'నా తొలి సినిమాకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించడం చాలా ఆనందంగా ఉంది. శ్రీలీల, జెనీలియాతో కలసి పనిచేయడం గొప్ప భాగ్యంగా భావిస్తున్నాను' అని అన్నారు. 'ఈ సినిమాలోని ప్రతి పాట ప్రత్యేకమైనదే. మరిన్ని అద్భుతమైన పాటలు రాబోతున్నాయి' అని చిత్ర దర్శకుడు రాధాకృష్ణ తెలిపారు. కాగా, ఈ సినిమాతో జెనీలియా మళ్లీ రీ ఎంట్రీ ఇస్తున్నారు. అలాగే కన్నడ నటుడు డా.రవిచంద్రన్ ఒక ముఖ్య పాత్రలో కనిపించనున్నారు.

నా కెరీర్‌లో నిలిచిపోయే క్యారెక్టర్

"భైరవం' సినిమాలో గజపతి వర్మ లాంటి క్యారెక్టర్ ఇప్పటివరకు చేయలేదు. ఈ సినిమా నా కెరీర్‌లో ప్రత్యేకంగా నిలుస్తుంది' అని అన్నారు హీరో మంచు మనోజ్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా విజయ్ కనకమేడల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'భైరవం'. డా.జయంతిలాల్ గడా సమర్పణలో కె.కె. రాధామోహన్ నిర్మించారు. ఈనెల 30న చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. అలాగే మంగళవారం మంచు మనోజ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ "భైరవం' సినిమాలో ప్రతీ క్యారెక్టర్‌కి ప్రాధాన్యం ఉంటుంది. ఎవరి స్క్రీన్ స్పేస్ వారిదే. ప్రతి ఒక్కరు అద్భుతంగా నటించారు. శ్రీ చరణ్ అద్భుతమైన స్వరాలు సమకూర్చారు. మంగళవారం ఒక ప్రత్యేక పాట విడుదల కాబోతోంది. మా నాన్నగారి జీవన ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం. నిజాయితీగా ఉండడం ఆయన దగ్గరే చూసి నేర్చుకున్నాను. నాకు మా ఫాదరే హీరో. ఈ పుట్టినరోజు నుంచి నాకు కొత్త జన్మ మొదలు కాబోతోంది. భవిష్యత్తులో కొత్త రకం సినిమాలు చేయాలనుంది. అలాగే పిల్లల కోసం ఒక సినిమా తీయాలనుంది. ఎప్పుడైనా అవకాశం వస్తే తప్పకుండా చేస్తాను' అని అన్నారు.



శివుడిని శివయ్యా అని పిలిస్తే రాడు

'భైరవం' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మంచు మనోజ్ మాట్లాడుతూ 'ఈ మధ్యకాలంలో ఎన్నో జరిగాయి. ఎన్నో చూశాను. కట్టుబట్టలతో రోడ్డు మీదకు తెచ్చారు. నేను ఊరు వెళ్లొచ్చేసరికి నా పిల్లల వస్తువులతో సహా అన్నీ రోడ్డు మీద పెట్టారు. బయటకు వెళ్లడానికి కార్లు లేకుండా తీసుకెళ్లిపోయారు. కానీ.. నాకు ఆ శివుడు అభిమానుల రూపంలో వచ్చి 20 కార్లు పెట్టించాడు. శివుడిని శివయ్యా... అని పిలిస్తే రాడు. ఆయన్ని మనసారా తలచుకుంటే మా దర్శకుడి రూపంలోనో.. మీ అందరి రూపంలోనో వస్తాడు' అని అన్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మంచు విష్ణుని ఉద్దేశించే మనోజ్ ఇలా వ్యంగ్యంగా మాట్లాడి ఉంటారని అభిమానుల మధ్య చర్చ సాగుతోంది.



సిరివెన్నెల పాటలను బయటకు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నా...

త్రివిక్రమ్

దివంగత గీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రిని దర్శకుడు త్రివిక్రమ్ ఎంతలా ఆదరిస్తారో అందరికీ తెలిసిందే. సందర్భం వచ్చినప్పుడల్లా తనకు ఆయనపై ఉన్న ప్రేమను చాటుకుంటుంటారు త్రివిక్రమ్. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో సీతారామశాస్త్రి గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. "తాను రాసిన పాటలు కలకాలం నిలిచిపోవాలనే తపనతో ఆయన పాటలు రాసేవారు. ఆయన రాసిన పాటలకు కాలంతో సంబంధం లేకుండా ఇప్పటికీ ఆదరణ దక్కుతోంది. 'జల్సా' సినిమాలో 'ఛలోరే ఛలోరే' పాటను 34 పేజీల్లో రాశారు. కానీ సినిమాలో రెండు పేజీలు కూడా వాడలేదు. నిజానికి మాటలు రాయడం కంటే పాటలు రాయడం చాలా కష్టం. నేను ఆరు పాటలు రాశాను. తెలియకుండానే మొదటి పాటలోని పదాలు ఆరో పాటలో రిపీట్ అయ్యాయి. కొన్ని వేల పాటలు రాశారాయన. అందులో రెండు, మూడు వేల పాటలను సినిమాల్లో వాడనేలేదు. వాటిని ఎలా బయటకి తీసుకురావాలా అని ప్రయత్నిస్తున్నాను. అవి బయటకొస్తే.. రాబోయే తరం గీత రచయితలకు ఎంతగానో ఉపయోగపడతాయి" అని పేర్కొన్నారు.

ఆగస్టు 29న విశాల్ - సాయి ధన్షిక వివాహం



కోలీవుడ్‌లోని మోస్ట్ బ్యాచిలర్ హీరోల్లో ఒకరైన విశాల్ త్వరలోనే ఓ ఇంటివారు కాబోతున్నారు. హీరోయిన్ సాయి ధన్షికను ఆయన పెళ్లి చేసుకోనున్నారు. సాయి ధన్షిక ప్రధాన పాత్రను పోషించిన 'యోగి దా' చిత్ర మూవీ ఆడియో రిలీజ్ వేడుక సోమవారం రాత్రి చెన్నైలో జరిగింది. ఈ కార్యక్రమానికి హీరో విశాల్ అతిథిగా హాజరయ్యారు. ఇందులో తమ పెళ్లి విషయాన్ని వారు అధికారికంగా వెల్లడించారు. ఆగస్టు 29వ తేదీన వివాహం చేసుకోబోతున్నట్టు వారు వేదికపై నుంచి వెల్లడించారు. కాగా, నడిగర్ సంఘం భవన నిర్మాణం పూర్తయిన తర్వాత వీరిద్దరూ పెళ్లి పీటలెక్కనున్నారనే వార్తలు జోరుగా వినిపించాయి. ఈ నేపథ్యంలో వారు తమ పెళ్లి వార్తను ముందుగానే ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

బోల్డ్ కాశీ పోరాటం



తమిళ హీరో విజయ్ సేతుపతి నటించిన చిత్రం 'ఏస్'. అరుముగ కుమార్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. రుక్మిణీ వసంత్ కథానాయిక. ఈ నెల 23న సినిమా తమిళ్‌లో, తెలుగులో విడుదలవుతోంది. తెలుగులో ఈ చిత్రాన్ని పద్మినీ సినిమాస్ బ్యానర్‌పై బి.శివప్రసాద్ విడుదల చేయనున్నారు. సోమవారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో బోల్డ్ కాశీగా కనిపించనున్నారు విజయ్. ఆయన దేనికోసం పోరాటం చేస్తున్నాడు అనేది ఆసక్తికరంగా ఉండబోతోంది. అదరగొట్టే యాక్షన్‌తో పాటు కడుపుబ్బా నవ్వించే కామెడీ సన్నివేశాలు, విజువల్స్, సంగీతం సినిమాకు ప్రధానాకర్షణగా నిలవనున్నాయి.

నటుడు భరత్‌కు మాతృవియోగం

● గుండెపోటుతో తల్లి మృతి



నటుడు బి.భరత్ (మాస్టర్ భరత్) ఇంట విషాదం నెలకొంది. ఆయన తల్లి బి.కమల హాసిని (53) గుండెపోటుతో చెన్నై, తేనాంపేటలోని స్వగృహంలో మృతి చెందారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో భోజనం చేసిన తర్వాత టీవీ ఆన్ చేసేందుకు ప్రయత్నించగా ఆమెకు గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయి తుదిశ్వాస విడిచినట్టు నటుడు భరత్ మేనేజర్ ప్రకాశ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆమె అంత్యక్రియలు తేనాంపేటలోని శ్మశానవాటికలో సోమవారం పూర్తి చేశారు. ఈ విషయం తెలుసుకున్న సినీ ప్రముఖులు, సన్నిహితులు ఆయనకు ఫోన్ చేసి ధైర్యం చెబుతున్నారు. బాల నటుడుగా మంచి గుర్తింపు తెచ్చుకున్న భరత్... ప్రస్తుతం పలు చిత్రాల్లో కీలక పాత్రల్లో నటిస్తూ మెప్పిస్తున్న విషయం తెల్సిందే.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

బిజినెస్

విదేశీ కంపెనీలపై పారాహుషార్

● విదేశీ పెట్టుబడులపైనా సమీక్ష

న్యూఢిల్లీ: దొడ్డి దారిన భారత కంపెనీలను చేజిక్కించుకునే విదేశీ కంపెనీలకు చెక్ పెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటికే ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలనూ సమీక్షిస్తున్నట్లు సమాచారం. దాదాపు తుది దశకు చేరిన కొత్త నిబంధనలను ప్రభుత్వం త్వరలోనే ప్రకటిస్తుందని భావిస్తున్నారు. చైనాతో సహా భారత్‌తో భూ, సముద్ర సరిహద్దులు ఉన్న దేశాల నుంచి వచ్చే ఎఫ్‌డీఐపై ఇప్పటికే అనేక ఆంక్షలు ఉన్నాయి. ఈ కంపెనీలు భారత్‌లో సొంత కంపెనీలు పెట్టాలన్నా లేదా స్థానిక సంస్థలతో కలిసి జాయింట్ వెంచర్ కంపెనీలు ఏర్పాటు చేయాలన్నా ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి. అయినా చైనాకు చెందిన కొన్ని కంపెనీలు దొడ్డి దారిన దేశీయ కంపెనీల ముసుగులో భారత్‌లో తమ సొంత వ్యాపారాలు ఏర్పాటు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎఫ్‌డీఐ నిబంధనలను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. కొత్త నిబంధనలతో దేశంలోని విదేశీ కంపెనీలు తమ వాటాలు బదిలీ చేయాలన్నా ప్రభుత్వ ముందస్తు అనుమతిని తప్పనిసరి చేయబోతున్నారు.

‘సుప్రీం’లో టెల్కోలకు చుక్కెదురు

ఏజీఆర్ బకాయిల రద్దుకు నో
ప్రభుత్వం ఆదుకుంటే అడ్డురాం



న్యూఢిల్లీ: దేశంలోని టెలికాం కంపెనీల (టెల్కో)కు సుప్రీంకోర్టులో మరోసారి చుక్కెదురైంది. తమ సర్దుబాటు స్థూల ఆదాయం (ఏజీఆర్)పై చెల్లించాల్సిన బకాయిల నుంచి మినహాయింపు ఇప్పించాలన్న వొడాఫోన్ ఐడియా, భారతి ఎయిర్‌టెల్, టాటా టెలిసర్వీసెస్ విజ్ఞప్తిని సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఏజీఆర్ బకాయిలపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును టెల్కోలు పొరపాటుగా అర్థం చేసుకున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ‘ఈ పిటిషన్లు చూస్తుంటే ఆందోళన, ఆశ్చర్యం కలుగుతోంది. ఒక బహుళజాతి కంపెనీ (ఎంఎన్‌సీ) ఇలాంటి పిటిషన్ దాఖలు చేస్తుందని ఊహించలేం. ఈ పిటిషన్‌ను మేము డిస్మిస్ చేస్తున్నాం’ అని వొడాఫోన్ ఐడియాకు సుతిమెత్తగా చీవాట్లు పెట్టింది. అయితే ఈ పిటిషన్ విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆర్థిక కష్టాల్లో ఉన్న టెల్కోలను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు వస్తే తాము అడ్డురామని వొడాఫోన్ కంపెనీ తరఫున వాదించిన సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గికి ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వానికి ఆదుకోవాలని ఉన్నా ఏజీఆర్ బకాయిలపై 2021 జూలైలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు అందుకు అడ్డంకిగా ఉందని రోహత్గి ధర్మాసనానికి చెప్పారు. దాంతో ధర్మాసనం ఈ విషయంపై స్పష్టతనిచ్చింది. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ప్రభుత్వం వొడాఫోన్ ఐడియాను ఆదుకునేందుకు కొత్త చర్యలు ఏవైనా తీసుకునే అవకాశం ఉందనే ఆశలు చిగురిస్తున్నాయి.

ఇదీ కేసు

కేంద్ర టెలికాం శాఖ (డాట్) తమ సర్దుబాటు స్థూల ఆదాయం (ఏజీఆర్) లెక్కించేటప్పుడు ప్రధాన వ్యాపారం ఆదాయాన్ని తప్ప, ఇతర ఆదాయాలను లెక్కలోకి తీసుకోకూడదని టెల్కోలు గతంలో సుప్రీంకోర్టుని ఆశ్రయించాయి. అయితే 2021 జూలైలో కోర్టు ఈ వాదనను తోసిపుచ్చింది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.93,000 కోట్లకు పైగా ఏజీఆర్ బకాయిలను 10 సంవత్సరాల్లో ఏటా 10 శాతం చొప్పున చెల్లించాలని ఊరట ఇచ్చింది. ఆ విషయంలో కూడా వొడాఫోన్ ఐడియా విఫలమైంది. దీంతో ఈ బకాయిల్లో కొంత భాగాన్ని ప్రభుత్వం కంపెనీ మూలధనం (ఈక్విటీ)లో తన వాటాగా మార్చుకుంది. ప్రస్తుతం వొడాఫోన్ ఐడియా ఈక్విటీలో ప్రభుత్వానికి 48.99 శాతం వాటా ఉంది. 2021 జూలై నాటి తీర్పును సమీక్షించాలని వొడాఫోన్ ఐడియా ఈ ఏడాది జనవరిలో సుప్రీంకోర్టును ఆశ్రయించినా నిరాశే మిగిలింది. ఈ విషయంలో వొడాఫోన్‌కు మినహాయింపు ఇస్తే దాన్ని తమకూ వర్తింప చేయాలని ఎయిర్‌టెల్, టాటా టెలిసర్వీసెస్ సుప్రీంకోర్టును కోరాయి. అయితే సుప్రీంకోర్టు సోమవారం ఎవరికీ ఎలాంటి మినహాయింపు ఇవ్వలేదు.

షేర్లు ధమాల్

సుప్రీం తీర్పుతో వొడాఫోన్ ఐడియా షేర్లు సోమవారం తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈలో ఒక దశలో కంపెనీ షేర్లు 12.21 శాతం నష్టపోయి రూ.6.47 వద్ద ఇంట్రాడే కనిష్ఠ స్థాయిని తాకాయి. చివరికి 8.68 శాతం నష్టంతో రూ.6.78 వద్ద ముగిశాయి. దీంతో కంపెనీ షేర్ల మార్కెట్ విలువ రూ.6,933.95 కోట్లు తగ్గి రూ.72,914.86 కోట్లకు చేరింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇండస్ టవర్స్ షేర్లు 2.87 శాతం, టాటా టెలీ షేర్లు 0.46 శాతం నష్టపోయాయి. ఎయిర్‌టెల్ షేర్లలోనూ తీవ్ర అమ్మకాల ఒత్తిడి కనిపించింది. చివరికి 0.17 శాతం స్వల్ప లాభంతో రూ.1,817.40 వద్ద ముగిశాయి.

ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు

» సెన్సెక్స్ 271 పాయింట్లు డౌన్
» 25,000 దిగువకు నిఫ్టీ

ముంబై: ఐటీ, బ్యాంకింగ్ రంగ షేర్లలో అమ్మకాల కారణంగా భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా రెండో రోజు నష్టపోయాయి. అమెరికా పరపతి రేటింగ్‌ను మూడీస్ ‘ట్రిపుల్ ఏ’ నుంచి ‘ఏఏ1’కు తగ్గించిన నేపథ్యంలో అంతర్జాతీయంగా ట్రేడింగ్ సెంటిమెంట్ బలహీనపడటం కూడా మన మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది. సోమవారం ట్రేడింగ్ ముగిసే సరికి, సెన్సెక్స్ 271.17 పాయింట్లు కోల్పోయి 82,059.42 వద్దకు జారుకుంది. నిఫ్టీ 74.35 పాయింట్ల నష్టంతో 24,945.45 వద్ద స్థిరపడింది. దాంతో సూచీ 25,000 కీలక స్థాయిని మళ్లీ చేజార్చుకుంది. బీఎస్ఈలోని 30 నమోదిత కంపెనీల్లో 18 నష్టపోయాయి.

ఈ నెలలో 6 ఐపీఓలు

రూ.11,000 కోట్ల సమీకరణ

ప్రైమరీ మార్కెట్లో మళ్లీ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)ల సందడి మొదలైంది. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలోని ప్రధాన ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో షేర్లను నమోదు చేయాలనుకుంటున్న 6 కంపెనీలు ఈ నెలలో ఐపీఓకు రానున్నట్లు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ వర్గాలు తెలిపాయి. ఈ ఆరు కంపెనీలు మార్కెట్ నుంచి రూ.11,669 కోట్ల వరకు నిధులు సమీకరించనున్నాయని వారన్నారు. ఈనెలలో ఐపీఓ ప్రారంభించనున్న కంపెనీల జాబితాలో ‘ది లీలా’ బ్రాండ్‌నేమ్‌తో లగ్జరీ హోటళ్లను నిర్వహించే స్క్లోస్ బెంగళూరు, బొరానా వీవ్స్, బెల్‌రైజ్ ఇండస్ట్రీస్, ఏజీస్ వోపక్ టెర్మినల్స్, అరిస్ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ లిమిటెడ్, స్కోడా ట్యూబ్స్ ఉన్నాయి. బొరానా వీవ్స్, బెల్‌రైజ్ ఇప్పటికే తమ ఐపీఓ ధరల శ్రేణిని సైతం ప్రకటించగా.. మిగతా కంపెనీలు ఈ వారంలో వెల్లడించే అవకాశాలున్నాయి. స్క్లోస్ బెంగళూరు ఐపీఓ ద్వారా రూ.5,000 కోట్లు సమీకరించనుంది. ఏజీస్ వోపక్ టెర్మినల్స్ రూ.3,500 కోట్లు, అరిస్ఇన్‌ఫ్రా రూ.600 కోట్లు, స్కోడా ట్యూబ్స్ రూ.275 కోట్లు సేకరించనున్నాయి.

రికార్డు స్థాయికి ఫండ్ ఆస్తులు

» 2024-25 ఆర్థిక సంవత్సరంలో 23% వృద్ధితో రూ.65.74 లక్షల కోట్లకు చేరిక
» యాంఫీ వార్షిక నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశీయ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) రంగ మొత్తం ఆస్తులు ఏకంగా రూ.12 లక్షల కోట్లకు పైగా లేదా 23 శాతం వృద్ధి చెంది సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.65.74 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఈక్విటీ, డెట్ మార్కెట్లు మంచి ప్రతిఫలాలు అందిస్తున్న నేపథ్యంలో మదుపర్లు సమృద్ధిగా పెట్టుబడులు పెట్టడం, మార్క్ టు మార్కెట్ గెయిన్స్ (ఎంటీఎం) ఇందుకు తోడ్పడ్డాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24) చివరి నాటికి ఫండ్ ఆస్తులు రూ.53.40 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరంలో నిఫ్టీ-50 టీఆర్ఐ (టోటల్ రిటర్న్ ఇండెక్స్) 6 శాతంగా, సెన్సెక్స్ టీఆర్ఐ 5.9 శాతంగా నమోదైందని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) సోమవారం విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించింది. అంతేకాదు, గతసారి ఫండ్ల పథకాల్లోకి నికరంగా రూ.8.15 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	124
వరంగల్	125	గుంటూరు	127
కరీంనగర్	125	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	122
కర్నూలు	125	నెల్లూరు	127
విశాఖపట్నం	121	అనంతపురం	127
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,100 ▼	87,550 ▲	1,09,000 ▲
విజయవాడ	96,500 ▼	88,800 ▼	97,500 ▼
విశాఖపట్నం	96,800 ▲	87,850 ▲	1,09,000 ▲
రాజమండ్రి	95,510 ▲	87,550 ▲	98,400 ▲
ప్రొద్దుటూరు	95,400 ▲	87,770 ▲	98,000 ▼
ముంబై	93,785 ▲	85,907 ▲	95,755 ▲

యూకో బ్యాంక్ మాజీ సీఎండీ గోయల్ అరెస్ట్

మనీలాండరింగ్ అభియోగాలపై అదుపులోకి తీసుకున్న ఈడీ

న్యూఢిల్లీ: బ్యాంకు రుణ మోసం కేసులో మనీలాండరింగ్ అభియోగాలపై యూకో బ్యాంక్ మాజీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సుబోధ్ కుమార్ గోయల్‌ను అరెస్ట్ చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం వెల్లడించింది. కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ (సీఎస్‌పీఎల్), ఇతరులపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా గోయల్‌ను ఈ నెల 16న ఆయన నివాసంలో అరెస్ట్ చేసినట్టు పేర్కొంది. 17న కోల్‌కతాలోని పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టులో గోయల్‌ను హాజరు పరచగా.. మే 21 వరకు ఈడీ కస్టడీకి కోర్టు అప్పగించినట్టు తెలిపింది. ఈడీ తన దర్యాప్తులో భాగంగా గత ఏప్రిల్‌లో గోయల్‌తో పాటు మరికొందరి ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించింది. గోయల్ యూకో బ్యాంక్ సీఎండీగా ఉన్నప్పుడు సీఎస్‌పీఎల్‌కు రూ.6,210.72 కోట్ల రుణాలు మంజూరు చేయగా ఆ సంస్థ ఆ మొత్తాలను దారి మళ్లించినట్టు ఈడీ పేర్కొంది. ప్రతిగా సీఎస్‌పీఎల్ నుంచి గోయల్ ముడుపులు అందుకున్నట్టు ఆరోపించింది. సీఎస్‌పీఎల్‌కు క్రెడిట్ ఫెసిలిటీలను మంజూరు చేయడం, తర్వాత భారీ ఎత్తున రుణ మొత్తాల మళ్లింపునకు సంబంధించి సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	550
వరంగల్	532	గోదావరి	540
చిత్తూరు	623	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ. 72	

దొడ్ల డెయిరీ లాభం రూ.68 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దొడ్ల డెయిరీ.. మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.67.96 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 45.12 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ.787.44 కోట్ల నుంచి రూ.909.62 కోట్లకు పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.3,720.10 కోట్ల ఆదాయంపై రూ.259.90 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ లాభం తొలిసారిగా రూ.200 కోట్ల మైలురాయిని అధిగమించిందని దొడ్ల డెయిరీ ఎండీ సునీల్ రెడ్డి తెలిపారు. కాగా రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.2 (20 శాతం) డివిడెండ్‌ను అందించేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపిందన్నారు.

కేవీబీ లాభంలో 13 శాతం వృద్ధి

చెన్నై: కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.513 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.456 కోట్లు)తో పోల్చితే లాభం 13 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.2,813 కోట్ల నుంచి రూ.3,025 కోట్లకు పెరిగింది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను లాభం 21 శాతం వృద్ధితో రూ.1,605 కోట్ల నుంచి రూ.1,942 కోట్లకు పెరిగిందని కేవీబీ తెలిపింది. కాగా రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.2.60 (130 శాతం) డివిడెండ్‌ను బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

మా ఆర్థిక పరిస్థితి గ్రీస్ కంటే ఘోరం

జపాన్ ప్రధాని షిగేరు ఇషిబా

టోక్యో: జపాన్ కూడా ఆర్థిక సంక్షోభానికి చేరువైంది. తమ దేశ ఆర్థిక పరిస్థితి గ్రీస్ కంటే ఘోరంగా ఉందని సాక్షాత్తూ ఆ దేశ ప్రధాని షిగేరు ఇషిబా ప్రకటించారు. ప్రభుత్వ అప్పుల భారం జీడీపీలో 260 శాతాన్ని మించి పోయిందన్నారు. జీ-7 సంపన్న దేశాల్లో మరే దేశ ప్రభుత్వ రుణ భారం ఈ స్థాయిలో లేదు. వృద్ధుల జనాభా పెరిగిపోవడం, సంక్షేమ పథకాల భారం గుదిబండలా మారడం, పెరిగిపోతున్న వడ్డీ రేట్లు ఇందుకు కారణమని ప్రధాని స్పష్టం చేశారు. ఇక అప్పులు చేసి పన్నుల కోత సాధ్యం కాదని చెప్పారు. 2010లో జపాన్ రుణ భారం జీడీపీలో 218 శాతానికి చేరినప్పుడూ అప్పటి ప్రధాని ఇలానే హెచ్చరించారు.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్

చెన్నై X రాజస్థాన్ — వేదిక ఢిల్లీ — రా.7.30 నుంచి

అవన్నీ వదంతులే!

ఆసియాకప్ బాయ్‌కాట్ ఊహాగానాలను ఖండించిన బీసీసీఐ

న్యూఢిల్లీ: ఈ ఏడాది సెప్టెంబరులో జరిగే ఆసియాకప్ నుంచి భారత్ వైదొలగుతున్నదంటూ వస్తున్న వదంతులను బీసీసీఐ ఖండించింది. ఇండో-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆసియాకప్, మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియాకప్ టోర్నీల నుంచి తప్పుకోవాలని బీసీసీఐ నిర్ణయించుకున్నదంటూ సోమవారం జోరుగా పుకార్లు వినిపించాయి. ప్రస్తుతం ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) చీఫ్‌గా పాకిస్థాన్ మంత్రి, పీసీబీ చైర్మన్ మొహిసిన్ నక్వీ ఉండడమే ఈ వదంతులకు కారణంగా తెలుస్తోంది. ‘ఆసియాకప్ ఈవెంట్ల నుంచి బీసీసీఐ తప్పుకోనుందంటూ ఊహాజనిత వార్తలు ఉదయం నుంచి చక్కర్లు కొడుతున్నాయి. కానీ, వాటిల్లో నిజం లేదు. ప్రస్తుతం మా దృష్టంతా ఐపీఎల్, ఆ తర్వాత ఇంగ్లండ్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌పైనే. ఏదైనా నిర్ణయం తీసుకొంటే అధికారికంగా ప్రకటన చేస్తామ’ని బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా తెలిపాడు.

మందు మానేశా!


బెన్ స్టోక్స్

లండన్: గతేడాది డిసెంబరులో గాయపడిన ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ ప్రస్తుతం పూర్తి స్థాయిలో కోలుకున్నాడు. ఈనెల 22 నుంచి జింబాబ్వేతో జరిగే ఏకైక టెస్టులో ఆడబోతున్నాడు. అయితే గాయాల నుంచి కోలుకునేందుకు చాలా కష్టపడాల్సి వస్తోందని స్టోక్స్ తెలిపాడు. కివీస్ టూర్‌లో తొడకండరాల గాయం తర్వాత తాను మద్యం మానేశానని తెలిపాడు. ఎందుకంటే 2023లోనూ ఇదే గాయానికి గురి కావడంతో ఈసారి జాగ్రత్త పడాలని భావించినట్టు స్టోక్స్ చెప్పాడు. అత్యుత్తమ ఫిట్‌నెస్ అందుకోవడానికే ఇలా చేశానని, అయితే శాశ్వతంగా మందు మానేసే ఆలోచన మాత్రం లేదని తేల్చాడు.

సింధు, ప్రణయ్ ఆట

గాడిలో పడేనా?

నేటినుంచి మలేసియా మాస్టర్స్



కౌలాలంపూర్: సుదీర్ఘ కాలంగా ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, హెచ్ఎస్ ప్రణయ్ మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలోనైనా పుంజుకోవాలని పట్టుదలగా ఉన్నారు. మంగళవారం ఇక్కడ ప్రారంభమయ్యే టోర్నీలో జపాన్‌కు చెందిన నట్సుకి నిదైరాతో సింధు తొలి రౌండ్‌లో తలపడనుంది. ప్రణయ్‌కు మొదటి రౌండ్‌లోనే ఐదో సీడ్, కెంటా నిషిమోటో (జపాన్) రూపంలో కఠినమైన ప్రత్యర్థి ఎదురు కానున్నాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోడ్, ఉన్నతి హుడా, ఆకర్షి కశ్యప్, పురుషుల సింగిల్స్‌లో సతీష్ కరుణాకరన్, ప్రియాన్షు రజావత్ బరిలో నిలిచారు. మిక్స్‌డ్‌లో ధ్రువ్ కపిల/తనీష, రోహన్/రుత్విక శివానీ, పురుషుల డబుల్స్‌లో హరిహరన్/రూబన్ తలపడుతున్నారు. ప్రపంచ మాజీ నెం.1 కిడాంబి శ్రీకాంత్, తరుణ్ క్వాలిఫయింగ్ రౌండ్ల ద్వారా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

లఖ్‌నవూ ఇంటికి

సన్‌రైజర్స్ చేతిలో ఓటమి
ప్లేఆఫ్స్ రేసు నుంచి అవుట్
అభిషేక్ మెరుపు ఇన్నింగ్స్





1 ఐపీఎల్‌లో తక్కువ బంతుల్లో (2381)నే 150 వికెట్లు తీసిన బౌలర్‌గా హర్షల్ పటేల్.

1 ఐపీఎల్ సీజన్‌లో ముగ్గురు విదేశీ ఆటగాళ్లు (మార్ష్, మార్‌క్రమ్, పూరన్) 400+ స్కోర్లు నమోదు చేయడం ఇదే తొలిసారి.

లఖ్‌నవూ: ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ పోరాటం కూడా ముగిసింది. ప్లేఆఫ్స్‌లో మిగిలిన ఒక్క బెర్త్ కోసం రేసులో ఉండాలంటే కచ్చితంగా గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో ఎల్ఎస్‌జీ బోల్తా పడింది. సోమవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్లతో ఓడింది. దీంతో 12 మ్యాచ్‌లు 10 పాయింట్లతో అధికారికంగా పంత్ సేన ప్లేఆఫ్స్ రేసు నుంచి వైదొలిగింది. అటు భారీ ఛేదనలో అభిషేక్ శర్మ (20 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 59)తో పాటు రైజర్స్ బ్యాటర్లు కలిసికట్టుగా కదం తొక్కడంతో వీరికి నాలుగో విజయం దక్కింది. ముందుగా లఖ్‌నవూ 20 ఓవర్లలో 7 వికెట్లకు 205 పరుగులు చేసింది. మార్ష్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 65), మార్‌క్రమ్ (38 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 61) అర్ధసెంచరీలు సాధించగా, పూరన్ (26 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 45) ఆకట్టుకున్నాడు. ఎషాన్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో సన్‌రైజర్స్ 18.2 ఓవర్లలో 4 వికెట్లకు 206 రన్స్ చేసి గెలిచింది. క్లాసెన్ (28 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 47), ఇషాన్ (28 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 35), కమిందు (21 బంతుల్లో 3 ఫోర్లతో 32 రిటైర్డ్ హర్ట్) రాణించారు. దిగ్వేష్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అభిషేక్ నిలిచాడు.

చెలరేగిన అభిషేక్: భారీ ఛేదనలో రైజర్స్ ఓపెనర్ అభిషేక్ శర్మ విధ్వంసకర ఆటను ప్రదర్శించగా, మిగతా బ్యాటర్లంతా సహకారమందించారు. ఇక హెడ్ స్థానంలో ఓపెనర్‌గా వచ్చిన అథర్వ (13) రెండో ఓవర్‌లోనే వెనుదిరిగినా శర్మ మాత్రం జోరు ఆపలేదు. మూడో ఓవర్‌లో 4,6,4తో 17 రన్స్ అందించాడు. ఓరౌర్కీ ఓవర్‌లోనూ 4,6 బాదడంతో పవర్‌ప్లేలో స్కోరు 72/1కి చేరింది. ఆ తర్వాత కూడా అభిషేక్ ఎదురుదాడి ఆగలేదు. బిష్ణోయ్ వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో వరుసగా 4 సిక్సర్లతో 26 రన్స్ రాబట్టడంతో 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తయ్యింది. ప్రమాదకరంగా మారిన తనను దిగ్వేష్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు ఇషాన్‌తో 82 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మార్‌క్రమ్ ఓవర్‌లో 4,6 బాదిన ఇషాన్‌ను దిగ్వేష్ అవుట్ చేశాడు. అయితే క్లాసెన్ చెలరేగి లక్ష్యాన్ని సులువు చేశాడు. కమిందు సహకారం అందిస్తూ 14వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో ఆకట్టుకున్నాడు. అయితే రెండు వరుస ఫోర్ల తర్వాత క్లాసెన్‌ను శార్దూల్ అవుట్ చేసినా అప్పటికి సమీకరణం 15 బంతుల్లో 11 పరుగులే కావడంతో రైజర్స్ విజయానికి ఇబ్బంది లేకుండా పోయింది.

ఓపెనర్ల శతక భాగస్వామ్యం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూకు ఓపెనర్లు మార్ష్, మార్‌క్రమ్ అదిరే ఆరంభాన్ని అందించారు. తొలి పది ఓవర్లపాటు రైజర్స్ బౌలర్లపై ఈ జోడీ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. వీరి జోరు చూస్తే స్కోరు సునాయాసంగా 220 దాటుతుందనిపించింది. కానీ డెత్ ఓవర్లలో 45 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. పూరన్ దాదాపు చివరిదాకా ఉన్నా 200+ స్కోరు కోసం కష్టపడాల్సి వచ్చింది. మొదట్లో మార్ష్ దూకుడు కనబరుస్తూ తొలి ఓవర్‌లో 4,6.. రెండో ఓవర్‌లో మరో సిక్సర్ బాదాడు. అటు స్పిన్నర్ హర్ష్ దూబే ఓవర్‌లో మార్‌క్రమ్ 6,4తో జోరు చూపాడు. వీరి బౌండరీల ధాటికి పవర్‌ప్లేలో జట్టు 69 పరుగులకు చేరింది. అలాగే 28 బంతుల్లో మార్ష్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. తొమ్మిదో ఓవర్‌లో మార్‌క్రమ్ క్యాచ్‌ను అనికేత్ వదిలేశాడు. అదే ఓవర్‌లో జట్టు స్కోరు వందకి చేరింది. ఇక తర్వాతి ఓవర్‌లో మార్ష్ ఆడిన బంతిని హర్షల్ రిటర్న్ క్యాచ్ తీసుకున్నా.. రీప్లేలో బంతి నేలకు తాకినట్టు తేలడంతో బతికిపోయాడు. అయితే 11వ ఓవర్‌లో మార్ష్‌ను పెవిలియన్‌కు చేర్చిన హర్ష్ జట్టుకు రిలీఫ్ నిచ్చాడు. దీంతో 63 బంతుల్లో తొలి వికెట్‌కు 115 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం ఎల్ఎస్‌జీ తడబడింది. కెప్టెన్ పంత్ (7) ఎప్పటిలాగే నిరాశపర్చాడు. ఎషాన్ మలింగ స్టన్నింగ్ రిటర్న్ క్యాచ్‌తో అతడికి షాకిచ్చాడు. 16వ ఓవర్‌లో మార్‌క్రమ్ రెండు సిక్సర్లు బాది జోరు పెంచాలని చూసినా హర్షల్ అతడిని అవుట్ చేశాడు. అటు మలింగ రెండు పరుగులే ఇచ్చి హిట్టర్ బదోని (3)ని పెవిలియన్‌కు చేర్చాడు. ఇక ఆఖరి ఓవర్‌లో పూరన్, శార్దూల్ (4) రనౌట్ కాగా సమద్ (3)ను నితీశ్ బౌల్డ్ చేశాడు. అయినా ఆఖరి బంతికి ఆకాశ్ (6 నాటౌట్) సిక్సర్‌తో మురిపించాడు. మొత్తంగా చివరి రెండు ఓవర్లలో 35 పరుగులు రావడంతో లఖ్‌నవూ స్కోరు 200 దాటగలిగింది.

దిగ్వేష్ X అభిషేక్



రైజర్స్ ఓపెనర్ అభిషేక్.. లఖ్‌నవూ స్పిన్నర్ దిగ్వేష్ రాఠీ మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. 8వ ఓవర్‌లో అతడిని అవుట్ చేసిన రాఠీ అతడిని వెళ్లిపో అన్నట్టు చేతులు ఊపుతూ సిగ్నేచర్ స్టయిల్లో సంబరాలు చేసుకున్నాడు. దీంతో డగౌట్‌కు వెళుతున్న అభిషేక్ వెనక్కి రాగా.. దిగ్వేష్ కూడా ఏమిటంటూ ముందుకు వెళ్లాడు. వెంటనే అంపైర్లు కలుగజేసుకుని ఇద్దరినీ శాంతింపచేశారు. ఆ తర్వాత ఇషాన్‌ను అవుట్ చేశాక కూడా రాఠీ డగౌట్ వైపు చూపిస్తూ చేతులు ఊపడం కనిపించింది.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్ష్ (సి) మలింగ (బి) హర్ష్ దూబే 65, మార్‌క్రమ్ (బి) హర్షల్ 61, పంత్ (సి అండ్ బి) మలింగ 7, పూరన్ (రనౌట్) 45, బదోని (సి) నితీశ్ (బి) మలింగ 3, సమద్ (బి) నితీశ్ 3, శార్దూల్ (రనౌట్) 4, బిష్ణోయ్ (నాటౌట్) 0, ఆకాశ్‌దీప్ (నాటౌట్) 6, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 205/7; వికెట్ల పతనం:** 1-115, 2-124, 3-159, 4-169, 5-194, 6-199, 7-199; **బౌలింగ్:** కమిన్స్ 4-0-34-0, హర్ష్ దూబే 4-0-44-1, హర్షల్ 4-0-49-1, మలింగ 4-0-28-2, జీషన్ 2-0-22-0, నితీశ్ 2-0-28-1.

సన్‌రైజర్స్: అథర్వ (సి) దిగ్వేష్ (బి) ఓరౌర్కీ 13, అభిషేక్ శర్మ (సి) శార్దూల్ (బి) దిగ్వేష్ 59, ఇషాన్ (బి) దిగ్వేష్ 35, క్లాసెన్ (సి) పంత్ (బి) శార్దూల్ 47, మెండిస్ (రిటైర్డ్ హర్ట్) 32, అనికేత్ (నాటౌట్) 5, నితీశ్ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 18.2 ఓవర్లలో 206/4; వికెట్ల పతనం:** 1-17, 2-99, 3-140, 4-195, 4-197 (రిటైర్డ్ హర్ట్); **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 3-0-33-0, విల్ ఓరౌర్కీ 2.2-0-31-1, దిగ్వేష్ రాఠీ 4-0-37-2, అవేశ్ 3-0-25-0, రవి బిష్ణోయ్ 1-0-26-0, మార్‌క్రమ్ 1-0-14-0, శార్దూల్ ఠాకూర్ 4-0-39-1.

గంభీర్ వల్లే శ్రేయాస్‌కు ఆ ఘనత దక్కలేదు



న్యూఢిల్లీ: టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్‌పై దిగ్గజ బ్యాటర్ గవాస్కర్ విమర్శనాస్త్రాలు సంధించాడు. గత ఏడాది కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఐపీఎల్ టైటిల్ అందించినా..జట్టు మెంటార్‌గా ఉన్న గంభీర్ వల్ల అతడికి ఆ క్రెడిట్ దక్కలేదని వ్యాఖ్యానించాడు. ఇక ఈసారి సారథిగా పంజాబ్ కింగ్స్‌ను శ్రేయాస్ ప్లేఆఫ్స్‌కు చేర్చాడు. ‘గత సీజన్‌లో నైట్‌రైడర్స్ ఐపీఎల్ టైటిల్ సొంతం చేసుకున్నా కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్‌కు తగిన గుర్తింపు రాలేదు. మరొకరికి ఆ కీర్తి లభించింది. మైదానంలో ఉండి జట్టును నడిపించే కెప్టెన్‌దే ప్రధాన పాత్ర. డగౌట్‌లో కూర్చునే వ్యక్తిది కాదు’ అని గంభీర్‌నుద్దేశించి గవాస్కర్ చెప్పుకొచ్చాడు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో..

అమ్మానాన్న పీఓకేలో ఉన్నారు


మొయిన్ అలీ

లండన్: ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైన సమయంలో తన తల్లిదండ్రులు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ఉన్నారని కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ వెల్లడించాడు. ‘ఆ సమయంలో నా తల్లిదండ్రులు అక్కడ ఉన్నారు. వారు ఉన్న ప్రాంతానికి గంట ప్రయాణ దూరంలోనే దాడులు జరిగాయి. అందుబాటులో ఉన్న విమానమెక్కి వారు ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోయారు. అప్పుడు కానీ నా మనస్సు కుదుటపడలేదు’ అని మొయిన్ తెలిపాడు. మొయిన్ అలీ తాత పీఓకేలోని మిర్పూర్‌కు చెందిన వారు. ఆయన చిన్నతనంలోనే బ్రిటన్ వెళ్లి స్థిరపడ్డారు. ఓ బ్రిటిష్ మహిళను మొయిన్ తాత వివాహం చేసుకున్నారు. బర్మింగ్‌హామ్‌లో మొయిన్ అలీ జన్మించాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	12	9	3	0	18	0.795
బెంగళూరు	12	8	3	1	17	0.482
పంజాబ్	12	8	3	1	17	0.389
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	12	6	5	1	13	0.260
కోల్‌కతా	13	5	6	2	12	0.193
లఖ్‌నవూ	12	5	7	0	10	-0.506
హైదరాబాద్	12	4	7	1	9	-1.005
రాజస్థాన్	13	3	10	0	6	-0.701
చెన్నై	12	3	9	0	6	-0.992

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్



అమెరికాలో తన కుమారులు, భర్తతో ఎమ్మెల్సీ కవిత

పుత్రోత్సాహంలో.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత..!

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): 'ఆదిత్యా.. నీ చిట్టిచేతిని పట్టుకోవడం నుంచి ఇప్పుడు నువ్వు డిగ్రీపట్టా అందుకోవడం వరకు ఎంత గొప్ప ప్రయాణం' అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఎక్స్ వేదికగా తన పుత్రోత్సాహాన్ని చాటారు. తన పెద్దకుమారునికి గ్రాడ్యుయేషన్‌కు సంబంధించిన ఫోటోను పోస్ట్ చేశారు. అమెరికాలోని ఓక్‌ఫారెస్ట్ యూనివర్సిటీ నుంచి తమ పెద్దకుమారుడు ఆదిత్య గ్రాడ్యుయేషన్ పట్టాను అందుకున్నాడు. సోమవారం అమెరికాలో జరిగిన ఈ కార్యక్రమానికి కవిత, అనిల్ కుమార్ దంపతులు హాజరయ్యారు. ఒక తల్లిగా ఎంతో గర్వపడుతున్నానని, ఎక్కడా లేని ఆనందం కలిగిందని కవిత సంతోషం వ్యక్తం చేశారు.

5 డీఏలను జూన్ 2లోపు విడుదల చేయాలి

రాష్ట్ర ప్రభుత్వానికి ఎంప్లాయీస్ కో-ఆర్డినేషన్ కమిటీ విజ్ఞప్తి

బర్కత్‌పుర, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను జూన్ 2వ తేదీలోగా విడుదల చేయాలని తెలంగాణ ఎంప్లాయీస్ కో-ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పీఆర్సీ గడువు ముగిసి రెండేళ్లు అయిందని, వెంటనే పీఆర్సీని ప్రకటించాలని కోరింది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణ ఎంప్లాయీస్ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు మాట్లాడారు. పెన్షనర్లకు రూ.8 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగులు, జర్నలిస్టులు, పెన్షనర్లకు క్యాష్‌లెస్ వైద్యం అందించాలని, హెల్త్‌కార్డులు వెంటనే జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు.



యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయ ఆవరణలో పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు

ప్రధాని వైఖరితో ప్రజాస్వామ్యం అపహాస్యం

» ప్రతిపక్ష ఎంపీల ఎంపికలో కేంద్రం విఫలం:రాఘవులు

యాదాద్రి, రాంనగర్, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రధాని మొండి వైఖరితో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు విమర్శించారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలోని పార్టీ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాన్ని రాఘవులు ఆవిష్కరించి మాట్లాడారు. ఉగ్రవాదంపై దేశ వైఖరిని ప్రపంచానికి తెలిపేందుకు పంపే ప్రతిపక్ష ఎంపీల ఎంపికలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రతిపక్ష ఎంపీలను ప్రధాని ఎంపిక చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేగాక రాజకీయ లబ్ధి కోసం పాకులాడటమేనని ధ్వజమెత్తారు. దేశంలోని ఆయా పార్టీల మధ్య అంతర్గత చిచ్చురేపేందుకు ఆలోచన చేశారని, ప్రతిపక్షాలతో ఇప్పటివరకు సమావేశం కూడా ఏర్పాటు చేయలేదన్నారు. పీడిత ప్రజల కోసం పోరాడిన పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శనేత అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ కొనియాడారు. సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం సుందరయ్య పార్కులో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి వేడుకల్లో జాన్‌వెస్లీ మాట్లాడారు.

'ప్రైవేట్' ఫీజుల నియంత్రణకు చట్టం: కోదండ

పంజాగుట్ట, మే19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలని, ఇందుకోసం తన వంతు ప్రయత్నం చేస్తానని టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం, హైదరాబాద్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్, నెట్‌వర్క్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్, దళిత బహుజన ఫ్రంట్, ఎంవీ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలి' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. ఫీజుల నియంత్రణ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. గత ప్రభుత్వం వినేది కాదని.. ఈ ప్రభుత్వం మాత్రం వింటుందన్నారు. ఫీ'జులుం'ను అరికట్టాలని, ప్రైవేట్ విద్యా సంస్థలలో ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ సర్కారు ఉద్దేశమూ అదే..

» బీసీ బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చేలా
ఆర్.కృష్ణయ్యే చొరవ తీసుకోవాలి: జీవన్‌రెడ్డి

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉందని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్య, ఉద్యోగాల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి వీలుగా బిల్లులను ఆమోదించి.. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ కేంద్రానికి పంపిందన్నారు. ఈ విషయంలో బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య చొరవ చూపి.. ఆ పార్టీ కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలంటూ కృష్ణయ్య చేసిన వ్యాఖ్యలపై గాంధీభవన్‌లో జీవన్‌రెడ్డి ఈ మేరకు స్పందించారు. హైదరాబాద్ నగరంలో పాత కరెంటు వైర్లన్నీ మార్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు కోరారు. ఏళ్ల తరబడి ఉన్న వైరింగ్‌తో నిత్యం పాత ఇళ్లలోనే అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని.. ఈ సమస్యను సర్కారు సీరియస్‌గా తీసుకోవాలన్నారు.

రజతోత్సవ సభ కాదది.. విచ్ఛిన్న సభ!

» విపక్ష నేత పదవి ఇస్తేనే కష్టపడతానన్నట్లు హరీశ్ వైఖరి
» అదే జరిగితే తనకు
రాజకీయ గండమేనని కేటీఆర్ భయం: సామా



హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ.. ఆ పార్టీ విచ్ఛిన్న సభగా మారిందని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేటీఆర్ కంటే ఎక్కువ మంది ఎమ్మెల్యేల మద్దతున్న హరీశ్‌రావు వైఖరి.. ప్రతిపక్ష నేత పదవి ఇస్తేనే కష్ట పడతానన్నట్లుగా ఉందన్నారు. హరీశ్‌కు ఆ పదవి ఇస్తే.. భవిష్యత్తులో తనకు రాజకీయ గండం తప్పదన్న స్పష్టత కేటీఆర్‌లో ఉందని చెప్పారు. గాంధీభవన్‌లో మీడియాతో సామా మాట్లాడుతూ.. 'హరీశ్‌కు ప్రతిపక్ష నేత పదవి ఇస్తే బీజేపీతో కలిసి కేటీఆర్ రాజకీయ భవిష్యత్తును ఖతం పట్టిచ్చుడు ఖాయం. ఆలె నరేంద్ర నుంచి ఈటల రాజేందర్ వరకు నేతలను పార్టీ నుంచి కేసీఆర్ ఎలా పంపారో తెలిసిన హరీశ్.. ఆ భయంతో కేటీఆర్‌తో సంధి చేసుకుంటే.. హరీశ్ ఖేల్ ఖతం కావడమూ ఖాయం' అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబంలో కలహాలు తారస్థాయికి చేరాయని, ఎవరి ఉనికి కోసం వారు రాజకీయ చదరంగం ఆడుతున్నారన్నారు.

కేసీఆర్‌ను విచారించాకే కాళేశ్వరం నివేదిక!

» విచారించకుండా అభియోగాలు మోపడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమన్న అభిప్రాయం
» కాళేశ్వరం విచారణలో కీలక మలుపు
» విచారణ గడువు 2 నెలలు పొడిగింపు

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణాల్లో కీలక భూమిక పోషించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ చేశాకే.. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం ఈనెలాఖరున కమిషన్ గడువు ముగియనుంది. కేసీఆర్‌తో పాటు గత సర్కారులో మంత్రులుగా పనిచేసిన హరీశ్‌రావు, ఈటలను విచారించకుండానే కమిషన్‌కు లభించిన పత్రాల ఆధారంగా వారి పాత్రను నిర్ధారిస్తూ నివేదికను వారం రోజుల్లోపు ఇవ్వాలని కమిషన్ యోచించింది. ఈనెల 22వ తేదీ తర్వాత నివేదిక ఇచ్చేయాలని కమిషన్ ఇదివరకే సంకేతాలిచ్చింది. కానీ ఆకస్మాత్తుగా కమిషన్ విచారణ గడువును జూలై 31 దాకా పొడిగిస్తూ సోమవారం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా జీవో జారీ చేశారు. కాగా ఒక వ్యక్తిపై అభియోగాలు నమోదు చేస్తున్నప్పుడు... ఆ అభియోగాలపై సదరు వ్యక్తి సంజాయిషీ చెప్పుకోవడానికి అవకాశాలు ఇవ్వాలని సహజ న్యాయసూత్రాలు చెబుతున్నాయి. దాంతో ఆ న్యాయసూత్రాలను అనుసరించే కేసీఆర్‌ను విచారణకు పిలిచి, ఆయన అభిప్రాయాలు తీసుకున్నాకే ముందుకు వెళ్లాలని కమిషన్ యోచించినట్లు సమాచారం. ఆ మేరకు కేసీఆర్‌కు కమిషన్ సమన్లు పంపించే అవకాశాలున్నాయని, పంపాక వారం రోజుల్లోపు హాజరుకావాలని కమిషన్ కోరే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఇక ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలు, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లపై విచారణ జరిపిన జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కమిషన్ కూడా కేసీఆర్‌కు సమన్లు పంపించి, 'మీ మీద ఫలానా వ్యక్తులు ఆరోపణలు చేశారు... వారిని క్రాస్ ఎగ్జామినేషన్ చేయడానికి మీకు అవకాశం ఇస్తున్నాం' అంటూ ఆయన సమన్లు పంపించారు. అయితే విచారణ పూర్తికాకుండానే దోషిగా ప్రకటించేలా జస్టిస్ నర్సింహారెడ్డి ప్రకటనలు చేశారంటూ కేసీఆర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దాంతో జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి వ్యవహారశైలిపై సుప్రీంకోర్టు అభ్యంతరాలు తెలిపి... ఆయన్ను విచారణ నుంచి తప్పించింది. ఈ క్రమంలో విద్యుత్తు విచారణ కమిషన్ బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ మదన్ భీంరావు లోకూర్.. ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలు, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ నిర్మాణాలపై కేసీఆర్ సమర్థన ఇస్తూ రాసిన లేఖనే ఆయన అభిప్రాయాలుగా పరిగణనలోకి తీసుకున్నారు.

బాంబు పేలుళ్లకు..
రంపచోడవరంలో రిహార్సల్స్

'అహిం' సంస్థ పేరుతో కుట్రలు.. 'మ్యాజిక్ లాంతర్' పేరుతో సోషల్ మీడియాలో ఖాతా

» హైదరాబాద్, విజయనగరంలో వరుస పేలుళ్లకు కుట్ర!
» ఇంజనీరింగ్ చదువుతుండగానే.. ఐఎస్ వైపు ఆకర్షితులైన సిరాజ్, సమీర్
» వెల్లడించిన రిమాండ్ రిపోర్టు
» రంగంలోకి జాతీయ దర్యాప్తు సంస్థ

హైదరాబాద్/విజయనగరం/ఆరిలోవ(విశాఖ), మే 19 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ జంటపేలుళ్ల మాదిరిగా.. హైదరాబాద్, విజయనగరంలో వరుస పేలుళ్లకు భారీ కుట్ర జరిగింది. పేలుళ్లకు అవసరమైన ఐఈడీల తయారీకి అవసరమైన పరికరాలను సిద్ధం చేసుకున్నారు. అవసరమైన సరంజామాను ఆన్‌లైన్‌లో తెప్పించుకున్నారు. బాంబులను ఎలా పేల్చాలనేదానిపై రంపచోడవరం అడవుల్లో రిహార్సల్స్ చేశారు. సౌదీలో ఉండే ఉగ్రవాద నాయకుల ఆదేశాలతో.. పక్కా ప్రణాళికను అమలు చేసే ప్రయత్నంలో ఉండగా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులకు పట్టుబడ్డారు. ఆదివారం అరెస్టయిన విజయనగరానికి చెందిన సిరాజ్-ఉర్-రెహ్మాన్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్ రిమాండ్ రిపోర్ట్‌లో నిందితుల ఆర్థిక లావాదేవీలు సహా.. సంచలన విషయాలు వెల్లడయ్యాయి.

బీటెక్ చదువుతుండగా పరిచయం

హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదువుతున్న సమయంలో సిరాజ్, సమీర్ ఒకరికొకరు పరిచయమయ్యారు. వీరిద్దరూ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్రవాద సంస్థ వైపు ఆకర్షితులయ్యారు. బీటెక్ పూర్తయ్యాక సమీర్ సికింద్రాబాద్‌లో లిఫ్ట్ మెకానిక్‌గా పనిచేశాడు. ఈ క్రమంలో సౌదీలోని పలు ఉగ్రవాద సంస్థల హ్యాండ్లర్లతో సోషల్ మీడియాలో పరిచయం పెంచుకున్నాడు. సిరాజ్, సమీర్ సౌదీలోని ఐఎస్ హ్యాండ్లరు ఇచ్చే ఆదేశాలతో తెలుగురాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటకల్లోని ముస్లిం యువతను ఆకర్షించేందుకు అల్‌హింద్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్(అహిం) సంస్థను స్థాపించారు. సోషల్ మీడియాలో 'మ్యాజిక్ లాంతర్' పేరుతో ఖాతాను తెరిచి.. అహిం సంస్థలో సభ్యత్వాలిచ్చారు. అలా పదుల సంఖ్యలో యువకులు, మైనర్లను వీరు అహింలో చేర్చుకున్నారు. సౌదీలోని హ్యాండ్లర్ల ఆదేశాలతో హైదరాబాద్, విజయనగరంలో పేలుళ్లకు కుట్రలు పన్నారు. ఇందుకోసం సిరాజ్ రెండుసార్లు సౌదీ వెళ్లి వచ్చాడు. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న వీడియోల నుంచి పేలుడు పదార్థాల తయారీ, వాటిని పేల్చడంపై శిక్షణ తీసుకున్నాడు. తమ వ్యూహాన్ని అమలు చేయడానికి ముందు సికింద్రాబాద్‌లోని సమీర్ ఇంట్లో అహింసభ్యులు మూడ్రోజుల పాటు భేటీ అయ్యారు.

టిఫిన్ బాక్సు బాంబులు

సిరాజ్, సమీర్‌లు బాంబుల తయారీకి అమ్మోనియా, సల్ఫర్, అల్యూమినియం పౌడర్, టిఫిన్ బాక్సులు, వైర్లు, రిమోట్ సెల్స్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశారు. వీటిని స్థానిక దుకాణాల్లో కొనుగోలు చేస్తే.. పట్టుబడే ప్రమాదం ఉంటుందని అమెజాన్ వంటి ఈ-కామర్స్ సైట్లను ఎంచుకున్నారు. వాటితో బాంబులను తయారు చేశాక.. పరీక్షల కోసం రంపచోడవరం అటవీ ప్రాంతంలో పలుమార్లు రిహార్సల్స్ చేశారు. తొలుత డమ్మీ పేలుళ్లతో ప్రయత్నించి, ఆ తర్వాత హైదరాబాద్, విజయనగరంలో వరుస పేలుళ్లు జరపాలని కుట్రపన్నారు. జాతీయ బ్యాంకుల్లో ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తే.. నిఘా సంస్థలు గుర్తిస్తాయనే ఉద్దేశంతో సిరాజ్ విజయనగరం జిల్లా సహకార బ్యాంకులో ఖాతా తెరిచాడని, ఉగ్రవాద కార్యకలాపాలకు ఈ ఖాతా నుంచే లావాదేవీలు నిర్వహించాడని నిర్ధారించారు.

రంగంలోకి ఎన్ఐఏ

ఉగ్ర కుట్ర కేసు కావడంతో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) రంగంలోకి దిగింది. సోమవారం విజయనగరానికి వస్తూనే.. స్థానిక దర్యాప్తు అధికారి నుంచి ప్రాథమిక సమాచారాన్ని రాబట్టింది. తెలుగు రాష్ట్రాలతోపాటు.. మహారాష్ట్ర, కర్ణాటకల్లోని అహిం సభ్యుల వివరాలపై ఆరా తీస్తోంది. సిరాజ్ తండ్రి, సోదరుడు పోలీసు శాఖకే చెందిన వారు కాగా.. వారినీ రాజాకు పిలిపించి విచారించినట్లు సమాచారం. అహిం నెట్‌వర్క్‌కు సౌదీలోని హ్యాండ్లర్లు ఎవరు? వారు పేలుళ్లకు నిధులను ఎలా పంపుతున్నారు? అనే కోణంపైనా ఎన్ఐఏ దృష్టిపెట్టింది.

10 రోజుల కస్టడీకి ప్రయత్నాలు

విజయనగరం కోర్టు సిరాజ్, సమీర్‌లకు 14 రోజుల రిమాండ్ విధించడంతో పోలీసులు వారిని విశాఖ కేంద్ర కారాగారానికి తరలించారు. అక్కడ వీరిద్దరినీ వేర్వేరు ఐసోలేటెడ్ సెల్స్‌లో పెట్టి, పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. అటు పోలీసులు కూడా ఈ కేసులో వీరిద్దరినీ విచారించాల్సి ఉందని పేర్కొంటూ 10 రోజుల కస్టడీకి ఇవ్వాలంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు అనుమతిస్తే.. స్థానిక పోలీసులు, ఎన్ఐఏ విచారించనున్నట్లు తెలుస్తోంది. వీరిని అత్యంత రహస్యంగా విచారించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

చెంచుబిడ్డల అరెస్టు.. సీఎం నిరంకుశత్వానికి నిదర్శనం

» తక్షణమే వారిని విడుదల చేయాలి
» కాంగ్రెస్ అసమర్థ పాలనను ప్రజలు గుర్తిస్తున్నారు: హరీశ్‌రావు



హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి) : నల్లమల బిడ్డనంటూ గొప్పలు చెప్పుకొనే సీఎం రేవంత్‌రెడ్డి.. తనను కలిసేందుకు వచ్చిన అమాయక చెంచుబిడ్డలను అరెస్టు చేయించడం ఆయన నిరంకుశత్వానికి నిదర్శనమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేసి, చెంచు ఉద్యమ నాయకులను నిర్బంధించడమే ప్రజా పాలనా..? అంటూ సోమవారం 'ఎక్స్' వేదికగా ఆయన ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రసంగంలో తమ పరిపాలన ప్రయోజనాలను ప్రజలు పదేపదే గుర్తుచేసుకుంటున్నారని డబ్బా కొట్టుకున్నారన్నారు. హామీలు అమలు చేయడం లేదని కాంగ్రెస్ అసమర్థ పాలనను పదేపదే గుర్తుచేసుకుంటున్నది మాత్రం వాస్తవమని హరీశ్ ఎద్దేవా చేశారు. విద్యాభరోసా పేరిట రూ.5 లక్షల కార్డు కోసం విద్యార్థులు... 2 లక్షల ఉద్యోగాల కోసం నిరుద్యోగులు, పింఛన్లు ఎప్పుడు పెంచుతారా? అని వయోవృద్ధులు, దివ్యాంగులు ఎదురు చూస్తున్నారన్నారు. నాగర్‌కర్నూల్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరేందుకు ప్రయత్నించిన చెంచు సోదరులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోడుపట్టా భూముల్లో సాగు చేసుకోనివ్వడం లేదని, తమ సంక్షేమం కోసం ఐటీడీఏ పీవోగా ఒక ఐఏఎస్ అధికారిని నియమించాలని వారు కోరడంలో తప్పేముందని ప్రశ్నించారు. అక్రమంగా అరెస్టు చేసిన చెంచు ప్రతినిధులను, అమ్రాబాద్ పోలీసుస్టేషన్లో నిర్బంధించిన చెంచు బిడ్డలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

గుల్జార్‌హౌజ్ ప్రమాదంపై
నిమిషాల్లోనే సీఎం రేవంత్ స్పందించారు

చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.. స్వయంగా వెళ్తే సహాయ చర్యలకు ఇబ్బందనే వెళ్లలేదు

» సీఎం ఆదేశాల మేరకు భట్టి, పొన్నం, దామోదర వెళ్లారు
» క్షేత్రస్థాయిలో సహాయ చర్యలను నేరుగా పర్యవేక్షించారు
» కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి మాట్లాడడం.. చిత్రంగా ఉంది
» అనుకోని ప్రమాదంపై రాజకీయం ఎందుకు చేస్తున్నట్లు?
» గతంలో 'భరతమాతకు హారతి'లో ముగ్గురు చనిపోలేదా?
» గుజరాత్‌లో బ్రిడ్జి కూలి 140 మంది మరణించలేదా?
» ఆ ఘటనలను రాహుల్, రేవంత్ రాజకీయం చేశారా?
» టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): గుల్జార్ హౌజ్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదం జరిగిన నిమిషాల వ్యవధిలోనే సీఎం రేవంత్‌రెడ్డి అలర్ట్ అయి.. జీహెచ్ఎంసీ అధికారులను అలర్ట్ చేశారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి తెలిపారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని వారిని ఆదేశించారన్నారు. తాను ఘటనా స్థలానికి వెళితే సహాయక చర్యలకు ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో మంత్రులను అక్కడికి పంపారని చెప్పారు. ఎప్పటికప్పుడు అధికారులకు ఫోన్‌లో ఆదేశాలిస్తూ.. ప్రమాదరం బారినపడిన 17 మందిని బతికించేందుకు తీవ్రంగా ప్రయత్నించినా.. జరగాల్సిన ప్రాణ నష్టం జరిగి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాద బాధిత కుటుంబాల్లో తన సన్నిహితుడి కుటుంబం కూడా ఉందని తెలిపారు. గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ ఆదేశాల మేరకు ఘటనా స్థలానికి వెళ్లిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ తదితరులు అన్నీ దగ్గరుండి చూసుకున్నారన్నారు. బాధ్యతగల కేంద్రమంత్రిగా ఘటనా స్థలానికి కిషన్‌రెడ్డి వచ్చాడనుకున్నామని, కానీ ఆయన ప్రభుత్వంపై బురదజల్లేందుకు వచ్చారని తర్వాత అర్థమైందన్నారు. ఆయన మాట్లాడిన తీరు.. బాధ్యత లేని నేత మాట్లాడినట్లుగా ఉందన్నారు. కేటీఆర్ ఏం చెబితే కిషన్‌రెడ్డి అది మాట్లాడుతున్నాడని ఓ మిత్రుడు చెబితే తనకు చిత్రంగా అనిపించిందన్నారు. కిషన్‌రెడ్డి.. మోదీ చెబితే వస్తాడే కానీ.. కేటీఆర్ చెబితే వస్తాడా అన్న అనుమానమూ కలిగిందన్నారు. "వాస్తవానికి కిషన్‌రెడ్డి అలాంటి మనిషి కాదు. అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆయన అలా మాట్లాడి ఉండాల్సింది కాదు. గుజరాత్‌లో వంతెన కూలి 140 మంది చనిపోతే.. కిషన్‌రెడ్డిలా రాహుల్ గాంధీ ఏమైనా రాజకీయం చేశారా? ఇదే కిషన్‌రెడ్డి భారత్‌మాతకు హారతి కార్యక్రమం నిర్వహిస్తే బాణాసంచా పేలి ఇద్దరు.. హుస్సేన్‌సాగర్‌లో పడి ఒకరు మరణించారు. దానిపై సీఎం రేవంత్ ఏమైనా మాట్లాడారా? ప్రధాని మోదీ ప్రారంభించిన చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఈదురుగాలికి రేకులు పడిపోయాయి. దానిని మేమేమైనా విమర్శించామా? ఆయా ఘటనల సమయంలో రేవంత్‌రెడ్డి బాధ్యత గల నేతలా వ్యవహరిస్తే.. గుల్జార్‌హౌస్ ఘటనలో కిషన్‌రెడ్డి బాధ్యత లేకుండా బురద జల్లే పని పెట్టుకున్నడు" అని దుయ్యబట్టారు. ఎంతసేపూ రాజకీయం చేయాలనే కిషన్‌రెడ్డి ఆలోచన తప్పని అన్నారు. తన కంటే సీనియర్‌గా కిషన్‌రెడ్డిని గౌరవిస్తానని, ఆయన విమర్శలు చేయడం మానుకుని.. సేవ చేయడం నేర్చుకోవాలని హితవు పలికారు.

హైడ్రా ఉద్యోగాలకు పోటెత్తిన నిరుద్యోగులు



హైదరాబాద్‌లో బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయం వద్ద బారులు తీరిన నిరుద్యోగులు

హైదరాబాద్ సిటీ/కేపీహెచ్‌బీ కాలనీ, మే 19 (ఆంధ్రజ్యోతి): హైడ్రాలో డ్రైవర్లుగా చేరేందుకు నిరుద్యోగులు పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయానికి చేరుకుని దరఖాస్తులతో బారులు తీరారు. గంటల తరబడి లైనులో నిరీక్షించి వాటిని అందజేశారు. సంస్థలోని విపత్తుల నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల పర్యవేక్షణ తదితర విభాగాల్లోని వాహనాలను నడిపేందుకు 200 మంది డ్రైవర్లు కావాలంటూ నోటిఫికేషన్ విడుదల అయింది. 2022-23లో కానిస్టేబుల్ పరీక్షలు రాసి.. తక్కువ మార్కులతో ఉద్యోగాలకు దూరమైన వారికి మాత్రమే అవకాశం ఇవ్వనున్నట్లు అందులో పేర్కొన్నారు. 19, 20 తేదీల్లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించగా.. సుమారు 850 మంది దరఖాస్తు చేశారని హైడ్రా వర్గాలు తెలిపాయి. రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ తుది ఫలితాల జాబితా ఆధారంగా.. అందులో పేర్లున్న వారి నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరించారు. కాగా.. నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులను ఆక్రమించి కట్టిన నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు సోమవారం అధికారులు రంగంలోకి దిగారు. హైదర్‌నగర్‌లోని డైమండ్ హిల్స్, పుప్పాల్‌గూడలోని డాలర్ హిల్స్‌లో రోడ్లు, పార్కులు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేశారు. హైదర్‌నగర్ సర్వే నంబర్ 145లోని 9 ఎకరాల స్థలంలో 2000 సంవత్సరంలో హెచ్ఎండీఏ (అప్పటి హుడా) అనుమతితో లే-అవుట్ అభివృద్ధి చేశారు. అయితే.. 2007లో అన్ రిజిస్టర్డ్ అసైన్‌మెంట్ డీడ్‌తో డాక్టర్ ఎన్ఎస్‌డీ ప్రసాద్ రంగంలోకి దిగడంతో అక్కడ ఆక్రమణల పర్వం మొదలైంది. స్విమ్మింగ్ పూల్, రోడ్లు, పార్కులు, ప్లాట్ల హద్దులు చెరిపేసి దాదాపు 7 ఎకరాలు ఆక్రమించినట్టు ప్లాట్ల యజమానులు ఫిర్యాదు చేశారు. కోర్టు తీర్పునూ ఆక్రమణదారులు పట్టించుకోవడం లేదని వివరాలు సమర్పించారు. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించారు. ఇరు పక్షాలనూ కార్యాలయానికి పిలిచి విచారించారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు రహదారులు, పార్కుల్లో ఉన్న ఆక్రమణలు తొలగించి, బోర్డులు ఏర్పాటు చేశారు. నార్సింగి మండలం పుప్పాల్‌గూడలోనూ అదే పరిస్థితి. అక్కడ వివాదంలో ఉన్న భూమిలో ఎలాంటి నిర్మాణాలూ చేపట్టవద్దని న్యాయస్థానం ఆదేశాలిచ్చినా.. ఎన్‌సీసీ అనే సంస్థ భవనాలు నిర్మిస్తోందని డాలర్‌హిల్స్ నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 14వ తేదీన క్షేత్రస్థాయిలో పరిశీలించిన రంగనాథ్ వెంటనే నిర్మాణాలు నిలిపివేయాలని సూచించారు. అంతకుముందు చేపట్టిన నిర్మాణాలనూ కూల్చివేశారు.



ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్ నుంచి బయలుదేరిన తిరంగా ర్యాలీ

ఖమ్మం తిరంగా ర్యాలీలో ఉద్రిక్తత

బీజేపీ కార్యకర్తలకు, ఓ వర్గానికి చెందిన వ్యక్తికి మధ్య వాగ్వాదం

టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఘర్షణ వాతావరణం

ఖమ్మం, మే19(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో సైనికులకు సంఘీభావంగా ఖమ్మం నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన తిరంగా ర్యాలీలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సోమవారం రాత్రి ర్యాలీ కొనసాగుతున్న క్రమంలో బీజేపీ కార్యకర్తలకు, ఓ వర్గానికి చెందిన వ్యక్తికి మధ్య వాగ్వాదం జరిగింది. బీజేపీ ఆధ్వర్యంలో ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్ నుంచి సర్దార్ పటేల్ స్టేడియం వరకు తిరంగ ర్యాలీ చేపట్టారు. ర్యాలీ ఖమ్మం టూటౌన్ సమీపంలోకి రాగానే అక్కడ ట్రాఫిక్‌ను అదుపు చేస్తున్న ఓ పోలీసు కానిస్టేబుల్‌ను ఓ వర్గానికి చెందిన వ్యక్తి ఈ ర్యాలీ ఎందుకని ప్రశ్నించడంతో ఇది విన్న బీజేపీ కార్యకర్తలు సదరు వ్యక్తితో వాగ్వాదానికి దిగారు. ఈ వాగ్వాదం మతం పేరుతో జరుగుతున్నట్లు ప్రచారం కావడంతో రెండు వర్గాల ప్రజలు భారీగా గుమికూడారు. దాంతో ఖమ్మం టూటౌన్ ప్రాంతంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు కలుగజేసుకుని ఇరు వర్గాలకు సంబంధించిన నేతలను, వివాదానికి కారణమైన వర్గానికి సంబంధించిన పెద్దలను పిలిపించి మాట్లాడారు. ఎవరి తప్పు ఉంటే వారిపై కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చి నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. కాగా, బీజేపీ మంగళవారం ఖమ్మం నగర బంద్‌కు పిలుపునిచ్చింది. కాగా వదంతులను ప్రచారం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ హెచ్చరించారు.

కేంద్రానికే కాళేశ్వరం పరీక్షల బాధ్యత

» లేఖ రాసిన రాష్ట్ర నీటి పారుదలశాఖ

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతపై పరీక్షలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వ సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ సిఫారసులకనుగుణంగా భూ సాంకేతిక (జియో టెక్నికల్), భూ భౌతిక (జియో ఫిజికల్) పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఢిల్లీలోని సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్- ఢిల్లీ)కు, పుణెలోని కేంద్ర విద్యుత్, నీటి పరిశోధనా సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్)లకు రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ అధికారులు లేఖ రాశారు. మేడిగడ్డలో పరీక్షల కోసం సీఎస్ఎంఆర్ఎస్‌కు, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరీక్షలకు సీడబ్ల్యూపీఆర్ఎస్) లను కోరారు. ఈ పరీక్షల నిర్వహణకు ఎంత ఖర్చవుతుందో తెలియచేస్తే వెనువెంటనే నిధులు ఇస్తామని పేర్కొన్నారు. బ్యారేజీలపై పరీక్షలు, అధ్యయనాల నివేదికల ఆధారంగా వాటి పునరుద్ధరణ / మరమ్మత్తు ప్రణాళికలకు కేంద్ర జల వనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదం తీసుకోవాలని ఎన్‌డీఎస్‌ఏ దిశా నిర్దేశం చేసిన నేపథ్యంలో పరీక్షల నిర్వహణ బాధ్యత కూడా కేంద్ర సంస్థలకే తెలంగాణ నీటి పారుదల శాఖ అప్పగించింది.

పాక్ అబద్ధాలకు రాహుల్ ప్రచారం:కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయాన్ని అభినందించాల్సింది పోయి రాహుల్ గాంధీ పాకిస్థాన్ చెబుతున్న అబద్ధాలను ప్రచారం చేస్తూ, ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. మన సైనికులకు దేశం మొత్తం అభినందనలు తెలుపుతున్న సమయంలో, రాహుల్ మాత్రం దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ తీసుకున్న తక్షణ, కఠిన చర్యల ఫలితంగా పాకిస్థాన్.. భారత్ కాళ్ల మీద పడిందని కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రపంచమంతా భారత్ విజయాన్ని గుర్తిస్తుంటే.. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ మాత్రం పాకిస్తాన్‌కు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. "రాహుల్, కాంగ్రెస్ ఈ చిల్లర రాజకీయాలను వదిలి దేశానికి అండగా నిలబడగలరా..? ఆయన ఇప్పటికైనా మారతారా..? లేదా వారి నుంచి దేశభక్తిని ఆశించడం అత్యాశేనా?" అంటూ కిషన్‌రెడ్డి ఎక్స్‌లో పోస్టు చేశారు.

మరమ్మతులు చేయండి.. పెండింగ్ బిల్లులివ్వండి!

» నీటి పారుదలశాఖ అధికారులు,
కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణ సంస్థల పరస్పర అభ్యర్థనలు

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): రానున్నది వానాకాలం.. వచ్చే 2 నెలల్లో గోదావరికి వరదలొస్తాయి. ఈ నేపథ్యంలో సాగునీటి సరఫరా కోసం గోదావరిపై కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో నిర్మించిన బ్యారేజీల పరిరక్షణపై సర్కారు దృష్టి సారించింది. అందులో భాగంగా కాళేశ్వరంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ఏ) సిఫారసులకనుగుణంగా ఆయా బ్యారేజీల పరిరక్షణకు మరమ్మతులు చేపట్టాలని వాటి నిర్మాణ సంస్థలను సాగునీటి పారుదలశాఖ అధికారులు కోరారు. ఇంతకు ముందు చేసిన పనుల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని సోమవారం తమతో సమావేశమైన అధికారులను బ్యారేజీల నిర్మాణ సంస్థల ప్రతినిధులు.. ఎల్ అండ్ టీ (మేడిగడ్డ), ఆఫ్కాన్స్ (అన్నారం), నవయుగ (సుందిళ్ల) కోరారు. గతేడాది వానాకాలానికి ముందు మేడిగడ్డ బ్యారేజీ రక్షణకు తాము చేపట్టిన పనుల బిల్లులు విడుదల కాలేదని ఎల్ అండ్ టీ ప్రతినిధులు, నీటి పారుదలశాఖ అధికారుల దృష్టికి తెచ్చారు. ఇదిలా ఉంటే, ఎన్‌డీఎస్ఏ నివేదికకనుగుణంగా బ్యారేజీల భద్రతపై పరీక్షలు, తదుపరి మరమ్మతు ప్రణాళికలు, పెండింగ్ బిల్లుల వివరాలతోపాటు ఆయా పరీక్షలకు అవసరమైన నిధులెంత అన్న విషయమై బుధవారానికల్లా నివేదికలు ఇవ్వాలని నిర్మాణ సంస్థలకు అధికారులు దిశానిర్దేశం చేశారు.

శ్రీశైలం డ్యాంపై జలసంఘం కార్యాచరణ!

» శాస్త్రవేత్త హనుమంతప్ప సారథ్యంలో ఐదుగురు రాక

అమరావతి, మే 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం వద్ద దెబ్బతిన్న అప్రోచ్ రోడ్, టెయిల్ ఎండ్ ప్రాజెక్టు, ప్లంజ్‌పూల్ పరిస్థితులపై కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) కార్యాచరణ చేపట్టింది. ప్రముఖ సైంటిస్టు హనుమంతప్ప సారథ్యంలోని ఐదుగురు శాస్త్రవేత్తల బృందాన్ని సోమవారం ప్రాజెక్టు వద్దకు పంపింది. ఈ బృందం గురువారం (22వ తేదీ) దాకా అక్కడే ఉండి అధ్యయనం చేస్తుంది.

సమీకృత వరద యాజమాన్య విధానం అమలు చేయాలి: ఈఎన్‌సీ(జనరల్)

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): వరదలపై సమాచారం లేనందు వల్లే విపత్తులు సంభవిస్తున్నాయని, దీనికోసం సమీకృత వరద యాజమాన్య విధానం అమలు చేయాలని నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్(జనరల్) జి.అనిల్‌కుమార్ కోరారు. మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల అధికారులతో ఇంటిగ్రేటెడ్ ఫ్లడ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఐఎఫ్ఎంఎస్)పై వర్చువల్ విధానంలో సమావేశమయ్యారు. తుపానుల సమయంలో పట్టణ ప్రాంతాల్లో ఈ విధానం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా, లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారిని సురక్షితంగా తరలించడానికి మేలు చేస్తుందని అనిల్ కుమార్ చెప్పారు. ప్రస్తుతానికి రాష్ట్రాలతో సమన్వయం కోసం వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

వ్యవసాయ శాఖలో ప్రమోషన్ల పంచాయితీ

వ్యవసాయ శాఖలో పదోన్నతుల ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోందని సీనియర్ వ్యవసాయ విస్తరణ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు త్రిసభ్య కమిటీ చైర్మన్ నవీన్ మిత్తల్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీఎస్ఏఈవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, కార్యదర్శి ముజీబ్ మాట్లాడుతూ.. శాఖలో ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలను పక్కనపెట్టి, సీనియర్లను కాదని జూనియర్లకు పదోన్నతులు కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీని నియమించి పదోన్నతులు కల్పించాలని మిత్తల్‌కు విజ్ఞప్తి చేశారు.

పాఠశాల విద్యార్థులకు.. ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ డిజిటల్ స్టడీ మెటీరియల్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ డిజిటల్ స్టడీ మెటీరియల్, అసైన్‌మెంట్లను సిద్ధం చేసినట్లు ఐఐటీ-జేఈఈ-నీట్ ఫోరం తెలిపింది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఫౌండేషన్ మెటీరియల్‌ను విద్యార్థులు వాట్సాప్ ద్వారా పొందవచ్చని తెలిపింది. మరింత సమాచారం కోసం IITF, MEDF అని టైపు చేసి వాట్సాప్ నంబర్ 98490 16661కు మెసేజ్ చేయాలని ఫోరం సూచించింది.

టిమ్స్ ఆస్పత్రుల ప్రారంభోత్సవ తేదీల్లో మార్పు

» జూన్ 26న ఎల్‌బీనగర్, ఆగస్టు 31న సనత్‌నగర్..

» డిసెంబరులో అల్వాల్ టిమ్స్, వరంగల్ ఆస్పత్రి ప్రారంభం

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎల్‌బీ నగర్, సనత్‌నగర్, అల్వాల్ తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రుల ప్రారంభోత్సవ తేదీలు మారాయి. వాస్తవానికి ఈ టిమ్స్‌ను ఈ ఏడాది జూన్ 2 నుంచి ప్రారంభించాలని ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య శాఖలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ మేరకు మంత్రులు కూడా పలు వేదికల్లో ప్రారంభోత్సవ తేదీలను ప్రకటించారు. నిర్మాణపరంగా 85-90 శాతం పనులు పూర్తయినప్పటికీ ఇతర దేశాల నుంచి రావాల్సిన అత్యాధునిక సాంకేతికతతో కూడిన యంత్రాలు రావడంలో జాప్యం జరుగుతోందని, దీంతో ఆస్పత్రుల ప్రారంభోత్సవాల్లోనూ ఆలస్యం జరుగుతోందని సమాచారం. ఈ నేపథ్యంలో జూన్ 26న ఎల్‌బీ నగర్ టిమ్స్, ఆగస్టు 31న సనత్‌నగర్, డిసెంబరులో అల్వాల్ టిమ్స్‌ను ప్రారంభించేందుకు అధికారులు ప్రాథమికంగా తేదీలను ఖరారు చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేశారు. మరోవైపు వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని కూడా డిసెంబరులో ప్రారంభించాలని నిర్ణయించారు.

నాడు బేడీలు.. నేడు వెలుగులు

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన స్ప్రింక్లర్లను స్విచ్చాన్ చేసి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో 6 లక్షల ఎకరాల్లో 2.70 లక్షల మంది రైతులకు ఇందిర సౌర గిరి జలవికాసం పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇదే కాకుండా అచ్చంపేట నియోజకవర్గంలో వచ్చే వంద రోజుల్లో విద్యుత్ మోటార్లను తొలగించి కేవలం సోలార్ ఆధారిత పంపు సెట్లు వందశాతం బిగించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అవసరమైతే కొత్తగా వచ్చిన ఐఏఎస్‌ను డిప్యుటేషన్ చేయాలని సూచించారు. ప్రస్తుతం ఈ పథకం లబ్ధిదారుల్లో డిగ్రీ చదివిన వారిని రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు శిక్షణ ఇచ్చేందుకు పంపించాలని, వారికి గౌరవ వేతనం కూడా ఇవ్వాలని అన్నారు. సోలార్ పంపుసెట్లను రైతులు బిగించుకోవాలంటే వారికి సాగు కోసమే కాకుండా సోలార్ విద్యుత్ అదనపు ఉత్పత్తి ద్వారా నెలకు రూ.5 వేల వరకు ఆదాయం వచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇందిర సౌర గిరి జలపథకాన్ని నల్లమల డిక్లరేషన్‌గా పేర్కొని.. ఈ పథకం కింద చేసే పనుల డిక్లరేషన్‌ను ఆవిష్కరించారు.



అమ్రాబాద్ మండలం మాచారంలో ఇందిరా సౌర గిరి జల వికాసం పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వరి వేస్తే ఉరి అన్నారు..

గత ప్రభుత్వం వరి వేస్తే ఉరి అని చెప్పి.. ఫాంహౌస్‌లో మాత్రం 150 ఎకరాల్లో వరి వేసుకొని క్వింటా రూ.4200కు విక్రయించారని సీఎం రేవంత్ అన్నారు. తాము మాత్రం సన్నవడ్లకు బోనస్ ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో రైతులు గత వానాకాలంలో 1.56 కోట్ల మెట్రిక్ టన్నులు, యాసంగిలో 1.35 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించారని చెప్పారు. 16 నెలల కాలంలో వ్యవసాయానికి రూ.60 వేల కోట్లు ఖర్చు చేశామని, ఇందులో రూ.21 వేల కోట్లు రుణ మాఫీ చేశామని అన్నారు. ఒకప్పుడువర్సిటీల్లో, కాలేజీల్లో విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్లు వేయాలని ధర్నాలు చేసేవారని సీఎం రేవంత్ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మాత్రం వరుస నోటిఫికేషన్లకు ప్రిపేర్ కావడం సాధ్యం కాదంటూ నోటిఫికేషన్లను వాయిదా వేయాలని ఆందోళనలు చేసున్నారని తెలిపారు. ఏడాదిలో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, ప్రైవేట్‌లో మరో లక్ష ఉద్యోగాలు ఇచ్చామని వివరించారు. డైట్ చార్జీలు 40 శాతం, కాస్మెటిక్స్ చార్జీలు 200 శాతం కాంగ్రెస్ ప్రభుత్వమే పెంచిందన్నారు.

చట్టాలుగా నినాదాలు: డిప్యూటీ సీఎం

తెలంగాణ గడ్డపై దశాబ్దాలుగా ఉన్న దున్నేవానికి భూమి నినాదాన్ని ఇందిర సౌర గిరి జలవికాసం వంటి పథకాల ద్వారా చట్టాలుగా అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. జల్, జంగల్, జమీన్, భూమికోసం, భుక్తికోసం, దోపిడీ విముక్తి కోసం పోరాటం వంటి నినాదాలు చట్టాలుగా మారాలంటే రాష్ట్రంలో 20 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉండాలన్నారు. జూన్ 2న గిరిజన యువతకు రాజీవ్ యువవికాసం స్వయం ఉపాధి పథకం ద్వారా రూ.1000 కోట్లు మంజూరు చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీలు మల్లు రవి, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లి ఆత్మీయ ఆలింగనం చేసుకుంది: రేవంత్

బిడ్డకు తల్లి స్వాగతం పలికినట్టు.. కొండారెడ్డిపల్లి తనను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుందని సీఎం రేవంత్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. "నా ఊరు, నా వాళ్ల మధ్యకు ఎప్పుడు వెళ్లినా అనిర్వచనీయ అనుభూతే. ఊరి పొలిమేరల్లో హనుమంతుడి ఆశీస్సులు ఆధ్యాత్మిక అనుభూతి" అని తెలిపారు. దీంతోపాటు, "ఇందిరమ్మ రాజ్యమంటే పేద గిరిజనుడికి భూమి ఇచ్చి.. సౌర విద్యుత్ ఇచ్చి.. ఆ భూమికి నీరు ఇచ్చి.. పంటకు పైసలిచ్చి.. పండిన పంటకు గిట్టుబాటు ధర ఇచ్చి ఆదుకోవడం. నిన్న పోడు భూములిచ్చిన చేతులతో.. నేడు ఉచిత సోలార్ పంపు సెట్లు ఇచ్చే ఇందిర సౌర గిరి జలవికాసం పథకాన్ని నా సొంత గడ్డపై అచ్చంపేటలో ప్రారంభించాను" అంటూ సీఎం మరో పోస్టు చేశారు. తనతోపాటు తన గ్రామానికి వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల బృందానికి ధన్యవాదాలు తెలిపారు.



కొండారెడ్డిపల్లిలో ఆంజనేయస్వామికి సీఎం ప్రత్యేక పూజలు

కల్వకుర్తి: మాచారంలో బహిరంగ సభ అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్వగ్రామమైన నాగర్‌కర్నూలు జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి వచ్చారు. ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సతీమణి గీత, మనుమడు, కుటుంబ సభ్యులతో కలిసి పట్టు వస్త్రాలు సమర్పించారు. సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి , స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు ఉన్నారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారం..

కొందరు కడుపు నిండా విషం పెట్టుకొని.. ధనబలంతో సోషల్ మీడియాలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. కానీ, వివిధ పథకాల లబ్ధిదారులకు తాను గుర్తుంటే చాలునని, ఆ సన్నాసులు తనకు లెక్కకాదని అన్నారు. నిత్యావసరాల ధరల నియంత్రణలో, శాంతిభద్రత పరిరక్షణలో, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, పన్ను వసూళ్లలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉందంటూ కేంద్రమే ప్రకటించిందని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎంతో మంది ప్రధానులయ్యారని, కానీ.. 50 ఏళ్ల తరువాత కూడా ప్రతీ పేదవాడి గుండెల్లో ఇందిర ఉన్నారని రేవంత్ అన్నారు. పహల్గాం దాడి అనంతర పరిణామాల్లో ప్రధానిగా ఇందిర ఉంటే నిటారుగా నిలబడి పాక్‌ను తుత్తునియలు చేసేవారని అందరూ అంటున్నారని వ్యాఖ్యానించారు. ఇందిర సౌర గిరి జలవికాసం పథకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాచారం గ్రామానికి చెందిన చెంచు లబ్ధిదారులతో సీఎం మాట్లాడారు.

సెల్ఫీ తీసుకున్నంత ఈజీగా వైద్యపరీక్షలు!

» 'అమృత్ స్వస్థ్ భారత్' పేరిట నిలోఫర్ ఆస్పత్రిలో దేశంలోనే తొలి 'నాన్ ఇన్వేజివ్ బ్లడ్ టెస్టింగ్' టూల్ అందుబాటులోకి

» రక్తపోటు, ఆక్సిజన్‌స్థాయిలు, హృదయ స్పందనల రేటు, హెచ్‌బీఏ1సీ స్థాయిలను నిమిషంలోపే తెలుసుకునే వీలు

హైదరాబాద్ సిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి): రక్తపోటు ఎంతుందో తెలుసుకోవడానికి పరికరాలున్నాయి! కానీ.. అందుకు ఒక పట్టీని చేతికి ధరించి, అది గట్టిగా చేతికి బిగుసుకుని రక్తపోటును కొలిచే దాకా వేచి చూడాలి. అలాగే.. గడిచిన 2-3 నెలల్లో మన రక్తంలో చక్కెర స్థాయిలు ఎంతున్నాయో తెలుసుకోవడానికి చేసే పరీక్ష హెచ్‌బీఏ1సీ. దీనికి మన చేతి నుంచి రక్తం తీసుకుని పరీక్ష చేయాల్సి ఉంటుంది. ఇవేవీ లేకుండా.. సెల్ఫీ తీసుకున్నంత సులభంగా కెమెరాల సాయంతో రోగనిర్ధారణ పరీక్ష చేయగలిగితే? 'అమృత్ స్వస్థ్ భారత్ టూల్ పేరిట అలాంటి పరీక్షలు చేసే అద్భుతమైన 'నాన్ ఇన్వేజివ్ బ్లడ్ టెస్టింగ్ టూల్‌ను దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో సోమవారం ప్రారంభించారు. ఈ టూల్‌ను స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌ల ద్వారా ఉపయోగించవచ్చు. మన శరీరంలో ప్రవహించే రక్తపరిమాణాన్ని 'బ్లడ్ వాల్యూమ్' అంటారు. మన రక్తపోటు నియంత్రణలో/నిర్దీత స్థాయుల్లో ఉండాలంటే అందుకు ఈ బ్లడ్ వాల్యూమ్ చాలా కీలకమైనది. దాంట్లో తేడాలు వస్తే మన శరీరం కాంతిని శోషించుకునే విధానంలో తేడాలు వస్తాయి. 'అమృత్ స్వస్థ్ భారత్ టూల్‌లోని రిమోట్ ఫొటోప్లెథిస్మోగ్రఫీ (పీపీజీ).. మన శరీరం కాంతిని శోషించుకునే తీరును పరిశీలించి, ఆ సమాచారాన్ని ఏఐ, డీప్‌లెర్నింగ్ ద్వారా విశ్లేషించి.. రక్తపోటు ఎంత ఉంది? ఆక్సిజన్ స్థాయిలు (ఎస్పీవో2) ఎంత? హృదయస్పందనల రేటు, శ్వాసక్రియ రేటు, హార్ట్ రేట్ వేరియబిలిటీ (హెచ్ఆర్‌వీ), హెచ్‌బీఏ1సీ స్థాయిలు, పల్స్ రెస్పిరేటరీ కోషెంట్ (పీఆర్‌క్యూ) తదితర వివరాలను 20 సెకన్ల నుంచి 60 సెకన్ల లోపే తెలియజేస్తుందని నిలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఇది పిల్లలు, గర్భిణులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. 'అమృత్ స్వస్థ్ భారత్‌తో ఆరోగ్య పర్యవేక్షణ సెల్ఫీ తీసుకున్నంత సులభం అవుతుందని.. దీన్ని రూపొందించిన 'క్విక్ వైటల్స్' వ్యవస్థాపకుడు హరీష్ బిసమ్ వివరించారు. మొబైల్ ఫేస్ స్కానింగ్ టెక్నాలజీ కీలకమైన ఆరోగ్య సమాచారాన్ని వేగంగా యాక్సెస్ చేస్తుందని, ఆరోగ్య సంరక్షణ యాక్సెస్‌కు ఉన్న అడ్డంకులను సమర్థవంతంగా పరిష్కరిస్తుందన్నారు. నిలోఫర్ ఆస్పత్రి తర్వాత మహారాష్ట్రలో ఈ పరీక్షా పద్ధతిని త్వరలో అమలు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమానికి నేషనల్ మెడికల్ కమిషన్ సభ్యురాలు సుషేనా హెల్త్ ఫౌండేషన్ ప్రొఫెసర్ డాక్టర్ సంతోష్ కుమార్ క్రాలేటి, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచరిస్టిక్ సిటీస్ అధ్యక్షురాలు హాజరయ్యారు.

గ్రామ పటాలన్నీ ఇక డిజిటైజేషన్

» ప్రయోగాత్మకంగా 3 గ్రామాల్లో ప్రారంభం

» రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, మే19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇప్పటి వరకు కాగితాలకే పరిమితమైన సర్వే మ్యాప్‌లను (గ్రామ పటాలను) డిజిటలైజేషన్ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. దశలవారీగా అన్ని గ్రామాల మ్యాప్‌లను డిజిటలైజ్ చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో సోమవారం ఆయన రెవెన్యూ, సర్వే అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ (టీజీఆర్ఏసీ) ద్వారా సర్వే పటాలను డిజిటలైజేషన్ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని తొలుత ప్రయోగాత్మకంగా నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల, జగిత్యాల జిల్లా తక్కలపల్లి, ఖమ్మం జిల్లా పెద్దకోరుకొండి గ్రామాల్లో అమల్లోకి తెస్తున్నట్లు చెప్పారు. రెండు రోజుల్లో రికార్డుల డిజిటలైజేషన్ చేపట్టాలని అధికారులకు సూచించారు.

26 నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ

భూ భారతి చట్టంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు భూమి సర్వే మ్యాప్‌ను జత చేయడాన్ని తప్పనిసరి చేశామని, ఈ విధానాన్ని వీలైనంత త్వరగా అమల్లోకి తీసుకురావడానికి వీలుగా లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకాన్ని చేపడుతున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. సచివాలయంలో సోమవారం ఆయన లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలిదశలో 5000 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తున్నామని , ఇందు కోసం ఈ నెల 17 వరకు దరఖాస్తులు ఆహ్వానించగా 10,031 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 26 నుంచి గచ్చిబౌలిలోని సర్వే శిక్షణా సంస్థ (తాలిమ్)లో రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు రూ.16.07 కోట్లు విడుదల

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా బేస్‌మెంట్ దశను పూర్తిచేసుకున్న 1,383 ఇళ్లకు, గోడలు పూర్తయిన 224 ఇళ్లకు కలిపి సోమవారం రూ.16.07 కోట్లను విడుదల చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 5,364 మంది బేస్‌మెంట్, గోడలు దశను పూర్తి చేసుకున్నారని, వారందరికి కలిపి రూ.53.64 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. సోమవారం ఆయన జూమ్ విధానంలో లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు అంశంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్టు కింద 47,335 ఇళ్లను మంజూరు చేయగా.. ఇప్పటివరకు 20,104 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని తెలిపారు.

ట్రైబల్ కెఫ్టేరియా

మాసబ్‌ట్యాంక్ తెలుగు సంక్షేమ భవన్‌లో ఆహార స్టాల్

» కొలువు దీరిన 11 జాతుల గిరిజన దేవాలయాలు..త్వరలో ప్రారంభం





గిరిజన ఆహారం పేరుతో స్టాల్
కూర్చొని తినేందుకు ఏర్పాటుచేసిన టేబుల్

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు, అటవీ ప్రాంత వాసులకే పరిమితమైన చిరు/ తృణ ధాన్యాలు.. కల్తీకి తావులేని సహజ సిద్ధమైన అటవీ ఉత్పత్తులతో తయారుచేసిన చిరుతిళ్లు, వంటకాలను రాష్ట్ర ప్రజలందరికి రుచి చూపేందుకు సర్కారు సిద్ధమైంది. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్న ఉట్నూరు, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఏటూరు నాగారం ఐటీడీఏలు.. ప్రతి ఒక్కరికీ నోరూరించే స్వీట్లు, గారెలు తదితర చిరు తిళ్లు, ఇతర ఇతర వంటకాల తయారీ చేయిస్తూ.. అటవీ ప్రాంత వాసులకు స్వయం ఉపాధి కల్పిస్తున్నాయి.

స్వీట్లతోపాటు 20 రకాల పిండి వంటలు

ఉట్నూరు ఐటీడీఏ పరిధిలో యూనిట్లలో ఇప్పపువ్వుతో కూడిన స్వీటు, ఇప్ప లడ్డూ, ఇప్ప గారెలు, చపాతీలతోపాటు సుమారు 20 రకాల పిండి వంటలు, చిరు తిళ్లు తయారు చేస్తున్నారు. ఇక భద్రాచలం, ఆదిలాబాద్, ఏటూరునాగారం ఐటీడీఏ యూనిట్లలో చిరు, తృణ ధాన్యాలతో తయారు చేస్తున్న పలు చిరు తిళ్లలో ప్రోటీన్లు, కొవ్వు పదార్థాలు, మాంస కృత్తులన్నీ సమపాళ్లలో ఉంటాయి. అటవీ ఉత్పత్తులతో తయారుచేస్తున్న వంటకాల్లో కల్తీకి ఆస్కారం లేకపోవడంతో అవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అధికారులు చెబుతున్నారు. వీటి ధరలు కూడా అందరికీ అందుబాటులోనే ఉంటాయని అధికార వర్గాల ద్వారా తెలిసింది. అటవీ ఉత్పత్తులతో తయారుచేసిన చిరుతిళ్లు, ఇతర వంటకాలను ప్రజలందరికీ పరిచయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం.. హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంక్ వద్ద గల తెలుగు సంక్షేమ భవన్‌లో గిరిజన మ్యూజియం ముందు 'గిరిజన ఆహారశాల పేరుతో ఓ స్టాల్ ఏర్పాటు చేస్తోంది. ఇది పూర్తిగా చెక్కలు, కొయ్యలతోనే పూర్తిగా రూపుదిద్దుకుంటున్నది. ఇక్కడ కూర్చుని తినడానికి ప్రత్యేకంగా పైకప్పుతో కూడిన ఓ టేబుల్ ఆకర్షణీయంగా చూపరులను ఆకట్టుకుంటోంది. సిమెంట్ లేకుండా ఎర్రమట్టితో అలికిన ఆహారశాల చాలా సహజ సిద్ధంగా ఉంటుంది. గిరిజన ఆహారశాలతో పాటు అక్కడే అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే 11 గిరిజన జాతుల చరిత్ర, వారి సంప్రదాయ ఆచారాలను ప్రజలకు తెలియజెప్పేందుకు ఆలయాలు నిర్మిస్తున్నారు. లంబాడీ (సంత్ సేవాలాల్), ఎరుకల, కొండరెడ్డి, చెంచు, తోటి, కొలాం, కోయ, నాయక్‌పోడు, పర్ధాన్, గోండ్, అంధ్ జాతుల జాతరలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ 11 గిరిజన జాతుల జాతరలు, వారి సంప్రదాయ సంస్కృతులనూ ప్రజలకు తెలిపేలా 'గిరిజన దేవాలయాలు' అనే పేరుతో 11 నిర్మాణాలు చేపట్టారు. ఈ నిర్మాణాల ఎదురు గోడలపై వారి సంస్కృతి, సంప్రదాయాలు తెలిపే చిత్రాలు వేశారు. సుమారు రూ.5-7 లక్షల ఖర్చుతో నిర్మించి గిరిజన ఆహారశాల, దేవాలయాలను త్వరలో ప్రారంభించనున్నారు.

ఫిలిప్పీన్స్‌కు ఏటా 8 లక్షల టన్నుల బియ్యం!

తెలంగాణ-ఫిలిప్పీన్స్ ప్రభుత్వాల మధ్య ఎంవోయూ.. నాణ్యత బాగుండడంతో భారీగా దిగుమతికి ఒప్పందం



హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఫిలిప్పీన్స్ ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఏటా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని దిగుమతి చేసుకునేందుకు ఫిలిప్పీన్స్ అంగీకరించింది. ప్రాథమిక ఒప్పందంలో లక్ష టన్నుల బియ్యం దిగుమతికి అంగీకరించిన ఆ దేశం.. బియ్యం నాణ్యతపై సంతృప్తి చెందిన తర్వాత వార్షిక ఒప్పందం చేసుకుంది. తెలంగాణ-ఫిలిప్పీన్స్ మధ్య జరిగిన ఎంవోయూ ప్రకారం.. ఇకపై ఏటా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేయాల్సి ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఫిలిప్పీన్స్‌తో గత మార్చి నెలలో ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే ఐఆర్-64, ఎంటీయూ-1010 రకాల బియ్యం ఎగుమతికి శ్రీకారం చుట్టింది. తొలి విడతలో 12,750 మెట్రిక్ టన్నులు, మలివిడతలో 10 వేల టన్నుల బియ్యాన్ని సముద్రమార్గంలో ఫిలిప్పీన్స్‌కు పంపించింది. మరో 6 వేల టన్నుల బియ్యాన్ని ఈ నెలాఖరున లేదా జూన్ మొదటివారంలో పంపనుంది. ప్రాథమిక ఒప్పందంలో ఫిలిప్పీన్స్ ప్రభుత్వం లక్ష టన్నుల బియ్యం దిగుమతికి అంగీకరించింది. అందులో భాగంగానే విడతలవారీగా బియ్యాన్ని పంపిస్తున్నారు. మన బియ్యం నాణ్యత బాగుండడంతో ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు మార్కోస్ దిగుమతి చేసుకునేందుకు అంగీకరించారు. తెలంగాణ బియ్యంతో వండిన అన్నం రుచి చూసిన తర్వాతే ఆయన ఏటా 8 లక్షల మెట్రిక్ టన్నుల దిగుమతికి ఆమోదం తెలిపారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. బియ్యం ఎగుమతికి ఆదిత్య బిర్లా కంపెనీ లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) ఇచ్చింది. తొలి విడతలో పంపిన బియ్యం బిల్లును కూడా ఫిలిప్పీన్స్ సర్కారు చెల్లించింది.

కేంద్ర ప్రభుత్వ పచ్చజెండా

తెలంగాణ రాష్ట్రం 'వికేంద్రీకృత సేకరణ వ్యవస్థ (డీసీపీ)'లో ఉన్నందున కనీస మద్దతు ధరకు రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) చేసి అప్పగించాల్సి ఉంటుంది. అయితే మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ ఇవ్వకపోవడం, ఏళ్ల తరబడి బియ్యం బకాయిలు పేరుకుపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం బియ్యం ఎగుమతికి చేసిన ప్రయత్నం ఫలించింది. ఫిలిప్పీన్స్ ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయగా.. బియ్యం ఎగుమతికి అనుమతి ఇచ్చింది.

వియత్నాం తర్వాత మనకే ప్రాధాన్యం

ఫిలిప్పీన్స్ ప్రభుత్వం ఆహార అవసరాలు తీర్చుకోవడానికి వియత్నాం దేశంపై ఆధారపడుతోంది. వియత్నాం బియ్యం నాణ్యత కూడా బాగుంటుందని ఎగుమతిదారులు, అధికారులు చెబుతున్నారు. ఫిలిప్పీన్స్ ఏటా 40 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని వియత్నాం నుంచి దిగుమతి చేసుకుంటోంది. తెలంగాణ బియ్యాన్ని పరిశీలించిన ఫిలిప్పీన్స్.. తర్వాతి ప్రాధాన్యం మన రాష్ట్రానికే ఇవ్వడం గమనార్హం. ఇదిలా ఉండగా భారత్ నుంచి 150 దేశాలకు బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం ఈ జాబితాలో ఫిలిప్పీన్స్ లేదు. ఆ లోటును తెలంగాణ ప్రభుత్వం భర్తీ చేసిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ చెప్పారు.

ప్రాంతీయ ఆస్పత్రులకు బ్రాండింగ్

- తొలిదశలో 84 ఆస్పత్రుల ఎంపిక
- దశలవారీగా 202 ఆస్పత్రులకు బ్రాండింగ్

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 202 ప్రభుత్వ ఆస్పత్రులకు దశలవారీగా బ్రాండింగ్ చేయాలని సర్కారు నిర్ణయించింది. దీనిలో భాగంగా తొలిదశలో 84 ఆస్పత్రులను ఎంపిక చేశారు. సోమవారం వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ 84 ఆస్పత్రులలో వైద్యవిద్య సంచాలకుల (డీఎంఈ) పరిధిలో 44 ఉండగా, మరో 40 ఆస్పత్రులు తెలంగాణ వైద్యవిధాన పరిషత్ (టీవీవీపీ)పరిధిలో ఉన్నాయి. టీవీవీపీ పరిధిలోని 40ఆస్పత్రుల్లో మూడు జిల్లా ఆస్పతులు (కింగ్‌కోఠి, భువనగిరి, తాండూరు) ఉండగా, మిగిలిన 37 ప్రాంతీయ ఆస్పత్రులున్నాయి. అలాగే డీఎంఈ పరిధిలో ఒక్క హైదరాబాద్‌లోనే 10 ఆస్పత్రులున్నాయి. ఉస్మానియాకు కొత్త ఆస్పత్రిని నిర్మించనున్న నేపథ్యంలో దాన్ని బ్రాండింగ్ నుంచి మినహాయించారు. నిపుణులైన వైద్యులున్నా, ఉచితంగా శస్త్రచికిత్సలు, వ్యాధినిర్ధారణ పరీక్షలు చేస్తున్నా, ఉచితంగా మందులందిస్తున్నా సర్కారీ ఆస్పత్రులంటే ప్రజల కోణంలో చిన్నచూపు ఉంది. రోగులకు అరకొర సౌకర్యాలు, పరిశుభ్రత లేకపోవడం, వైద్యసిబ్బంది ప్రవర్తన సరిగా లేకపోవడం వంటివి సర్కారు ఆస్పత్రుల ప్రతిష్ఠ మసకబారడానికి ప్రధాన కారణాలని గుర్తించారు. బ్రాండింగ్‌లో భాగంగా ఇటువంటి అంశాలన్నింటిపైనా దృష్టి సారించనున్నారు. బ్రాండింగ్‌లో భాగంగా ఎన్ఎంసీ నిబంధనలు, చట్టబద్ధమైన నిబంధనలు, రోగులకు కల్పించే సౌకర్యాలు, పాలనపరమైన విషయాలపై సర్కారు దృష్టిసారించింది.

సీబీఐ కోర్టు తీర్పును కొట్టేయండి

- హైకోర్టులో గాలి జనార్దన్ రెడ్డి, తదితరుల అప్పీల్

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని కోరుతూ దోషులుగా తేలిన మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి, ఇతర నిందితులు సోమవారం హైకోర్టును ఆశ్రయించారు. ఆ కోర్టు ఇచ్చిన తీర్పును సస్పెండ్ చేసి తమకు బెయిల్ మంజూరు చేసేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఏ1 శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఏ2 మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి, ఏ3 వీడీ రాజగోపాల్, ఏ4 ఓబులాపురం మైనింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, ఏ7 అలీ ఖాన్‌లను కోర్టు దోషులుగా తేల్చింది. ఓఎంసీ కంపెనీకి జరిమానా.. నిందితులకు ఏడేళ్ల పాటు శిక్షను విధించింది. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐఏఎస్ కృపానందలకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలను లేనందున వారిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ పిటిషన్లు ఈనెల 21న హైకోర్టు వెకేషన్ బెంచ్ ఎదుట విచారణకు రానున్నాయి.

క్రిప్టో కరెన్సీ కేసులో మరో ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి) : తక్కువ సమయంలో ఎక్కువ లాభాల పేరుతో ప్రజల్ని పెద్ద మొత్తంలో మోసం చేసిన జీబీఆర్ క్రిప్టో కరెన్సీ కేసులో మరో ఇద్దరు నిందితుల్ని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇప్పటికే ప్రధాన నిందితులతోపాటు మరికొందర్ని సీఐడీ పోలీసులు ఇదివరకే అరెస్ట్ చేశారు. పట్టుబడ్డ నిందితులు ఇచ్చిన సమాచారం, విచారణలో లభించిన వివరాల మేరకు సికింద్రాబాద్ సైనిక్‌పురికి చెందిన కె. సుధాకర్, కె.రమేష్‌రెడ్డిని సీఐడీ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. జీబీఆర్ క్రిప్టో కరెన్సీ సుమారు 1,400 మంది నుంచి దాదాపు రూ. 95 కోట్లు వసూలు చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, పట్టుబడ్డ నిందితుల్ని జుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐడీ అధికారులు వెల్లడించారు.

77 మంది డీఎస్పీల బదిలీ

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా 77 మంది సివిల్ డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఈమేరకు డీజీపీ జితేందర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. చాలా కాలంగా పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నవారితోపాటు ఇటీవల డీఎస్పీలుగా పదోన్నతులు పొందిన వారికి ఈ బదిలీల్లో పోస్టింగులు ఇచ్చారు.



అఖండ దీపాలను అందజేస్తున్న మైసూరు రాజమాత ప్రమోదాదేవి

శ్రీవారికి 50కిలోల వెండి అఖండ దీపాలు

- విరాళంగా అందజేసిన మైసూరు రాజమాత

తిరుమల, మే19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి మైసూరు రాజమాత ప్రమోదా దేవి రెండు భారీ వెండి అఖండ దీపాలను సోమవారం విరాళంగా అందజేశారు. 300 ఏళ్ల కిందట అప్పటి మైసూరు మహారాజు స్వామికి సమర్పించిన అఖండదీపాలు పాడైపోవడంతో, వాటి స్థానంలో 50 కిలోల బరువుండే వెండి దీపాలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో అందజేశారు. దర్శనం అనంతరం ప్రమోదాదేవితోపాటు యదువర్ కృష్ణదత్త చామరాజు ఒడయార్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ ఆలయ అధికారులు నాలుగు నెలల కిందట మైసూరు ప్యాలెస్‌కు వచ్చి పాత అఖండదీపాలు పాడైపోయిన విషయం చెప్పారన్నారు. స్వామికి సేవ చేసుకోవడంలో భాగంగా తమ పూర్వీకుల ఆచారాన్ని కొనసాగించడానికి ఈ దీపాలను తిరిగి అందించామని చెప్పారు.

ఆర్ఆర్ఆర్‌లో భూమి పోతుందని రైతు ఆత్మహత్య

గజ్వేల్, మే 19 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డులో తన భూమి పోతుందనే ఆవేదనతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లి గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన ఇసుకంటి నర్సింహులు (45)కు చెందిన రెండు ఎకరాల భూమి హైదరాబాద్ రీజినల్ రింగ్‌రోడ్డులో భాగంగా ప్రభుత్వం సేకరిస్తోంది. భూసేకరణ పరిహారంపై ప్రభుత్వం ఎటూ తేల్చకపోవడంతో ఆర్డీవో కార్యాలయం చుట్టూ, గజ్వేల్ పట్టణంలోని నేషనల్ హైవే అథారిటీ కార్యాలయం చుట్టూ తిరిగి విసిగిపోయిన రైతు ఈ నెల 12న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా, సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. నర్సింహులుకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



నర్సింహులు (ఫైల్)

ఎంపీహెచ్‌ఏ రాత పరీక్ష ఫలితాలు విడుదల

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్‌ఏ-ఫిమేల్) పోస్టుల రాత పరీక్షా ఫలితాలను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సోమవారం విడుదల చేసింది. మొత్తం 1,931 పోస్టులకుగాను 20,600 మంది పరీక్ష రాసినట్లు బోర్డు కార్యదర్శి గోపికాంత్ రెడ్డి వెల్లడించారు. ఎంపీహెచ్‌ఏ పోస్టుల నోటిఫికేషన్ 2023లో విడుదల కాగా ఎన్నికల కోడ్ మూలంగా రాత పరీక్ష నిలిచిపోయింది. అలాగే పోస్టుల సంఖ్య పెంచడంతోపాటు కాంట్రాక్టు పద్ధతిలో ఉన్నవారికి వెయిటేజ్ పెంచాలన్న డిమాండ్ల కారణంగా భర్తీ ప్రక్రియ ఆలస్యమైంది. గతేడాది చివర్లో రాత పరీక్ష జరగ్గా తాజాగా మెడికల్ బోర్డు ఫలితాలను విడుదల చేసింది. మరోవైపు ఈ నెల 26న 1,284 ల్యాబ్ టెక్నీషియన్ (ఎల్టీ) పోస్టుల మెరిట్ జాబితాను బోర్డు విడుదల చేయనుంది. ఇప్పటికే ఈ పోస్టుల రాత పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. కాగా ఇప్పటికే సర్కారీ కొలువున్న వారికి వెయిటేజ్ అంశంపై వైద్య ఆరోగ్యశాఖ న్యాయ నిపుణుల సలహా తీసుకుంటోంది. సలహాలు తీసుకున్నాక స్టాఫ్‌నర్స్, ఫార్మసిస్టు, ఎంపీహెచ్‌ఏ (ఫిమేల్) పోస్టుల మెరిట్ జాబితాను విడుదల చేయనున్నారు.





భారీ కోటను తలపిస్తున్న వరంగల్ రైల్వే స్టేషన్, సోఫాలు, మొక్కలతో అందంగా ముస్తాబైన ప్రయాణికుల వెయిటింగ్ హాల్

ఎయిర్‌పోర్టుల్లా రైల్వే స్టేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

బ్రిడ్జిలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ర్యాంపులు, సరికొత్త టికెట్ కౌంటర్లు, స్నానాల గదులతో వాష్‌రూమ్‌లు, టీవీలు, వైఫై, ఆకట్టుకునేలా రూపొందించిన స్టేషన్ ముఖ ద్వారాలు, కనువిందు చేసే వెయిటింగ్ హాళ్లతో ఈ స్టేషన్లను అభివృద్ధి చేసింది. ప్రధాని మోదీ గురువారం వర్చువల్‌గా ప్రారంభించబోయే 103 రైల్వే స్టేషన్లలో ఈ మూడు స్టేషన్లు కూడా ఉన్నాయి. గత ఏడాది ఫిబ్రవరిలో వరంగల్ స్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది. కాకతీయుల కళా వైభవం ఉట్టిపడేలా రూ.25.41 కోట్లతో ఈ స్టేషన్‌ను తీర్చిదిద్దారు. ఎత్తైన శిలా స్తంభాలపై ఉన్న గజ రాజులు ప్రయాణికులకు స్వాగతం పలుకుతున్నట్లుగా స్టేషన్ ముందు ఏర్పాటు చేసిన శిల్పాలు ఆకట్టుకుంటున్నాయి. ప్లాట్ ఫాం గోడపై కాకతీయుల చిత్రాలను అందంగా వేశారు. స్టేషన్ ఆవరణలో పచ్చదనం ఉండేలా ల్యాండ్ స్కేపింగ్ చేశారు. స్టేషన్ ముందు కుడివైపు ఎలక్ట్రిక్ వాహనాల కోసం బ్యాటరీ స్వాపింగ్ పాయింట్ నిర్మించారు. గతఏడాది ఆగస్టు 6న కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను ప్రధాన మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. కరీంనగర్ నుంచి దక్షిణ మధ్య రైల్వేకు గూడ్స్ రవాణాతో రూ.కోట్ల ఆదాయం వస్తోంది. ప్రయాణికుల రద్దీ పెరగడంతో కరీంనగర్‌లో రెండు, మూడు ప్లాట్‌ఫాంలను కొత్తగా నిర్మించారు. ప్రస్తుతం ఉన్న స్టేషన్ భవనం పక్కనే మరో భవనాన్ని కట్టారు. రైల్వే స్టేషన్‌కు ఏర్పాటు చేసిన ఎలివేషన్, ఎల్ఈడీ లైట్లు ఆకట్టుకుంటున్నాయి. స్టేషన్ ముందు అతి పెద్ద జాతీయ జెండా, కనువిందు చేసేలా ల్యాండ్ స్కేపింగ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ రూ.25.85కోట్లతో చేపడుతున్న పనులు దాదాపు పూర్తయ్యాయి. గతఏడాది ఫిబ్రవరిలో ప్రధాని మోదీ బేగంపేట స్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జంటనగరాల్లో ముఖ్యమైన స్టేషన్లలో ఒకటైన ఈ స్టేషన్‌ను రూ.26.55 కోట్లతో ఆధునీకరించారు. వినూత్నంగా రూపొందించిన స్టేషన్ ఆర్కిటెక్చర్, పాల పిట్టలు స్వాగతం పలుకుతున్నట్టుగా ఉన్న ముఖద్వారం, స్టేషన్ ముందున్న ల్యాండ్ స్కేపింగ్ ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. సోమవారం ఈ స్టేషన్‌ను సందర్శించిన దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్.. అభివృద్ధి పనులను మీడియాకు వివరించారు.



బేగంపేట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల వెయిటింగ్ హాల్

అశ్వినీ వైష్ణవ్, కిషన్‌రెడ్డి పోస్టులు

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు ముంగింపు దశకు చేరుకున్నాయని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఆధునీకరించిన వరంగల్ రైల్వే స్టేషన్ చిత్రాలను ఆయన సోమవారం 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. గతేడాది ఫిబ్రవరిలో వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని, ఈ ఏడాది మే నాటికి పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల కల్పన, సౌకర్యాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద వరంగల్ రైల్వేస్టేషన్‌లో చేపట్టిన పనులు ముగింపు దశలో ఉన్నాయని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.





విభిన్న ఆకృతిలో కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆవరణ, అధునాతన సౌకర్యాలతో కూడిన టికెట్ బుకింగ్ కౌంటర్

జూన్ 2న సుదీర్ఘ వాదనలు వింటాం

- తెలంగాణ మెడికల్ సీట్లలో స్థానికత అంశంపై సుప్రీం

న్యూఢిల్లీ, మే 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మెడికల్ సీట్ల కేటాయింపులో స్థానికత అంశంపై జూన్ 2న సుదీర్ఘ వాదనలు వింటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికతకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం జీవో 33ను తీసుకొచ్చింది. నీట్‌కు ముందు నాలుగేళ్ల స్థానికంగా చదవాలని జీవో 33లోని నిబంధన 3(ఏ) స్పష్టం చేస్తోంది. దీనిని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కల్లూరి అభిరామ్ సహా 160 మంది హైకోర్టులో పిటిషన్లు వేశారు. సుదీర్ఘ వాదనల తర్వాత గత సెప్టెంబరు 5న హైకోర్టు సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు చెప్పింది. ఒక విద్యార్థి తెలంగాణలో నివసిస్తున్నాడని లేదా శాశ్వత నివాసి అని నిర్ధారించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలేవీ రూపొందించలేదని కోర్టు అభిప్రాయపడింది. తొలుత మార్గదర్శకాలు, నిబంధనలను రూపొందించాలని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సెప్టెంబరు 11న రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. అయితే, ఒకసారి మినహాయింపు కింద హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అంగీకారం తెలిపింది. దీంతో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. అయితే, ఆ తర్వాత మరికొంతమంది విద్యార్థులు తమకు కూడా స్థానికతను వర్తింపజేయాలని సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అన్ని పిటిషన్లపై సోమవారం సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది బసంత్ వాదనలు వినిపించారు. హైకోర్టు తీర్పుపై తదుపరి విచారణ వరకు మాత్రమే స్టే ఉంటుందని సెప్టెంబరు 20న సుప్రీం కోర్టు తెలిపిందని, దాన్ని మరోసారి పొడిగించవద్దని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున గోపాల్ శంకర్ నారాయణన్ వాదిస్తూ ఇతర రాష్ట్రాలకు వెళ్లి, మళ్లీ అవకాశాల కోసమే తిరిగి రాష్ట్రానికి వస్తున్నారని తెలిపారు. ఈ అంశంపై జూన్ 2న సుదీర్ఘ వాదనలు వింటామని చెబుతూ ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

ఆర్టీఐ కమిషనర్ల ఎంపికలో బీసీలకు అన్యాయం: జాజుల

బర్కత్‌పుర, మే 19(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్ట కమిషనర్ల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆరుగురు సమాచార కమిషనర్ల నియామకంలో అగ్రవర్ణాలకే ప్రాధాన్యం ఇచ్చారని, ఇది బీసీల ఆత్మగౌరవంపై జరిగిన దాడేనని స్పష్టం చేశారు. కమిషనర్ల నియామక నిర్ణయాన్ని 48 గంటల్లో ప్రభుత్వం పునఃసమీక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

రేపు భారీ వర్షాలు!

- 11 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- నేడూ అక్కడక్కడ పడే చాన్స్
- వడదెబ్బతో ఇద్దరి మృత్యువాత

హైదరాబాద్/ధారూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): ఈసారి ఎండాకాలం వానాకాలాన్ని తలపించింది. పొద్దంతా ఎండలు కాసినా సాయంత్రానికి వర్షాలు పడ్డాయి. కొద్ది రోజులుగా ఎండ తీవ్రత కంటే ఈదురుగాలులతో కూడిన వానలే ఎక్కువ కురిశాయి. మంగళవారం కొన్నిచోట్ల.. బుధవారం చాలాచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మేడ్చల్, మెదక్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, ములుగు.. మొత్తం 11 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశముందని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ కూడా జారీ చేసింది. మంగళవారం కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడతాయని వెల్లడించింది. ఇటు నైరుతి రుతుపవనాల విస్తరణకు అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో వాతావరణం అనుకూలంగా మారింది. దీంతో దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు, కొమరిన్ ప్రాంతం, దక్షిణ, మధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయి. వచ్చే రెండు రోజుల్లో మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయని వాతావరణశాఖ తెలిపింది. ఇక నారాయణపేట జిల్లా మక్తల్‌లో సోమవారం అత్యధికంగా 7.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవ్వగా, నిర్మల్ జిల్లా బీరెల్లిలో 41.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయింది. వడదెబ్బ తగిలి ఖమ్మం జిల్లా చింతకాని మండల వనరుల కేంద్రంలో పనిచేసే విద్యాశాఖ కాంట్రాక్టు ఉద్యోగి కవికొండల శ్రీనివాస వెంకటకృష్ణారావు (57), వైరా మునిసిపాలిటీలో రేకుల ముత్తమ్మ(49) మృతి చెందారు.

మండు వేసవిలో నిండుగా వాగు..

భారీ వర్షానికి వికారాబాద్ జిల్లా ధారూరు మండలంలోని ధర్మాపూర్ వాగు మండు వేసవిలోనూ ఉరకలెత్తింది. మండలంలోని పలు గ్రామాల్లో తాజాగా కురిసిన వానలతో ధర్మాపూర్ వాగులోకి వరద నీరు భారీగా చేరటంతో సాయంత్రం నుంచి ఉధృతంగా ప్రవహించింది.



వికారాబాద్ జిల్లాలో ప్రవహిస్తున్న ధర్మాపూర్ వాగు

బెంగళూరులో వర్ష బీభత్సం

నగరంలో ఎడతెరిపి లేకుండా వాన.. నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

బెంగళూరు, మే 19(ఆంధ్రజ్యోతి)/ముంబై: కర్ణాటక రాజధాని బెంగళూరులో వర్ష బీభత్సం సృష్టించింది. నగరవ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. నగరంలో 10.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు లోతట్టు ప్రాంతాలతో పాటు వాహనాలు నీట మునిగాయి. రోడ్లపైకి నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులపై నీళ్ల చెరువులను తలపించాయి. హెణ్బూరు ప్రాంతంలోని ఓ అనాథాశ్రమంలోకి వర్షపు నీరు చేరడంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం దాకా మంచాల పైనుంచి దిగే పరిస్థితి లేదు. కేఆర్ పురం పరిధిలోని సాయి లేఅవుట్‌లో ప్రజలు రెండో రోజూ ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. కాలనీలోని పలు ఇళ్లలోకి నీరు చేరింది. స్థానిక ఎమ్మెల్యే బైరతి బసవరాజ్ ఎక్స్‌కవేటర్‌పై ఎక్కి వివిధ ప్రాంతాలను సందర్శించారు. డ్రోన్‌ల ద్వారా పరిస్థితిని సమీక్షించి, సహాయక చర్యలు కొనసాగించారు. రబ్బరు బోట్లు ద్వారా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. యలహంకలోని అట్టూరు ప్రాంతంలో విశ్వనాథ ఆలయం నీట మునిగింది. ఈ ప్రాంతంలోని ఇళ్లలోకి కూడా నీరు చేరింది. నెలమంగళ మార్గంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై నాలుగు అడుగులకుపైగా నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సివిల్ డిఫెన్స్, పోలీసులు, అగ్నిమాపక అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. మహదేవపురలోని చన్నసంద్ర వద్ద రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న శశికళ(35) అనే మహిళపై గోడ కూలిపడటంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. కోరమంగళలోని అపార్ట్‌మెంట్‌లలోకి నీరు చేరింది. ఈ ప్రాంతంలో పలు ఇళ్లలోకి నీరు చేరి, ఎలక్ట్రికల్ వస్తువులు పాడైపోయాయి. నగరవ్యాప్తంగా సోమవారం మధ్యాహ్నం మరోసారి వర్షం కురిసింది. ఈ ప్రభావానికి ఎయిర్‌పోర్ట్ రోడ్డు ప్యాలెస్ గ్రౌండ్స్ వద్ద ఒక భారీ చెట్టు కూలి కారుపై పడింది. వర్ష ప్రభావిత ప్రాంతాలను పర్యటిస్తానని ప్రకటించిన సీఎం సిద్దరామయ్య.. ఉన్నఫళంగా ఆ కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. వార్ రూంకు చేరుకుని అధికారులతో సమీక్ష జరిపారు. వివిధ ప్రాంతాల్లో వర్షం ప్రభావంపై ఆరా తీశారు. కాగా, వాయువ్య భారతం నుంచి వీచే పొడిగాలుల కలయికతో ఏపీలో పలుచోట్ల సోమవారం ఉదయం ముసురు వాతావరణం నెలకొంది. కొన్ని జిల్లాల్లో పిడుగులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడ్డాయి.



కేఆర్ పురంలో బోట్ల ద్వారా ప్రజలను తరలిస్తున్న రెస్క్యూ సిబ్బంది

మహారాష్ట్రలో ఈనెల 25 వరకు వర్షాలు

మహారాష్ట్రలోని చాలా ప్రాంతాల్లో ఉరుములతో భారీ వర్షాలు కొనసాగాయి. రోజువారీ జనజీవనం స్తంభించడంతో పాటు రవాణా నిలిచిపోయింది. షిర్డీలోనూ భారీ వర్షాలు పడ్డాయి. కొల్హాపూర్‌లో పెనుగాలులు వీచాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్తుసరఫరాకు అంతరాయం ఏర్పడింది. వాతావరణ శాఖ నాలుగు జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్‌ను కొనసాగించింది. ఎల్లో అలర్ట్‌ను 29 జిల్లాలకు విస్తరించింది. ఇందులో ముంబై, థానే, పుణే వంటి నగర ప్రాంతాలు ఉన్నాయి. పుణేలో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. బీడ్ జిల్లా రాల్సంగ్వి గ్రామంలో వరదలు సంభవించాయి. ఒక బ్రిడ్జి మునిగిపోవడంతో పాటు సమీపంలోని నాలుగు గ్రామాలకు రాకపోకలు బంద్‌అయ్యాయి. రానున్న రోజుల్లో తమిళనాడు, కేరళ, కర్ణాటక, మధ్య రీజియన్లకు ఈ వర్షాలు విస్తరించనున్నాయని ఐఎండీ శాస్త్రవేత్త అఖిల్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఈ నెల 25 వరకు మహారాష్ట్రలో వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ పేర్కొంది.

మీ నాయకత్వ ప్రతిభ అద్భుతం

- సీఎం చంద్రబాబుకు బిల్ గేట్స్ ప్రశంసలు
- టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన సేవలు
- కలిసికట్టుగా ఏపీ భవిష్యత్‌కు పనిచేద్దాం
- బాబుకు రాసిన లేఖలో బిల్ గేట్స్ వ్యాఖ్య

అమరావతి, మే 19 (ఆంధ్రజ్యోతి): 'మీరు ఆశించే ఏఐ డ్రివెన్ డెసిషన్ మేకింగ్, రియల్ టైమ్ డేటా సిస్టమ్, హ్యూమన్ కేపిటల్ డెవలప్‌మెంట్ వంటివి మీ నాయకత్వ ప్రతిభను ప్రస్ఫుటం చేస్తున్నాయి. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వ సేవల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు మీరు చేస్తున్న కృషి ఆంధ్రప్రదేశ్‌కే కాదు భారత్ సహా అల్పాదాయ దేశాలకు ఎంతో ఉపయోగపడుతుంది' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుపై గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ప్రశంసల వర్షం కురిపించారు. కొద్ది రోజుల క్రితం ఢిల్లీలో గేట్స్ ఫౌండేషన్‌బృందంతో ఏపీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం, సమావేశాన్ని ప్రస్తావిస్తూ సీఎంకి ధన్యవాదాలు తెలుపుతూ బిల్ గేట్స్ లేఖ రాశారు. ఈ లేఖలో చంద్రబాబు కృషిని కొనియాడారు. పేదలు - అట్టడుగువర్గాల విద్య, ఆరోగ్యం, వ్యవసాయ ఉత్పత్తుల అభివృద్ధి విషయంలో గేట్స్ ఫౌండేషన్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడాన్ని అభినందిస్తున్నానని ఈ సందర్భంగా బిల్ గేట్స్ పేర్కొన్నారు. ఆరోగ్య రంగాన్ని పటిష్ఠపర్చడం, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్, ఏఐ అసిస్టెడ్ క్లినికల్ డెసిషన్ మేకింగ్, మెడ్‌టెక్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దడం, వ్యవసాయంలో నాణ్యమైన విత్తనాల తయారీ, సాయిల్ హెల్త్ పర్యవేక్షణ, తల్లీబిడ్డల ఆరోగ్యానికి సూక్ష్మపోషకాలు అందించే అంశాలపై చంద్రబాబుతో జరిపిన చర్చ ఎంతో ఫలవంతంగా ఉందని బిల్‌గేట్స్ లేఖలో ప్రస్తావించారు. పాలనలో టెక్నాలజీ, ఇన్నోవేషన్‌ను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మీరు చూపిన ఆసక్తి మీ చిత్తశుద్ధికి.. విజన్‌కు నిదర్శనమని గేట్స్ ప్రశంసించారు. ఈసారి తాను భారత్ పర్యటనలో భాగంగా ఏపీకి వచ్చేనాటికి చంద్రబాబు నాయకత్వంలోతమ భాగస్వామ్యం అద్భుతమైన పురోగతిని సాధిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. గేట్స్ ఫౌండేషన్-ఏపీ ప్రభుత్వ భాగస్వామ్యం మున్ముందు కొనసాగాలని, కలిసికట్టుగా పనిచేసి రాష్ట్ర భవిష్యత్తుపై సానుకూల ప్రభావాన్ని చూపాలని ఆశిస్తున్నట్లు గేట్స్ తన లేఖలో పేర్కొన్నారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.